నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

ఏప్రిల్ 1959

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం
గాంధీనగరం * విజయవాడ-2

నవ భారతి ❖ ఏప్రిల్ 1959

విషయ సూచిక

చిత్రములు



" బుద్ధం శరణం గచ్ఛామి "

చిత్రశిల్పి : శ్రీ డి. వి. ప్రసాద్



మద్యాసంరణం

*

చిత్రశిల్పి :

శ్రీ కె. రాజయ్య.

న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 1 | విజయవాడ * ఏప్రిల్ 1959 | సంచిక 9

ఏ ది ఆ చ ర ణీ య ం ?

అఖిలభారత కాంగ్రెస్ సంఘం సహకార వ్యవసాయము, సమిష్టి వ్యవసాయము, తన విధ్యుక్త ధర్మమని నిర్వచించింది. ఇది ఈనాడు భారతప్రజల ముందున్న సమస్య. సహకార వ్యవసాయము, సమిష్టి వ్యవసాయము మనం ఇంతవరకూ పత్రికలలోను, గ్రంథాలలోను చదువుతూ వచ్చాం. మనకిదంతా క్రొత్త అనుభవమే. మన ప్రజలు వ్యక్తిగతంగా చేస్తున్న సేద్యంలోనే లోపం ఉంది. ఈ లోపాన్ని సవరించుకోకుండా ఉత్తమ వ్యవసాయపద్ధతులను ఆచరించకుండా సహకార వ్యవసాయాన్ని, సమిష్టి వ్యవసాయాన్ని నిర్వహించడం కష్టమనే జంకు బహుజనులలో ఉంది. ఇది వాస్తవం. ఈవాస్తవాన్ని కాదని త్రోసివేయడం విజ్ఞత అనిపించుకోదు.

మన వ్యవసాయ విధానం ఇప్పుడిప్పుడే మార్పు చెందుతోంది. ఈ మార్పు దేశవ్యాప్తం కావాలి. వ్యక్తిగతంగా వ్యవసాయం చేసే పద్ధతిలో నైపుణ్యము, జాగరూకత, శ్రద్ధ, ఆసక్తి, భక్తి తత్పరతలు నిండి ఉంటాయి. ఇవి మనిషిలోని ఆశాపూరిత హృదయాన్ని ఉద్విగ్నపరచి స్వసుఖాపేక్షాభిలాషతో స్వయం కృషిని పెంపొందించి, వ్యక్తి సుఖజీవనానికి తోడ్పడేలా చేస్తాయి. జాతీయ జీవనంలో వ్యవసాయంచేసే ప్రతివ్యక్తికీ ఇది సామాన్య ధర్మంగా ఉంటుంది. ఈ సామాన్య ధర్మాన్ని ఉన్నత ధర్మంగా పరిణతి చెందేటందుకు దోహదం చెయ్యడమే సహకార సమిష్టి వ్యవసాయాల కర్తవ్యమై ఉంది. అయితే ఈ బాధ్యతను నిర్వర్తించడానికి వ్యవసాయ జ్ఞానం గల వ్యక్తు లెందరున్నారు? వ్యక్తిగతంగా వ్యవసాయదారుడు చేయవలసిన కృషికి దోహదం చేసే విజ్ఞతను పెంపొందించడం ఎలా? తన భూమిపై తనకున్న స్వంత యాజమాన్యాన్ని సహకార సమిష్టి వ్యవసాయ క్షేత్రాల అదుపులో పెట్టి తన తనాన్ని తగ్గించుకొని సమిష్టి సహకార పద్ధతిని అలవరిచేది ఎలా? ఇంకా ఇలా అనేక ప్రశ్నలు ఈ క్రొత్తపద్ధతిని అనుసరించడంలో ఉత్పన్న మవుతున్నాయి వీటికి పరిష్కారమార్గం కల్పించకుండా ప్రశ్నార్థకంగానే సహకార సమిష్టి వ్యవసాయాలపై అపోహలను పెంచేవార్తలను వ్యాప్తం చేస్తున్నారు.

సహకార వ్యవసాయము, సమిష్టి వ్యవసాయము చైనా రష్యాలలో ఒక తీరుగా ఉంది. అమెరికా మొదలైన దేశాలలో మరొక విధంగా ఉంది, మన దేశంలో ఏవిధంగా రూపొందుతుందో ఇప్పటికిమాత్రం దురూహ్యంగా ఉంది.

వ్యవసాయకృషి చేసేవారికీ, వ్యవసాయ కృషినిగురించి చెప్పేవారికీ పొత్తు కుదరడంలేదు. ఇదే సహకారసమిష్టి వ్యవసాయ విధానాలమీద ఉన్న అపోహలు కారణం.

తీర్మానాలు చేయించేవారు సేద్యం తీరు-తెన్నులు తెలియకుండా సేద్యాన్ని గురించి నిర్వచనలు చేసేస్తున్నారు. వ్యవసాయంపై కృషి చేస్తున్నవారు తమంతట తాముగా వ్యవసాయ కృషిలో నైపుణ్యం సంపాదిస్తూ దేశంలో ఎవరితోనూ పొత్తు కుదరని రీతిలో ప్రవర్తిస్తున్నారు. వీరిద్దరి పద్ధతినీ సమన్వయం చేయగలిగితే సహకార సమిష్టి వ్యవసాయాల విధానం ప్రయోజనకరంగా మార్పు చెందడానికి అవకాశం ఏర్పడవచ్చు.

రష్యా, చైనాలు కమ్యూనిస్టుపార్టీ యాజమాన్యంలో సమిష్టి వ్యవసాయ విధానంయొక్క ప్రయోజనాన్ని సాధిస్తున్నాయి. ఆ పద్ధతి నిరంకుశమైంది. అక్కడ సేద్యంచేసేవానికి స్వతంత్రత లేదు. అందువల్లనే ఒకరు చెప్పడం, మిగతావారు అనుసరించడం, తద్వారా ప్రయోజనం సాధించడం జరుగుతుంది. ఇది మన సహకార సమిష్టి సేద్యాలకు వర్తించదని కాంగ్రెస్ పదేపదే చెప్పేస్తున్నది. మనంమన ఇష్టా ఇష్టాలపై సహకార సమిష్టి సేద్యాలలో చేరవచ్చు. అంతేగాని కాంగ్రెస్ పక్షం, శాసించి సహకార సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో సభ్యులుగా చేర్పించదు. కృషి చేయించదు. అంటే సభ్యులుగా చేరమంటుంది. కృషి చేయమంటుంది. ఇందులో బలవంతంలేదు. నిర్బంధంలేదు. మనకు ఇష్టం ఉంటే చేరనూవచ్చు, లేకపోతే మాననూ వచ్చు. ఇదీ విషయం.

రష్యా, చైనాలు అధికంగా పంటలు పండిస్తున్నాయి. మనంకూడా అధికంగా పంటలు పండించాలి. వారి పద్ధతులలో కాకుండా మనం మనపద్ధతులు రూపొందించుకొని వారికన్నా అధికంగా పంటలు పండించాలి! పంటలు పండించడంలో పోటీ పడాలి! ఇది స్వయం నిర్ణయ సూత్రప్రకారం జరగాలి. ఇందులో అణుమాత్రంకూడా నిర్బంధంలేదు. స్వతంత్ర ప్రతిపత్తికి భంగం కలుగదు. పని చెయ్యాలి, పంట పండిం

చాలి. సహకారం చెయ్యాలి, సామరస్యం పెంపొందించుకోవాలి. ఇందులో యాజమాన్యం ఎవరిదీ, అన్న ప్రశ్నే వేసుకోకూడదు. యాజమాన్యం ఎవరిదైనా, అందరూ అందరితో సహకారం చేసుకొని వ్యవసాయం పురోభివృద్ధి చెందేలా ప్రవర్తించాలి.

మనది ప్రజాస్వామ్యం. మన ప్రజల ఇష్టా ఇష్టాలపై మన వ్యవసాయ పురోభివృద్ధి ఆధారపడి ఉంది. వ్యక్తిగత యాజమాన్యమా ? సహకార యాజమాన్యమా ? సమిష్టి యాజమాన్యమా ? ఇందులో మనకు ఏది హితవు కలిగించేదీ అన్న ప్రశ్న అందరూ వేసుకొని సమాధానం చెప్పుకోవాలి. ప్రతి ఒక్కరూ ఈప్రశ్నలు వేసుకొని సమాధానాలు చెప్పుకోగలిగితే మన వ్యవసాయ పురోభివృద్ధికి పరిష్కార మార్గం ఏర్పడుతుంది.

మన దేశంలో అనేక రాజకీయ పక్షాలున్నాయి. వ్యవసాయ పురోభివృద్ధికి దోహదంచేసే విధంగా విషయాలను తర్కించడంలేదు. విషయవిపులీకరణ లేకుండా దేశం పురోభివృద్ధి చెందడం సంభవంకాదు. మనదేశం పురోభివృద్ధి చెందడానికి మన దేశంలోని రాజకీయ పక్షాలు విమర్శనాజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. సహకార సమిష్టి వ్యవసాయాలయొక్క ప్రయోజనాన్ని గురించి తర్కించాలి. మంచిచెడ్డలను వివరించి దేశానికి హితమైన మార్గం ఇదీ అని సుస్పష్టంగా ప్రకటించగలగాలి. కాంగ్రెస్ ఒక్కటిమాత్రమే ఈ దేశంలోని వ్యవసాయ సమస్యలన్నింటినీ పరిష్కరించాలనీ, ఒకవేళ అది పరిష్కరించలేకపోతే దాని అసమర్థతను అదే రుజువు చేసుకుంటుందనీ నిరీక్షించడంవల్ల ప్రయోజనం లేదు.

లోగడ మన దేశంలో జాయింటు కుటుంబ వ్యవసాయపద్ధతి ఒకటి అమలులో ఉండేది. అది క్రమక్రమంగా క్షీణించిపోయింది. అది ఒక విధమైన సహకార విధాన మనే చెప్పాలి. ఆ విధానం ఎందువల్లనో నిర్మూలింపబడింది. ఈనాడు మనం మన దేశంలో కాంగ్రెస్ చెప్పిన పద్ధతినకాక మరొక పద్ధతిలో వ్యవసాయ విధానాన్ని ఎలా రూపొందించాలో వివరించి చెప్పవలసిన అవసరం ఉంది. మన ప్రజల ఆలోచనలకు, మన ప్రజల సంప్రదాయాలకు, మన ప్రజల నాగరికతకు, మన ప్రజల సంస్కారానికి, మన ప్రజల సంస్కృతికి వ్యక్తి యాజమాన్యంలో వ్యవసాయం చెయ్యాలా, సహకార యాజమాన్యంలో వ్యవసాయం చెయ్యాలా, సమిష్టి యాజమాన్యంలో వ్యవసాయం చెయ్యాలా? అన్న పద్ధతిలో వాదోపవాదాలకు దిగక ఈ మూడు విధానాలనూ తమ తమ ఇష్టాలపై ఆధారపడి నిర్ణయించుకుని నడుచుకోవడంలో ప్రజాస్వామ్యం పురోభివృద్ధి చెందుతుందో లేదో యోచించి నిర్ణయించుకోవలసిన అవసరం ఉంది. ఇది వారివారి విజ్ఞత, వివేకాలపై ఆధారపడి ఉంది.

కాంగ్రెస్‌నుగాని, మంత్రివర్గాలనుగాని నిష్కారణంగా దూషించితే ప్రయోజనం మాత్రం ఉండదు. మన పురోభివృద్ధికి దోహదంచేసే ఉత్తమమైన మార్గాన్ని మనమందరం ప్రజలకు విశదంచేసి చిత్త సంస్కారాన్ని పెంపొందించుకోవాలి.

అప్పుడే మన వ్యవసాయం పురోభివృద్ధి చెందుతుంది. మనలో మనం సహకరించుకొని సామరస్యాన్ని పెంపొందించుకొని, మానవత్వాన్ని రూపొందించుకొని, మంచి మార్గంలో నడచుకొన్నప్పుడే మనం మన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించుకున్న వాళ్ళం కాగలం.

★

శ్రీ జగన్నాథ పండితరాయ విరచిత

గంగాలహరి

అనువాదకులు : డాక్టర్, శ్రీ బూర్గుల రామకృష్ణరావు

౨

పురోధావం ధావం ద్రవిణమదిరా ఘూర్ణితదృశాం
మహీపానాం నానాతరుణతర ఖేదస్య నియతమ్।
మమైవాయం మంతుః స్వహిత శతహంతుర్జడధియో
వియోగస్తే మాతర్యదిహ కరుణాతః క్షణమపి॥

తల్లీ నిన్విడనాడి విత్తమదిరాతంద్రాతు భూపాల లా
స్యోల్లాసమ్మున ముందుబర్విలిడి, యయ్యో దుర్వ్యథాయుక్తి గా
సిల్లంబోవు జడుండఁ బాతకిని, స్వశ్రేయశ్శతఘ్నుండ, ను
త్ఫుల్ల శ్రీకరుణారస మ్మొలుకు మీ ప్రేమోలన్ క్షణమ్మేనియున్. ౧౯

మరుల్లీలాలోలల్లహరి లులితాం భోజపటలీ
స్ఖలత్పాంసువ్రాత చ్ఛురణ విసరత్కౌంకుమరుచి।
సురస్త్రీ వక్షోజ క్షరదగరుజంబాల జటిలం
జలంతే జంబాలం మమజననజాలం జరయతు॥

వాతోత్తుంగ తరంగసంగి కమల వ్రాతోచ్చల త్పాంసువుల్
శీతాంభః కణరాజిఁ గౌంకుమరుచి శ్రీరాగముల్ నింప, నో
మాతా! దేవవధూకుచాగురుగల న్మాలిన్య జంబాలమౌ
నీతోయమ్ము హరించుఁ గాత వృజినానీకార్తిజంబాలమున్. ౨౦

సముత్పత్తిః పద్మారమణ పదపద్మామలనఖాత్
నివాసః కందర్ప ప్రతిభట జటాజూట భవనే।
అథాఽయం వ్యాసంగో హతపతిత నిస్తారణ విధౌ
నకస్మా దుత్కర్షస్తవ జనని జాగర్తు జగతః॥

ముని పద్మాపతి పాదపద్మ నఖమా పుట్టిల్లు! ఆవాసమున్
ఘనగౌరీశ జటాకుటీ భవనమా! కార్యక్రమమ్మున్ఁ బత
జ్జననిస్తారణమా! బళీ! యెవరికీ సంపత్తి యుత్కర్ష? మే
దిని నీకే కలదమ్మ దివ్యతటినీ! దీవ్యద్రసోల్లాసినీ. ౨౧

నగేభ్యోయాంతీనాం కథయ తటినీనాం కతమయా
పురాణాం సంహర్తుః సురధుని కపర్దోఽధి రురుహే।
కయావా శ్రీభర్తుః పదకమల మక్షాళి సలిలై
స్తులాలేశో యస్యాం తవ జనని దీయేత కవిభిః॥

కొండల్ దూకుచు నిండి పారునదులీ గోళమ్మునన్ మెండుగా
నుండన్ బోలుఁ, బురారి దుర్ధమ కపర్దోల్లాసయై, భక్తి లో
నిండారన్ హరి పాదపద్మ యుగమున్ నిత్యమ్ము క్షాళించు వే
ఱొండేదేనది నీకు సాటిగలదే? యున్నన్ గవుల్ చెప్పరే? ౨౨

విధత్తాం నిఃశంకం నిరవధి సమాధిం విధిరహో
సుఖంశేషే శేతాం హరిరవిరతం నృత్యతు హరః।
కృతం ప్రాయశ్చిత్తైరలమథ తపోదాన యజనైః
సవిత్రీ కామానాం యది జగతి జాగర్షి జనని॥

ఈవు సవిత్రివై ప్రజలకెల్ల మనోరథదాత్రివై భువిన్
గావఁగ, జాలునింకఁ గ్రతుకల్పము దానతపో వితాన సం
భావన, ధాత నిశ్చలసమాధి వసించుత, శేషశాయి ని
ద్రావశుఁడౌత, శూలి సతతమ్మును దాండవ మాడుచుండుతన్. ౨౩

అనాథః స్నేహార్ద్రాం విగలితగతిః పుణ్యగతిదాం
పతన్విశ్వోద్ధర్త్రీం గదవిగలితః సిద్ధభిషజమ్ ।
సుధాసింధుం తృష్ణాకులిత హృదయో మాతరమయం
శిశుః సంప్రాప్త స్త్వామహమిహ విదధ్యాః సముచితమ్॥

ఏనొక దిక్కులేని పసి, నీవు కృపాధుని; దారిలేనివాఁ
డేనును నీవు పుణ్యగతి, వేనొక భ్రష్టుఁడ విశ్వమెత్తుదీ,
వేనొక రోగి, సిద్ధఘుటి వీవు, సుధానిధి వేఁదృషార్తుడన్,
నేనొక బిడ్డ నమ్మవుగదే; యుచిత మ్మొనరింపు వచ్చితిన్. ౨౪

విలీనో వై వైవస్వత నగర కోలాహల భరో
గతా దూతా దూరంక్వచిదపి పరేతాన్ మృగయితుమ్ ।
విమానానాం వ్రాతో విదలయతి వీథీర్దివిషదాం
కథాతే కల్యాణి యదవధి మహీమండలమగాత్॥

అదె కోలాహలమాఁగె నా యమపురిన్, అందేగిరా దూతలె
య్యదియే నొక్కశవమ్ము లభ్యమగునా యంచున్; విమానాళిచే
నదెసమ్మర్దమునందె స్వర్గపుర రథ్యాసీమలమ్మా! శుభా
స్పదమై నీకథ యెంతదాక యవనిన్ వ్యాపించె నందాకనున్. ౨౫

స్ఫురత్కామక్రోధ ప్రబలతర సంజాత జటిల
జ్వరజ్వాలాజాలజ్వలిత వపుషాం నః ప్రతిదినమ్ ।
హరంతాం సంతాపం కమపి మరుదుల్లాసలహరీ
ఛటాచంచత్పాథః కణసరణయో దివ్యసరితః॥

పరమక్రోధ మదజ్వరజ్వలన తజ్జ్వాలాజ్వల ద్దేహులై
పరితాపంపడు మమ్ము బోటుల మహాపాపమ్ము సంతాపమున్
మరుదుల్లాసిత లాస్యమానలహరీ మాలావిశీర్ణాంబుశీ
కరసేకమ్ము హరించుఁ గావుత సుధాకల్పం బనల్పంబుగన్. ౨౬

ఇదంహి బ్రహ్మాండం సకలభువనా భోగభవనం
తరంగై ర్యస్యాంతర్లుఠతి పరిత స్తిందుక మివ ।
సఏష శ్రీకంఠ ప్రవితత జటాజూట జటిలో
జలానాం సంఘాత స్తవ జనని తాపంహరతునః॥

భవనమ్మై పదునాల్గు లోకములకున్ బ్రహ్మాండ భాండమ్ముగా
నవురా! నీ కెరటాలపైఁ దుమికి పండట్టిట్లు తారాడు, నా
శివవిస్తార జటాకుటీ కుటిల వీచీ జాలడోలావిలో
లవిలాసమ్మగు నంబురాశి పరమాహ్లాదమ్ము సంధించుతన్. ౨౭

త్రపంతే తీర్థాని త్వరితమిహ యస్యోద్ధృతి విధౌ
కరం కర్ణే కుర్వంత్యపి కిలకపాలిప్రభృతయః ।
ఇమంతం మామంబ త్వమియ మను కంపార్ద్ర హృదయే
పునానా సర్వేషా మఘమథనదర్పం దలయసి॥

ఎవనిం ద్రోవగ దీర్ఘజాలముల యేయే వేళ సిగ్గిల్లునో,
యెవనిన్ వింటకునున్ గపాలిముఖు లెంతేనిన్ జెవుల్ మూసికొం
డ్రవనిన్ నన్నిటువంటి పాతకిని మాయమ్మా! కృపాసారమా
ర్ధవమై యేలవె పాపనిర్మథన దర్పధ్వంసినీ! స్వర్ధునీ. ౨౭

శ్వపాకానాం వ్రాతైరమితవిచికిత్సా విచలితై
ర్విముక్తానా మేకం కిలసదనమేనః పరిషదామ్ ।
అహోమాముద్ధర్తుం జనని ఘటయంత్యాః పరికరమ్
తవ శ్లాఘాంకర్తుం కథమివ సమర్థో నరపశుః॥

శ్వపచుల్ సందియమంది వీడిన మహాపాపాల కావాలమౌ
యపరాధిన్ నను నద్వితీయ దురితవ్యాలోలు మాతా! దయన్
శపథంబూని సముద్ధరింపగ గతిన్ జక్కంగ బంధించునీ
కృపనెన్నంగ సమర్థుడే నృపశువై క్రీడించు వీడెన్నడేన్. ౨౮

నకోఽప్యేతావన్తం ఖలు సమయమారభ్య మిలితో
యదుద్ధారా దారాద్భవతి జగతో విస్మయభరః ।
ఇతీమా మీహాంతే మనసి చిరకాలం స్థితవతీ
మయం సంప్రాప్తోఽహం సఫలయతు మంబ ప్రణయినః॥

ఎవని సముద్ధరింప జగమెల్లను నచ్చెరువందు నంతవా
డవుర తనంత నింతవరకక్కట చిక్కన లేదటంచు నీ
కవిరళ చింత యింతవరకైనది, దాని ఫలింపచేయ వీ
డవనిని దాపురించెను గదమ్మ వడిన్ గరుణింపు జాహ్నవీ. ౩౦

శ్వవృత్తి వ్యాసంగో నియతమథ మిథ్యాప్రలపనమ్
కుతర్కేష్వభ్యాసః సతతపరపైశున్యమననమ్ ।
అపిశ్రావంశ్రావం మమతు పునరేవం గుణగణా
నృతే త్వత్కోనామ క్షణమపి నిరీక్షేత వదనమ్॥

వ్యాసంగమ్మె శ్వవృత్తియై, యనృత వాగ్వ్యాపార దుస్తర్కమ
భ్యాసమ్మె సతతమ్మునున్ బరుల యాపైశున్య మభ్యాసమై
వాసింగన్న మదీయ దుర్నయ గుణవ్రాతమ్ము లాలించియా
వేసమ్మే మొగమేరు సూచెదరు తల్లీ! నీవు గాకుండినన్. ౩౧

విశాలాభ్యామాభ్యాం కిమిహ నయనాభ్యాం ఖలుఫలం
నయాభ్యామాలీఢా పరమ రమణీయా తవ తనుః ।
అయంహిన్యక్కారో జనని మనుజస్య శ్రవణయో
ర్యయోర్నాంతర్యాతస్తవ లహరిలీలా కలకలః॥

జననీ! నీరసనీయ సుందరవపు స్సందర్శ నమ్మీగినన్
గనులింతింతలు గల్గి యేమిఫలమా కర్ణాంత విశ్రాంతముల్,
గను మందాకిని! చేటలంత చెవులేలా నీదులీలా విమో
హన వీచీకల గీతికా కలకల మ్మాలింప లేకుండినన్. ౩౨

విమానైః స్వచ్ఛన్దం సురపురమయన్తే సుకృతినః
పతంతి ద్రాక్పాపా జనని నరకాంతః పరవశాః ।
విభాగోఽయం తస్మిన్న శుభమయమూర్తౌ జనపదే
నయత్రత్వల్లీలా దలితమనుజా శేషకలుషా॥

సురపురిఁ గాంత్రు పుణ్యులదె చొక్కి యథేచ్ఛ విమానయానులై
పరవశులై యపుణ్యు లొకవంకఁ బడన్ నరకానఁ; దోచుఁ నీ
సరణి యభాగ్య దేశమున, సర్వమహో దురితాపహార సుం
దరివగు నీ దరిన్ మఱి, ద్విధాగతియాగతిలేగు, స్వర్ధునీ. ౩౩

అపిఘ్నంతో విప్రానవిరత ముశన్తో గురుసతీః
పిబన్తో మైరేయం పునరపి హరన్తశ్చ కనకమ్ ।
విహాయ త్వయ్యన్తే తనుమతను దానాధ్వరజుషా
ముపర్యంబ క్రీడంత్యఖిల సురసంభావిత పదాః॥

అవిరత విప్రఘాతుకులు నయ్యు, నయో! గురుతల్పగాములై
యవిరళ మద్యపానరతులై మఱి స్వర్ణము దొంగిలించియున్
బ్రవిమలమైన నీదు దరిఁ బ్రాణము వాసిరొ, సంచరింత్రువా
రపుర వితాన దానపరు లందరిపై సురబృందవంద్యులై. ౩౪

అలభ్యం సౌరభ్యం హరతి సతతంయః సుమనసాం
క్షణాదేవ ప్రాణానపి విరహ శస్త్రక్షత హృదాం ।
త్వదీయానాం లీలాచలిత లహరీణాం వ్యతికరాత్
పునీతేసోఽపి ద్రాగహహాః పవమాన స్త్రిభువనమ్॥

సుమనోఽలభ్య సుసౌరభమ్ముల హరించున్ బొంచి యెల్లప్పుడా
నిముసానన్ బ్రవియోగ శస్త్రహత హృన్నీ రేజ మందుండి ప్రా
ణములం దీయుచు, నీవిలోలలహరీ సహ్యాంబు సంపర్కలా
భమునన్ గాదె త్రిలోకపావనత సంపాదించెడిన్ వాయువున్. ౩౫

కియన్తః సన్త్యేకే నియతమిహ లోకార్థ ఘటికాః
పరే పూతాత్మానః కతిచ పరలోక ప్రణయినః ।
సుఖంశేతే మాతస్తవఖలు కృపాతః పునరయం
జగన్నాథః శశ్వత్త్వయి నిహితలోకద్వయభరః॥

కలరీ లోకమునందుఁ గొందరు జగత్కల్యాణ సంధాయకుల్
కలరాముష్మికపుణ్య సౌఖ్యములునున్ గల్పించు ధన్యాత్ములి
వ్వల లోకద్వయ సౌఖ్యభారమిది నీపై నీ జగన్నాథుఁడున్
జలియంపండదె నిద్ర నీదగు కటాక్ష వ్యాపృతిం జూచితే? ౩౬

భవత్యాహి వ్రాత్యాధమ పతిత పాఖండ పరిషత్
పరిత్రాణ స్నేహః శ్లథయితు మశక్యః ఖలుయథా ।
మమాప్యేవం ప్రేమా దురితనివ హేష్వంబ జగతి
స్వభావోఽయం సర్వైరపి ఖలు యతో దుష్టరిహరః॥

నీవేరీతిని వ్రాత్యులన్ బతితులన్ నీచాతి నీచాత్ములన్
గావన్ భావము వీడలేవొ యటులేఁ గావమ్మ పాపాళిపై
భావమ్మత్తి మరల్పనేర నయితిన్, భావింపు మెవ్వారికిన్
ద్రోవన్ రాదుగదే స్వభావము, ననున్ దోషాత్ముగా నెన్నకే ౩౭

ప్రదోషాన్తర్నృత్యత్పుర మథనలీలో ద్ధృతజటా
తటాభోగప్రేంఖల్లహరి భుజసంతాన విధుతిః ।
బిలక్రోడ క్రీడ జ్జలడమరుటంకారసుభగ
స్తిరోధత్తాం తాపం త్రిదశతటినీ తాండవ విధిః॥

సాయంనర్తకుఁడైన శంభుని విలాస ప్రోద్ధృతోద్యజ్జటా
చ్ఛాయాంతః ప్రచలత్తరంగ సుభుజా సంతాన సంధూతియుక్
తోయోద్ధూత దరీబిలాంత డమరూద్భూతోరుటంకారను
శ్రేయశ్శ్రీనటనమ్ము తాపవితతిన్ జెండాడుగా కెప్పుడున్. ౩౮

సద్వై పత్వయ్యే వార్పిత కుశలచింతా భరమిమం
యదిత్వం మామంబత్యజసి సమయేస్మిన్ సువిషమే ।
తదావిశ్వాసోఽయం త్రిభువన తలాదస్తమయతే
నిరాధారా చేయం భవతి ఖలు నిర్వ్యాజ కరుణా॥

నీపైనుంచి శుభార్థచింతన మతిన్ నేనిట్లు వర్తింపగా
నాపై నీవిషమస్థితిన్ గనలి యన్యాయమ్ము గావింప, నీ
కోపమ్మస్తగత మ్మొనర్చు ధరనే కొంచెమ్మొ విశ్వాసమున్,
బ్రాపుంబాయునయో యకారణ కృపాస్వాదుత్వమున్ జాహ్నవీ. ౩౯

కపర్దా దుల్లస్య ప్రణయ మిలదర్ధాంగ యువతేః
పురారేః ప్రేంఖన్త్యో మృదులతర సీమాంతసరణౌ ।
భవాన్యా సాపత్న్య స్ఫురితనయనం కోమల రుచా
కరే ణాక్షిప్తాస్తే జనని విజయన్తాం లహరయః॥

హరుని జటాటవిన్ దొలఁకి యర్ధశరీరిణియైన గౌరి యా
శిరమున నిండుపాపిటను జిందులు ద్రొక్కి సపత్నవృత్తిచే,
మిరమిర నామెచేతి యెగమీటున నీటులుగుల్కి చల్వతుం
పురులురలించి నించి మదిఁబొంగెడు నీ లహరుల్ జయించెడిన్. ౪౦

ప్రపద్యన్తే లోకాః కతిన భవతీ మత్రభవతీ
ముపాధిస్తత్రాయం స్ఫురతి యదభీష్టం వితరసి ।
శపేతుభ్యం మాతర్మమతు పునరాత్మా సురధుని
స్వభావాదేవ త్వయ్యమితమనురాగం విధృతవాన్॥

కూరిమి నెందరెందఱిలఁ గోరి నినున్ భజియింపరమ్మ, సా
కార కృపాతరంగిణివి కామిత మిచ్చెదు దానవంచు, నీ
ధారుణి నీదుపైన శపథ మ్మొనరింతు, స్వభావ సిద్ధమే
కోరికలేని భావ మొనఁగూరిచి. కొంటిని నే, వియన్నదీ! ౪౧

లలాటే యాలోకై రిహ ఖలు సలీలం తిలకితా
తమో హన్తుం ధత్తే తరుణతర మార్తాండ తులనామ్ ।
విలుంపంతీ సద్యో విధిలిఖిత దుర్వర్ణ సరణిం
త్వదీయా సామృత్స్నా మమ హరతు కృత్స్నామపి శుచమ్॥

జనులు లలాటమందుఁ గడుఁ జక్కగ బొట్టుగ వెట్టనీదు మృ
త్తును దరుణార్క బింబరుచిఁ దోచితమంబును ద్రోచి బ్రహ్మవ్రా
సిన చెడువర్ణ పంక్తియు నశేషమునుం దుడువంగనేర్చెడిన్;
దనరునదే మదార్తిదళనక్షమమై సుఖదానదక్షమై. ౪౨

నరా న్మూర్ధాం స్తత్తజ్జనపద సమాసక్తమనసో
హసంతః సోల్లాసం వికచ కుసుమవ్రాత మిషతః ।
పునానాః సౌరభ్యైః సతతమలినో నిత్యమలినామ్
సఖాయో నః సన్తు త్రిదశతటినీతీర తరవః॥

నరులన్ మూర్ఖుల స్వస్వదేశముల నంతంబాసి రాలేని ము
ష్కరులన్ ఫుల్లసుమోత్కరమ్ము మిష హాస్యమ్మాడి, సద్వాసనా
స్ఫురణన్ దుర్మలినమ్ము లౌనదులకున్ బున్నెంబులందించు త్వ
ద్వర తీరాంతర సత్తరు ప్రకరమంబా మాకు మిత్రమ్మగున్. ౪౩

యజన్త్యేకే దేవాన్ కఠినతరసేవాంస్తదపరే
వితాన వ్యాసక్తా యమనియమరక్తాః కతిపయే।
అహంతు త్వన్నామస్మరణ కృతకామ స్త్రి పథగే
జగజ్జాలం జానే జనని తృణజాలేన సదృశమ్॥

వేలుపులన్ యజింతురిల వేమరు తీవ్రతర క్రతుప్రయో
గాళిని గొంద; రట్ల మరి యన్యులు యోగపథాన; నేనో నీ
మేలగు నామ సంస్మరణ మిక్కిలి వేడుకసేసి యీ జగ
జ్జాలము నెంతుఁ దల్లి! తృణజాల మటంచవలీల, స్వర్నదీ. ౪౪

అవిశ్రాంతం జన్మావధి సుకృత జన్మార్జన కృతాం
సతాంశ్రేయః కర్తుం కతి నకృతినః సంతివిబుధాః।
నిరస్తాలంబానా మకృత సుకృతానాంతు భవతీం
వినాఽముష్మిన్ లోకే న పర మవలోకే హితకరమ్॥

పుట్టినదాది పుణ్యములు పొంపిరివోవ నొనర్చువారిఁ జే
పట్టగ దిట్టలైన సురవర్గము దెంతయొ యున్నదమ్మ! నీ
యట్టు లనాథులన్ సుకృత మన్న నెరుంగనివారి కిష్టముల్ !
పట్టముగట్ట నీకు సరివారినిగాన జగాన జాహ్నవీ! ౪౫

పయఃపీత్వా మాతస్తవ సపదియాతః సహచరై
ర్విమూఢైః సంరన్తుం క్వచిదపిన విశ్రాంతి మగమమ్।
ఇదానీ ముత్సంగే మృదుపవన సంచార శిశిరే
చిరా దున్నిద్రం మాం సదయహృదయేః శాయయ చిరమ్॥

నీదు పయస్సులాని జననీ! చనియల్లర పిల్లగాంఢ్రతో
నాదట నాటలాడి క్షణమైనను విశ్రమమే నెఱుంగ; న
మ్మా! దయతో సమీర సుకుమార సుశీతలమైన నీ యొడిన్
నీ దరినిద్రఁ బుచ్చునను, నేనెఱుగన్ సుఖనిద్ర యింతకున్. ౪౬

బధానద్రాగేవ ద్రఢిమ రమణీయం పరికరం
కిరీటే బాలేందుం నియమయపునః పన్నగగణైః।
నకుర్యాస్త్వం హేలా మితరజనసాధారణతయా
జగన్నాథస్యాయం సురధుని సముద్ధారసమయః॥

సరగన్ గట్టవె గట్టిగా నడుమునున్, జంద్రార్ధబింబమ్ము బి
ట్టొరగెన్ బన్నగరేఖచే మకుటమం దొక్కింత సంధింపవే;
పరిహాసమ్ములుగావు సూ సురధునీ! వార్వీరు గారమ్ము సుం
దరి! యెత్తన్ దగువేళ యియ్యది జగన్నాథున్, జగన్మంగళా! ౪౭

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్ శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్., పి. హెచ్. డి.

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

28. అర్ధమత్తల్లి

స్ఖలితాపసృతౌ పాదౌ వామహస్తశ్చ రేచితః
సవ్యహస్తః కటిస్థః స్యా దర్ధమత్తల్లి తత్స్మృతమ్. ౮౦

మొదట పాదములను వేసి తర్వాత వేరుచేసి, ఎడమహంస పక్షహస్తమును రేచితము చేయవలెను. కుడిచేతిని నడుమువద్దకు తేవలెను. ఈ కరణము అర్ధమత్తల్లి. యౌవనమదమును తెలియబరచును.

29. రేచిత నికుట్టితము

రేచితో దక్షిణోహస్తః పాదః సవ్యో నికుట్టితః
దోలాచైవ భవే ద్వామ స్తద్రేచిత నికుట్టితమ్. ౮౧

పాదము ముందుభాగముపై నిలచి మడమను ఘట్టించిన నికుట్టిత మగును. ఇట్లు కుడిపాదమును ఉద్ఘటిత క్రియతో నికుట్టితముగా చేయుచు, కుడి హంసపక్ష హస్తమును ద్రుతభ్రమాత్మకము చేయవలెను. ఎడమచేయి దోలాహస్తము వలెను, బుజములు జారువారినట్లు పతాకాహస్తములను వ్రేలాడవేసిన దోలాహస్తము లగును. దోలాహస్తమగు ఎడమచేతిని ఊపుచు నుండగా గమనాగమనముల నెరుక పరచు రేచిత నికుట్టితమగును.

30. పాదాపవిద్ధకము

కార్యౌ నాభితటేహస్తౌ ప్రాఙ్ముఖౌ ఖటకాముఖౌ
సూచీవిద్ధావపక్రాంతౌ పాదౌ పాదాపవిద్ధకే. ౮౨

నాభివద్ద ఎదురెదురుగా ఖటకాముఖములను చూపవలెను. కపిత్థహస్తము లోని చూపుడువ్రేలిని, నడిమివ్రేలిని బొటనవ్రేలితో చేర్చిన ఖటకాముఖమగును. మడమను పైకిఎత్తి బొటనవ్రేలిపై నిలచిన సూచీపాదము వచ్చును. ఈ పాదముతో ఎడమ పాదమును విద్ధముగా చేయునపుడు సూచీపాదము అపక్రాంత చారీతో కూడి ఉండును. ఊరువలనము చేసి కుంచితపాదమును పైకిఎత్తి ప్రక్కగా వేసిన అపక్రాంతచారీ రాగలదు. ఇట్లు చేయగా వచ్చునదీ కరణము.

31. వలితము

అపవిద్ధో భవేద్ధస్తః సూచీపాదస్త థైవచ
తథాత్రికం వివృత్తంచ వలితం నామతద్భవేత్ ౯౦

సర్పశీర్ష హస్తములోని చూపుడు వ్రేలిని సాచి, నడుమ వ్రేలియందు బొటన వ్రేలిని ఉంచిన సూచీముఖ హస్తములు రాగలవు. వీనిని ఎదుటనుండి పార్శ్వములకు బాహుప్రసారములతో పట్టిన సూచీముఖములగును. ఈ సూచీముఖ హస్తమును దేహమునుంచి బయటకు వచ్చునట్లు చేయుచు, సూచీపాదమునుకూడ అపసృతము చేయవలెను. భ్రమరికాచారీతో ఈ కరణమును ప్రయోగించవలెను, అతిక్రాంత చారీలో చెప్పిన కుంచితపాదమును పైకిఎత్తి భుజంగత్రాసితము వలె ఊరువుతో కాలిని త్రికోణాకారమున త్రిప్పవలెను.. ద్వితీయ పాదతలభ్రమణముతో శరీరము బండి ఇరుసువలె గిర్రున తిరుగ గలదు. అప్పుడు భ్రమరీచారీ సిద్ధించును.

32. ఘూర్ణితము

వలితా ఘూర్ణితః సవ్యో హస్తో వామశ్చ దోలితః
స్వస్తికాపసృతః పాదః కరణం ఘూర్ణితంతు తత్. ౯౧

ప్రక్కభాగము నుండి ఊర్ధ్వవ్యావర్తితమును, అధోముఖ పరివర్తితమును గావించి ఎడమచేతితో దోలాహస్తమును చూపిన ఘూర్ణితము రాగలదు. పాదములతో స్వస్తికనుపట్టి, తర్వాత వేరు చేయవలెను

33. లలితము

కరిహస్తో భవే ద్వామో దక్షిణశ్చవివర్తితః
బహుశః కుట్టితః పాదో జ్ఞేయం తల్లలితం బుధైః. ౯౨

ఎడమచేతితో కరిహస్తమును చూపవలెను. సమున్నతమైన లతాహస్తమును ఒక ప్రక్కనుండి మరియొక ప్రక్కకు చాచుచు త్రిపతాకగల ఎడమచేయి చెవివద్ద నుండగా కరిహస్తము వచ్చును. భుజశిరస్సు నుండి, కేశదేశము నుండి బయటకు వచ్చుచు, ప్రక్కభాగమున ఎత్తబడినట్లు చూపుచు కుడిచేతిని వివర్తితము చేయవలెను. హస్తగతిని ననుసరించి పాదమును నికుట్టితము చేయవలెను. ఇట్లు మాటి మాటికి అంగపర్యాయము చేయగా లలితమను కరణము వచ్చును. విలాసముతో కూడిన నృత్తమున దీనిని ప్రయోగించవలెను.

34. దండపక్షము

ఊర్ధ్వజానుం విధాయాథ తస్యోపరి లతాం న్యసేత్
దండపక్షంతు తత్ ప్రోక్తం కరణం నృత్తవేదిభిః ౯౩

ఇరువదియైదవ కరణమున చెప్పబడిన ఊర్ధ్వజానుచారీని ప్రయోగించుచు, లతాహస్తములను పట్టవలెను. పతాకాహస్తమును అడ్డముగా చాచి ప్రక్కకు తెచ్చి దోలాకారముగ పట్టిన లతాహస్తము. లతాహస్తములలో కుడిచేతిని కుడిజానువుపై

నుంచవలెను. ఇట్లే రెండవ ప్రక్కన గూడ నభినయించవలెను. ఇట్లు చేయగా ఒక ప్రక్క దండమువలె బాహుసమవస్థానము సిద్ధించుటచే దీనిని దండపక్షమందురు.

35. భుజంగ త్రస్తరేచితము

భుజఙ్గత్రాసితం కృత్వా యత్రోభావపి రేచితౌ
వామపార్శ్వస్థితౌ హస్తౌ భుజఙ్గ త్రస్తరేచితమ్. ౯౪

ఇరువదినాల్గవ కరణమగు భుజంగత్రాసితమును చేసి రెండుచేతులను హంస పక్షములుగా నుంచి వేగముతో కంపించునట్లు చేయుచు రెండు చేతులను ఎడమ ప్రక్కకు తీసికొని వచ్చినచో భుజంగత్రస్త రేచిత మనుకరణము వచ్చును.

36. నూ పు ర ము

త్రికం సువలితం కృత్వా లతారేచితకౌ కరౌ
నూపురంచ తథా పాదం కరణే నూపురే న్యసేత్. ౯౫

మడమను భూమిపై నుంచి, పాదముయొక్క అగ్రతలమును పైకి ఎత్తి వ్రేళ్ళ నంచితములుగా చేయ అంచితపాదమగును. ఈ పాదమును వెనుకకు తీసికొని వెళ్ళి పిరుద నంటునట్లు జేయవలెను. అప్పుడు అగ్రతలముతో అంచితమగు పిరుదను కుంచించి, పాదమును వేగముగా క్రిందవేయగా నూపురపాదికా యను చారీ వచ్చును. ఈ చారీని ప్రయోగించి, భ్రమరికాచారీతో త్రికవలనమును గావించి, ఏ ప్రక్కనగల పాదముతో నూపురపాదిక చేయబడినదో ఆ ప్రక్కన గల హస్తమును రేచితము చేయవలెను. హంసపక్ష హస్తము ద్రుతభ్రమము కలదియైన రేచిత మగును. రెండవ చేయి లతాహస్తముగ నుండును.

37. వైశాఖ రేచితము

రేచితౌ హస్తపాదౌచ కటీ గ్రీవాచ రేచితా
వైశాఖ స్థానకే నైత ద్భవే ద్వైశాఖరేచితమ్. ౯౬

హంసపక్షమును వేగముతో కంపింపచేయుట రేచితము. సర్పశీర్ష హస్తము లోని చిటికెనవ్రేలిని చాచియున్నచో హంసపక్షహస్తము వచ్చును. ద్రుతభ్రమము గల హంసపక్షములను పట్టుచు, పాదము, మెడ, నడుములను రేచితములు చేయ వలెను. మెడవద్ద చేతుల భ్రమణమును, నడుమువద్ద పాదముల భ్రమణమును మాటి మాటికి చేయుటయే, వీటి రేచితములని రాహులకుడనినాడు. ఇట్లు చేయగా వైశాఖస్థానకమున ఉన్న వైశాఖరేచిత మనుకరణము రాగలదు.

కదలికలేక విశ్రాంతిలోనున్న ఊరువులను కుంచించి, ఊరువుల మధ్య దేశ మును మూడున్నరతాళముల దూరమున ఉంచి, కుడికాలిని కొద్దిగా త్రికోణాకార మున నుంచినచో వైశాఖస్థానకము రాగలదు. యుద్ధాది నిర్గమనముల నభియించుట కిది ఉపకరించును.



28



29



30



31



32



33



34



35



36


37


38


39


40


41


42


43


44


45

38. భ్రమరకము

ఆక్షిప్తః స్వస్తికః పాదః కరౌ చోద్వేష్టితౌ తథా
త్రికస్య వలనంచైవ జ్ఞేయం భ్రమరకం తు తత్ ౯౭

కుంచితమైన పాదమును ఎత్తి ఆక్షిప్తము గావించి అంచితముగా నుంచి పిక్కలతో స్వస్తికను చూపిన ఆక్షిప్తచారీ రాగలదు ఈ చారీని ప్రయోగించి, స్వస్తికానంతరము పాదము నాక్షిప్తముచేసి, అదే కాలమున ఉద్వేష్టనము చేయవలెను. చూపుడువ్రేలు మొదలుకొని క్రమముగా మిగిలినవ్రేళ్ళు బహిర్ముఖములుగా వచ్చినచో ఉద్వేష్టనము జరుగును ఈ ఉద్వేష్టన క్రియయైన తర్వాత ఊరుప్రదేశముతో మోకాలిని త్రికోణాకారమున పట్టి త్రికవలనమును భ్రమరికాచారీతో పట్టవలెను. ఇట్లే రెండవకాలితో కూడ చేయవలెను. వలనానంతరము పాదములతో స్వస్తికను పట్టవలెను

ఉద్వేష్టిత శబ్దప్రయోగముచే ఉల్బణములగు నృత్తహస్తములనైనను చూపవలెనని చెప్పబడియున్నది వక్షమువద్ద ఉద్వేష్టితప్రధానములగు హస్తములను పట్టిభుజముకు పైగా ప్రసారించి, ఆవిద్ధములుజేసి, భుజముల కెదురుగా అలపల్లవములుగా జూపిన ఉల్బణహస్తములు రాగలవు, అదేసమయమున పాద స్వస్తికము, భ్రమణము రావలెను ఉద్ధతపరిభ్రమణ విషయమున దీనినిఉపయోగించవలెను

39. చతురము

అంచితః స్యాత్కరోవామః సవ్య శ్చతురఏవతు ౯౮
దక్షిణః కుట్టితః పాద శ్చతురం తత్ప్రకీర్తితమ్.

తర్జని మొదలుగా గల మూడువ్రేళ్ళను జేర్చి, మధ్య బొటనవ్రేలి నుంచి చిటికెన వ్రేలిని చాచిపట్టిన చతురహస్త మగును కుడిచేతిని చతురహస్తముగాను, ఎడమచేతిని అలపల్లవముగాను పట్టవలెను వక్షఃక్షేత్రమునుంచి హస్తవిన్యాసము ప్రారంభముకాగా సన్నివేశాధిక్యము సిద్ధించగలదు. అప్పుడు పాదతలాగ్రమున నిలచి కుడిమడమను భూమిపై ఘట్టించవలెను ఆశ్చర్యముతో కూడిన విషయము నభినయించునపు డీ చతురకరణ ముపకరించును

40. భుజంగాంచితకము

భుజంగత్రాసితః పాదో దక్షిణో రేచితః కరః
లతాఖ్యశ్చ కరో వామో భుజంగాంచితకం భవేత్ ౯౯

ఇరువదినాల్గవ కరణమున చెప్పబడిన భుజంగత్రాసిత చారీతో పాదమును చూపి కుంచితపాదమును రెండవ ఊరుమూలము వరకు ఎత్తి కటి జానువుల నివర్తన ద్వారా పిరుద కెదురుగా మడమ నుండునట్లు జేసిన త్రికోణాకారముగల ఊరువు రాగలదు దీని నావర్తింపజేయగా భుజంగత్రాసిత చారీ వచ్చును కుడి హంసపక్షమును ద్రుతభ్రమము కలదిగా చేయుచు, ఎడమచేతితో లతాహస్తమును చూపగా భుజంగాంచితకమను కరణము వచ్చును

41. దండకరేచితము

విక్షిప్తంహస్తపాదంతు సమంతాద్వ్యత్రదండవత్
రేచ్యతేతద్ధి కరణంజ్ఞేయం దండకరేచితమ్, ౧౦౦

దండమువలె చేతిని విక్షేపనుచేసి, వేగమున కంపించు దండపక్ష, హంసపక్ష హస్తములను పట్టవలెను పాదవిక్షేపముకూడ ఇచ్చట ఉండుటచే దండపాదా అను చారీని ప్రయోగించవలెను హంసపక్ష హస్తములకు వ్యావృత్త పరివర్తనములను చేసి భుజములను ప్రసారించిన దండపక్షములు రాగలవు, నూపురపాదికలోని కుంచిత పాదమును రెండవ కాలిమడమ వెనుకనుంచి ముందుకు చాచవలెను దేహక్షేత్రమున కెదురుగా నుండునట్లు జాన్వగ్రమునుంచి త్వరగా చాచగా ఊరు, జాను, జంఘలు స్తబ్ధములై దండాకారమును పొందగలవు, అప్పుడది దండపాదాచారీ అగును

42. వృశ్చిక కుట్టితము

వృశ్చికం చరణం కృత్వా ద్వా వప్యథనికుట్టితౌ
విధాతవ్యౌ కరౌతత్తుజ్ఞేయం వృశ్చిక కుట్టితమ్ ౧౦౧

వెనుకప్రక్కగా జంఘాభాగమును రేచితముచేసి, అరికాలిని ఉత్తానతలముగా చేసిన వృశ్చికపాదము వచ్చును ఈ పాదమును చూపి రెండుచేతులను ఆయా భుజశిరస్సులందు అలపల్లవములుగాచేసి, నికుట్టితములుగా అంగపర్యాయము కావించవలెను ఇట్లు సిద్ధమగు వృశ్చిక కుట్టితమును విస్మయమును, ఆకాశగమనేచ్ఛను తెలుపు వేళ ప్రయోగించవలెను

43. కటి భ్రాంతము

సూచీం దత్త్వాపవిద్ధంచ దక్షిణం చరణం న్యసేత్
రేచితాచ కటి ర్యత్ర కటిభ్రాంతం తదుచ్యతే. ౧౦౨

కుంచితపాదమును జానువు వరకు పైకిపొచి, పాదము ముందుభాగమునకు పడునట్లు వేసిన సూచీపాదము లభించగలదు ఎడమపాదము నిట్లుచేసి, త్వరగా అపసృతముచేసి, ప్రక్కన కుడిపాదము నుంచవలెను అదే సమయమున పృష్ఠపరావర్తన క్రమముతో నడుమును రేచితముగా జేయవలెను భ్రమరికా చారీతో నైనను నడుమును రేచితముగా చేయవచ్చును కటిభ్రమణ కాలమున ప్రయోగవశము ననుసరించి వ్యావర్తన పరివర్తనము లైనతర్వాత చేతులను చతురశ్రములుగా నుంచిన కటిభ్రాంత మనబడు కరణము సిద్ధించును గతిపరిక్రమమున తాళాంతరాళమున, యతిపరిపూరణమున దీనిని ప్రయోగించవలెను

44. లతా వృశ్చికము

అంచితః పృష్ఠతః పాదః కుంచితోర్ధ్వతలాంగులిః
లతాఖ్యస్తు కరో వామ స్తల్లతావృశ్చికం భవేత్. ౧౦౩

పైకి ఎత్తబడి కుంచితమ్మలైన వ్రేళ్లుగల ఎడమపాదమును వృశ్చికచరణముగా చూపుచు, ఎడమచేతిని లతాహస్తముగ పట్టినచో లతావృశ్చికమనబడు కరణము రాగలదు ఆకాశమునుండి భూమికి దిగునపు డీ కరణమును ప్రయోగించవలెను

45. ఛిన్నము

అలపద్మః కటీదేశే ఛిన్నా పర్యాయశః కటీ
వైశాఖస్థానకే నేహ తచ్ఛిన్నం కరణం భవేత్. ౧౦౪

మడమను మాటిమాటికి క్రిందకు వేయుచు పైకి ఎత్తుచు నున్నచో ఊరు కంపనము కలుగును. అదే సమయమున నడుమును ప్రక్కకు త్రిప్పినచో కటిభాగము ఛిన్నమైనట్లు కన్పించును. ఈ నడుమువద్ద అలపద్మ హస్తమునుంచవలెను అరచేతి లోనికి వ్రేళ్లను ఆవర్తనము చేయుచు, ప్రక్కకు తిరుగుచో అలపద్మ హస్తము వచ్చును ఈ అలపద్మమును అంగపర్యాయముగా రెండు చేతులతో చూపవలెను. ఈ ప్రక్రియను వైశాఖ స్థానకములో జేయగా ఛిన్నమను కరణమురాగలదు.

చందాదారులకు వినతి

“నవభారతి” పత్రికకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియజేస్తున్నాము,

ఇంతవరకూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యధాతథంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము

మేనేజరు, నవభారతి

నిష్క్రమణం

(కథానిక)

"అమరేంద్ర"

ఆ ఉత్తరం, లేవగానే బల్లమీద కంట పడింది, గాలికి ఎగిరిపోకుండా బరువుకోసం దానిమీద శంఖం పెట్టి వెళ్ళిపోయింది. చల్లగా ...కరిగిపోయే కలలాగా.

ఆనందం గజగజా వణికిపోయాడు. సుడి గాలికి కంపించే దీపశిఖలాగా ఆపాదమస్తకమూ కదిలిపోయాడు. కుర్చీకి ఆనుకోకపోతే దారంతెగిన హారంలాగా నేల కూలిపోయే వాడే.

ఎదురుగా గోడమీద పెళ్ళినాటిఫొటో. మధుపర్కాలతో కళ్యాణపు బొట్టుతో మాలతీ, తనూ. నునులేత సిగ్గు దొంతర్లోంచి తొంగి చూస్తున్న చిరునవ్వుతో నవ వధువుగా మాలతి కళ్యాణజీవన స్వప్నాలతో, తీరాన నిలబడి మహాసాగరంకేసి విస్మయంతో చూస్తున్న కిశోర హృదయంతో తనూ

వచ్చిన కవులూ, మిత్రులూ ఆశీస్సులు శిరస్సులపై శుభాక్షతలుగా జల్లారు. పుష్పంలో పరిమళంలాగా, నెలా, వెన్నెలలవలె, మాటలో భావం మాదిరిగా ఒకటేమిటి ? తనువులు వేరైనా మనసులొకటై జీవనపథంలో చేతులో చెయ్యి వేసుకుని గాలిలో రాగంలాగా, పరాగంలాగా తేలిపోవాలని ఎన్నో ఆశలు, ఎన్నెన్నో ఆశయాలు

అన్నిటికీ గొడ్డలిపెట్టుగా. ఆకాశంనుంచి విరిగిపడిన అశనిపాతంలాగా, కూకటివేళ్ళతో కుసుమలతని కూర్చివేసే పెనుగాలిలాగా ఆశాసౌధాలని నేలమట్టంగానే తునాతునకలు చేసిన భయంకర భూకంపంలాగా

అబ్బా ' కాళ్ళకింద నేల ఒక్కసారిగా నోరుతెరిచి తనని కబళించివేస్తే ఎంత బాగుండును ? ఉత్తరంలోని ప్రతి అక్షరమూ పదును కత్తిలాగా గుండెల్లో గుచ్చుకుంటోంది. బాధతోనే మళ్ళి మొదటినుంచీ చదువుకున్నాడు.

తను చేసిన అపచార మేమిటి ? తనకి ఎందుకింత క్ర్రూరశిక్ష విధించింది మాలతి ?

నిరాశలోంచి, నిస్పృహలోంచి తేరుకొన్నాక దిక్కుల కొనలదాకా, కల్పాంతం దాకా మాలతికోసం లోకమంతా గాలించి వెయ్యాలనే ఆవేశం ఆనందం హృదయంలో పరవళ్ళు తొక్కింది. జీవితమంతా అన్వేషణగా యుగయుగాలు, జగజగాలు వెదకి వెదకీ వేసారి తుదకు ఎక్కడో ఎప్పుడో నేలకిఒరిగిపోవాలనిపించింది.

"నాకోసం వెదకవద్దు, నన్ను మరిచిపొండి," అనే చివరి వాక్యాలు చదివి ఏమీ తోచని అయోమయంలో పడిపోయాడు ఆనందం.

చుట్టూ చూసుకుంటే ఇల్లంతా బావురుమంటూ కనిపించింది. నిశ్శబ్దం కొండంత బరువుతో గుండెల్ని అణిచివేస్తోంది. దీపశిఖ లేని మట్టిప్రమిదలాగా బతుకు చితికిపోయింది. నాటకం ముగిసిన తరవాత చిన్నబోయిన శూన్య రంగస్థలంలాగా కనిపిస్తోంది.

క్షణంసేపు గగనమండలాన్ని తళుక్కున వెలిగించి మటుమాయమైపోయిన విద్యుల్లతని ఎవరు వెదికి తీసుకురాగలరు? అవును మాలతి కోసం గాలించటం నిష్ప్రయోజనమే కావచ్చు. కాని ఎందుకిలా చేసింది ? తను నలుగురిలో తల ఎత్తుకుని ఎల్లా తిరగుతాడు? తన జీవన వీణ తారలన్నిటినీ పుటుక్కున తెంపేసి ఘోర మౌనంలో ముంచేసి అర్థరాత్రివేళ మాలతి మాయం ఎందుకైపోవాలి ?

ఎంత ఆలోచించినా కారణం కనబడదు. మాటా మాటా అనుకోలేదు. ఇద్దరిమధ్య కలతలూ కార్పణ్యాలూలేవు. అన్యోన్య దాంపత్యాన్ని చూసి అంతా సంతోషించేవాళ్ళు. పెళ్ళి అయి పదేళ్ళు దాటింది. తొమ్మిదేళ్ళ కిందట

మగశిశువు కలిగి పురిటిలోనే పోయిన తరవాత మళ్ళీ సంతానం లేదు. సిరిసంపదలకి లోటు లేకుండా కళాకాంతులతో పచ్చతోరణంగా మెరిసిన కాపురం. ఘర్షణ గందరగోళమూ లేకుండా తాపీగా సాఫీగా గంభీరంగా సాగిన జీవనవాహినిలో ఈనాడు ఏమిటీ ఘోరమైన దారుణమైన వెల్లువ పోటు ?

మధూదయంలో ఒక మంచి ముహూర్తాన మాలతీ తనూ కళ్యాణమండపంలో కలుసుకున్నారు. అప్పటికే మాలతి కాశీ విద్యాలయంలో చదువు పూర్తి చేసింది. మొదటినుంచీ మాలతి సాదాచీరెలు ధరించి, ఆర్భాటమైన ఆభరణాలు లేకుండా ఎంతో నిరాడంబరంగా వుండేది సౌందర్యోపాసకుడైన ఆనందం తన భార్యని ఆధునికమైన వేషభాషలతో అలంకరించాలని చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు తన లాలసకీ రసికతకీ అనుగుణంగా మాలతిని మార్చలేక నిరుత్సాహ పడ్డాడు ఏదో ఉన్నత లోకాలనించి జారి ఈలోకంలో పడిన ప్రవాసిలాగా వుండేది మాలతి ఏవో అందని శిఖరాలకి ఎగప్రాకాలని అనుక్షణమూ పెనగులాడే సాధకురాలిలాగా కనబడేది. ఆనందానికి సినిమా సంగీతమంటే ప్రాణం, కాని మాలతి అస్తమానమూ మీరాభజనకీర్తనలని ఆలాపన చేసేది. ఆ పాటల్లో మాలతి ప్రాణం లీనమైపోతున్నట్లుగా వుండేది. ఎప్పుడూ ఏదో పారవశ్యంలో పరధ్యానంగా తామరపూవు రేకులమీది నీటి బిందువులాగా తొణికేది. ఇద్దరూ ఒకే ఇంట్లో వుంటున్నా ఇరువురి నడుమా ఏదో అగాధసాగరం ఘోషిస్తున్నట్లు వుండేది. తనొకలోకంలోనూ మాలతి వేరొక సీమలోనూ మసులుతున్నట్లుగా వుండేది

మొదట్లో ఆనందం హృదయం ఆక్రోశించింది కాలేజీలో మాలతి మనసు ఇంకొక భాగ్యశాలియైన పురుషుడికి అంకితమైనదేమో అనే అనుమానం దావాగ్నిలాగా నాలుకలు జాపింది. తల్లిదండ్రుల బలవంతాన ఈ మనసులేని మనువు దాపురించిందేమో. కాకపోతే ఎందుకింత ఉదాసీనంగా నిర్లక్ష్యంగా తనపట్ల ప్రవర్తించాలి? ఆనందానికి మాలతి పంచప్రాణాలు. అతని హృదయ మణిమందరంలో సముజ్వల సుందర విగ్రహం మాలతి. కాని అతను ఎంతదగ్గరికి రావాలని ప్రయత్నిస్తున్నాడో అతనికి అంతదూరంగా జరిగిపోతోంది మాలతి ఒక దుర్బలసమయంలో మనస్సులో క్షోభకి తట్టుకోలేక అసూయని వెళ్ళగక్కుతూ అంతమాటా అనేశాడు ఆనందం. పందిరికూలి నేలవాలే లతలాగా మాలతి అతని పాదాలమీద పడి వెక్కి వెక్కి ఏడుస్తూ తన మనసులో ఇంకెవరికీ తావులేదని, తను నిరపరాధినని దీనంగా నివేదించింది. ఆ దృశ్యం ఎన్నటికీ మరుపురాని, ఎన్నటికీ చెరిగిపోని ముద్రగా ఆనందం హృదయంలో నిలబడిపోయింది

అప్పటినుంచీ మాలతినీ ఎన్నడూ పల్లెత్తు మాట అనలేదు మాలతి మార్గంలో ఆటంకాలూ అవరోధాలూ నిలుపలేదు పాదరసంలాగా చేతికి అందకుండా పోతున్న మాలతి వల్ల కలిగిన మనస్తాపం లోపలే దిగమింగుకున్నాడు. మనసులో బాధని తగ్గించుకోటంకోసం, మనస్సు మరల్చుకోటంకోసం ఎన్నో వ్యాపకాలు కల్పించుకున్నాడు. ఎన్నడూలేనిది క్లబ్బులో మెంబరుగా చేరి పేకాటకి అలవాటు పడ్డాడు. చిత్రలేఖనంమీద చిన్నప్పుడున్న అభిరుచిని పెంపు చేసుకుని రంగులతో రేఖలతో స్వప్నలోకాన్ని రూపొందించుకుంటూ కాలం గడుపుతున్నాడు

ఒకప్పుడు మాలతిని చూస్తే భయంవేసేది. ఆరాధనలతో సాధనలతో శరీరాన్ని మరిచిపోయింది. అసలే చెంపకు చారెడుకళ్ళు మరీ విశాలమై వింత వెలుగుతో వెరపు గొలుపుతున్నయ్. ఏదో పవిత్రకాంతి మాలతి శరీరాన్ని ఆచ్ఛాదించినట్లు తోస్తున్నది మీరా, కబీరు, చైతన్యుల భజనావళితో ఝంకరించే తంబురా తీగెలాగా మాలతి స్పందిస్తూ ఈ లోకంలోవున్నా ఇంకెక్కడో సంచరిస్తున్నట్లు కనిపించి బెదిరిపోయేవాడు కాని భర్తకి జరిపే

ఉపచారాలలోనూ, పరిచర్యలలోనూ వీసమైనా లోపం రాకుండా చూసే నేర్పువుంది మాలతికి. అందుకే ఆనందం భార్యమీద ఎన్నడూ చిరాకు పడే అవసరం కలగలేదు.

ఇల్లా కాలచక్రం దొర్లుకుపోయినా బాధ వుండేదికాదు కాని నిన్న ఒక మామూలు సంఘటన జరిగింది. ఆనందం పాత స్నేహితు డొకాయన కుటుంబంతో సహా భోజనానికి వచ్చాడు, ఆ స్నేహితుడి భార్య అయిదుగురి పిల్లల్ని ఎత్తుకున్నా పదహారేళ్ళ పడుచులాగా తయారై వచ్చింది. అవయవ ప్రదర్శనంచేసే అతిపలచని సిల్కుచీరా ఎత్తుమడమల జోళ్ళూ గుండ్రటి సిగా, మల్లెపూల చెండూ కాటుక కళ్ళూ, ఎర్రటి పెదిమలూ ఎంతో విలాసంగా ఒయ్యారంగా వచ్చింది భోజనాలముందు మాలతి నిరాడంబర వేషాన్ని ఆ విలాసవతి చూపులు తూపులై గుచ్చివేశాయి తాంబూలాలూ సేవిస్తూ స్నేహితుడంటున్నాడు "నేను గుర్తు పట్టలేకపోయానోయ్ ఆనందం' మీ ఆవిడ ఇల్లా మారిపోయిందేం ? యోగినిలా అయిపోయిందేం ?" ఆనందం "ఎప్పుడూ ఇంతే " అన్నాడు ఎంతో నిస్పృహతో. ఈ చిన్న సంఘటన ఎంతో గొప్ప కల్లోలాన్ని మాలతి హృదయంలో కలిగించింది.

ఆ కుటుంబం వెళ్ళిపోయాక మాలతి ఎడ తెగని ఆలోచనల్లో పడింది, భర్త జీవితంలో ఆనందం అంతా హరించి నందన వనంగా విలసిల్లవలసిన జీవితాన్ని నిస్సారమైన ఎడారిగా చేస్తున్నానేమో అనే పరితాపం మాలతిని నిలువునా దహించింది.

తన మార్గానికి భర్త ఎన్నడూ అడురావేదు. తనే అతని బతుకులో మలయపవనమై పరుగెత్తలేక శిధిలశిశిరంలో ఆకులురాలిన మోడు చెట్టుగా అతని జీవితాన్ని మార్చివేసింది

ఆశలు. స్వప్నాలు, ఆనందాలు ఏమీలేని మరుభూమిగా భర్త బతుకుని తను ధ్వంసం చేసింది.

అతని హృదయరక్తంతో తన పాదాలకి పారాణి దిద్దేటంత తీవ్రప్రేమ ఆనందానిది కాని తను ఎన్నడూ అతని నివేదనని ప్రసన్నంగా స్వీకరించలేదు. క్రూరమైన సూర్యకిరణానికి తాళలేక వసివాడిన పుష్పమై అతని హృదయం బాష్పాలతో నిండిపోయింది. అమృత కలశం కావలసిన జీవితం అశ్రుపాత్రికగా మార్చి,

ఈ పరిస్థితికి ఒక్కటే పరిష్కారం అనుకుంది. తను కాశీలో చదువుకునే దినాల్లో ఒక శుభోదయవేళ గంగాస్నానానికి వెళ్ళింది. రేవులో ఒక వృద్ధవైష్ణవి మాలతికేసి ఎగాదిగా చూసింది. మాలతికి ఆవిడమీద అవ్యాజమైన ఆదరం కుదిరి చేతులు జోడించి నమస్కరించింది. "కృష్ణదాసివై వర్ధిల్లు తల్లీ !" అని మాలతి తలమీద చెయ్యివేసి దీవించింది ఆ స్పర్శ రాతిని నాతిగాచేసిన దివ్యస్పర్శలాగా సోకింది. ఆ క్షణం మాలతి కళ్ళకి మానవ లోకంలో నవలోకం కనిపించింది. జన్మజన్మల వాసనలు శరీరంలోగుబాళించినై యమునాతీరం, బృందావనం, మురళీగానం హృదయాన్ని ఉర్రూతలూగించినయ్. హృదయంలో పాల సముద్రం ఉప్పొంగి తన తెల్లటి నురుగుతో జగత్తుసంతా పవిత్రం చేసినట్లు తోచింది. కళ్ళమీది కాటుకపొర తొలగిపోయి మల్లెపూల వంటి వెలుగు వెల్లువలై విరిసింది తనుఎవరో అయిపోయింది. తన హృదయంలో మీరా వీణ మీటినట్లయింది.

ఎంతచెప్పినా ఎవరూ నమ్మలేదు. ఎవరూ తనమాట వినిపించుకోలేదు. అమ్మా నాన్నా అన్నయ్యలూ అంతాకలిసి ఒకటే పట్టుపట్టారు లాభంలేక తను తలఒగ్గింది శరీరం సంసారపుబండి లాగుతున్నా మనస్సు అంతరిక్షంలోకి దూసుకుపోతోంది.

అందరిలాగా సంసార శకటాన్ని ఈడ్చాలని ఎంతో పెనగులాడింది కాని ఆ వృద్ధవైష్ణవి మూర్తి అంతరాళంలో దాగిన వీడని పరిమళంగా వెన్నాడుతుంది ఎవరికళ్ళకీ కనరాని ఎవరి వీనులకీ వినరాని దివ్యదృశ్యాలు మధుర సంగీతాలు, మనస్సులో మెదిలేవి

అందుకే అర్ధరాత్రి మబ్బుపట్టి నక్షత్రాలు కన్నుమూసినవేళ హోరుగాలి తరుశాఖలని ఊయలలూపేవేళ ఒంటరిగా దూరం తెలియని పయనానికి తరలివెళ్ళింది. గమ్యం తెలియని గమనంతో కాళ్ళు కదిలినయ్...తను వైదొలగి భర్తకి దారి ఇచ్చి తనదారి తాను వెతుక్కుంటూ బయలుదేరింది మాలతి.

మళ్ళీ పెళ్ళిచేసుకుని ఆనందం జీవితాన్ని సుఖంతో శోభతో నింపుకోవాలని మాలతి అంతిమ సందేశం చదువుతుంటే పెదిమలు వణికిపోయి కన్నీళ్ళు జల్లున రాలినయ్.మాలతి మూర్తికి బాష్పాల ముత్యాలహారం.

కిటికీలోంచి రాత్రి మంచుకి తడిసిన పారిజాతాలు పొద్దున్నే స్నానం చేసిన మాలతి స్వచ్ఛసౌందర్యాన్ని గుర్తుచేస్తున్నయ్. ఆకాశంలో తెల్లటి మబ్బుతునక పాలతరగలాగా తేలిపోతోంది. "మాలతీ !" అన్న ఆక్రందన ఆనందంకంఠంలో కొట్టుకుంటోంది. ఇంట్లోంచి మాయమైన మాలతి అంతటా వ్యాపించింది కాబోలు.

సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే
శివాకారే మంచే పరమశివపర్యంకనిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీమ్.

సౌందర్యలహరి.

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

సీ తా క ల్యా ణ ము

౨

కోణోన్నతాంసానుగుణపీనకనదురో
          ధృతి బొడ్డుదాఁక జందెములవారు
కర్ణాగ్రకుండల కాంతిప్రవఝ్ఝరీ
          భ్రమఁ జెంపదాఁక నేత్రములవారు
సీమంతసంస్కార శృంగార రేఖాగ్ర
          ముగఁ బెడదాఁక గ్రొమ్ముళ్ళవారు
గండ పెండరపు రేఖాశౌర్యదీపనా
          వధిఁ బిక్కదాఁక దోవతులవారు

          బుజము కృష్ణాజినాల్ మహారజతమయము
          లైనయట్టి జారీ చెంబు లందగింప
          విజయముం బొనర్చిరి పెండ్లి విందుకై స్వ
          హస్తపాకులౌ క్షత్రియ యాజివితతి

కోణముచేత ఎత్తయిన బుజమునకు తగినట్లుగా చిక్కనిది, ప్రకాశించుచున్నది అయిన రొమ్ము ధరించుటచేత వారి జందెములు బొడ్డుదాకనే వచ్చినవి వారు నిత్య వ్యాయామము సేయువారు. వారి రొమ్ములు బలిసి యుండెను బుజములు కండలుతేరి యుండెను. జందెములు ఇన్ని బెత్తలు వడకుదురు. జందెములలోని పొడుగును ఎత్తయిన బుజములు మరియు నెత్తయిన రొమ్మును మ్రింగివేసెను జందెములు బొడ్డుక్రిందికి దిగలేదని తాత్పర్యము ఈ రీతిగనే తక్కిన చరణముల యందుకూడ మహావీరులైన క్షత్రియుల వర్ణనము జరిగినది, వారందరు సోమపీథులు. యజ్ఞయాగాది క్రతువులు చేసినవారు. బ్రాహ్మణ్యము, క్షత్రియత్వము, శౌర్యము వారియందు ధగద్ధగాయమానముగా వెలుగుచున్నవి. బొడ్డుదాక జందెములవారు-చెంపదాక నేత్రములవారు, పెడదాక క్రొమ్ముళ్ళవారు, పిక్కదాక దోవతులవారు, అని అన్న పలుకుబళ్ళు తెలుగు పలుకుబళ్ళు. సీసపద్య నాలుగు చరణముల పూర్వార్ధములు పరార్ధములందలి మొదటి రెండక్షరములు సమాసగతములై తక్కిన దంతయు తెలుగు పలుకుబడితో కూడుకొనియుండి ఈపద్య రచనయందు నొక విచ్ఛిత్తి విశేషము సమకూర్చబడినది. సమాస రచన కొంత జటిలమగుటచేత తెలుగు పలుకుబడికి నాతలియొద్దు కాచినట్లు రమ్యముగా సమకూర్పబడినది. ఇట్టి పద్యరచన పూర్వ ప్రౌఢకవులయందు మాత్రమే కనుపించును.

సామాన్యముగా దివిజజాతుల ఇండ్లలోని వివాహములయందు నాచారవంతులైన పెద్దలు ప్రత్యేకముగా స్వహస్తపాకములు చేసికొని యారగింతురు. ఈ విషయము శ్రీరామచంద్రుని వివాహమునందు జరిగినట్లుగా వర్ణించుట లోకానుకరణము. వారు 'విజయముం బొనర్చిరి' - అన్న ధాతువు ప్రయోగించుటచేత వారువచ్చిన రీవి యంతయు తెలియుచున్నది వారియం దితరులకు కల గౌరవముకూడ కనిపించుచున్నది. వారు కృష్ణాజినములు, మహారజత మయములైన జారీచెంబులను తాల్చి వచ్చిరనుటచేత కృష్ణాజినములు వారి యాచార విశేషమును చెప్పుచుండగా

జారీచెంబుల మహారజత మయత్వమువారి సంపత్తును, రాజ్యలక్ష్మిని చెప్పుచున్నవి. మహారజత మనగా బంగారము. కనులకు కట్టినట్లు వ్రాయుటయన్న లక్షణ మీ పద్యమునందున్నది. కనులకు కట్టుటయనగా తత్పూర్వ మా పరిస్థితి ఎరిగియుండుట, బ్రాహ్మణ వివాహములయందు నగ్నిహోత్రులు పెండ్లివిందులకు వచ్చెడి లక్షణ మెరిగినవారికి, వారియందు గౌరవము కలవారికి నీ పద్యము పరమ రమణీయముగా కనిపించును.

ఆ ధ్రువనక్షత్ర మనుసరించిన రేఖ
మలయుచో సప్తర్షి మండలంబు
నాల్గు నక్షత్రముల్ నాల్గు మంచపుకోళ్ళ
వలెనున్న యెడఁ దుదివంక మూఁడు
సాగిన యట్టి నక్షత్రమ్ములన్ మధ్య
వారు వశిష్ఠులు వారి ప్రక్క
మినుకు మిన్కంచుఁ దాఁగనిపించు లీలఁగా
నామె యరుంధతి యంచుఁ జూపె,

శ్రీ వశిష్ఠులు రాఘువశిశువ్రలకును
బాలరాముండు జానకివంకఁ దల్లి
వంక నచటి యరుంధతివంకఁ జూచి
మహియ తలఁచె నరుంధతీమయము గాఁగ.

వశిష్ఠ మహర్షి సీతారాముల వివాహము చేయించిన వశిష్ఠు స్థాలీపాకానంతరమున నరుంధతీ నక్షత్ర దర్శనము దంపతులచేత చేయింతురు. అది వివాహముల యందలి యాచారము. ఆ యాచారము శ్రీ సీతారామ కల్యాణ సమయమునందుకూడ జరిగినట్లు వర్ణించుట కావ్యమునందు లోకము ననుసంధానము చేయుట. ఈ పద్యమునందలి విశేషము ప్రత్యక్షముగా వశిష్ఠారుంధతు లచ్చటనుండి యాకాశమునందున్న వశిష్ఠా రుంధతులను చూపించిరనుటలో నున్నది. ఆకాశమునందున్న వశిష్ఠారుంధతులు నక్షత్రములు, అచట నిలుచున్న వశిష్ఠా రుంధతులు శరీర ధారులు. ఇది ఎట్లు పొసగును? కనిపించుటకు చమత్కారముగా నున్నది. కాని పొసగుదల ఎట్లు? ఈ పొసగుదలకోసము మన మతములోని రహస్యము తెలియవలెను, ఆకాశమునందు నక్షత్రములు కలవు; గ్రహములు కలవు. ఈ గ్రహములన్నియు నవగ్రహ స్వరూప విచారణ చేసినచో నొక్కొక్క గ్రహము నొక్కొక్క దేశమునందు పుట్టినట్లు, వ్యవహరించినట్లు సంప్రదాయము కలదు. గ్రహములకు వర్ణములు కలవు. వశిష్ఠుడు బ్రాహ్మణుడు. శని పంచముడు. బుధుడు వైశ్యుడు. ఇదియంతయు నొక విచిత్రమైన భారతీయ సంప్రదాయము. వీని రహస్యములు గాఢముగా మనమతమునుగూర్చి యాలోచన చేసినవారికిగాని తెలియవు. కల్పాదులయందు మహానుభావులు తపస్సుచేసి యాకాశ వీధియందు గ్రహములుగా నిలిచిరి. ధ్రువుడు ఉత్తానపాదుని కొడుకు. ఆయన విష్ణుభక్తుడై ధ్రువనక్షత్రముగా నిలచిపోయెను అట్లే వశిష్ఠారుంధతులును మింటియందు తారకాకృతులుగా నిలచియుండిరి, సరే, నిలచియున్నారు, అప్పుడిచ్చట నెట్లున్నారని ప్రశ్న ? ఈ సందర్భములో భాగవతములోని ఈ పద్యము విచారించవలయును.

తన వేంచేయుపదమ్ము వేఱొక్కచో డనాథ స్త్రీ జనాలాపముల్,
వినెనో ముచ్చులు ముచ్చిలించిరొ, ఖలుల్ వేదప్రపంచమ్ములన్,
దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో, భక్తులం
గని చక్రాయుధుడేడి చూపుమని ధిక్కారించిరో దుర్జనుల్

ఈ పద్యములో తొలుత ద్రౌపదీ వస్త్రాపహరణము, చివర నృసింహావతారము చెప్ప బడినవి. ఇది గజేంద్ర మోక్షణములోని పద్యము గజేంద్రమోక్షణము పూర్యకల్పములోని కథ. ద్రౌపదీ వస్త్రాపహరణము మొన్నటి ద్వాపర యుగములోఁ అనగా సరిగా నేటికి 5110 సంవత్స రములక్రింద జరిగిన కథ కలి ప్రవేశించి ఈనాటికి అయిదువేల అరువది సంవత్సరములైనది కలి ప్రవేశించకముందు భారత యుద్ధము ముప్పదిఏడేండ్ల క్రిందట జరిగినది అంతకు పదమూ డేండ్లకు పూర్వము ద్రౌపదీ వస్త్రాపహరణము జరిగినది. అందుచేత ఇది సరిగా 5110 ఏండ్లు. కనుక ఈకొద్ది ఏండ్లకు పూర్వము జరిగిన ద్రౌపదీ వస్త్రాపహరణ విషయము పూర్వకల్పము నందు జరిగిన గజేంద్రమోక్షణము నాటికి చెప్పుట కాలవ్యతిరేక లక్షణముగా నాధునికులను కొనవచ్చును. కాని మనశాస్త్రముల ప్రకారము యుగవర్తనములు జరిగినవే జరుగుచుండును. ఆంగ్లేయభాషలో కూడ History Repeats itself అనుచున్నారుకదా: J B Priestly, అను నేటి ప్రసిద్ధ ఆంగ్లనాటక రచయిత Crime Plays అను మూడు నాటకములు వ్రాసెను. అందులో చివర నాటకముయొక్క వస్తువిదియే.

ఆకాశమునందలి వశిష్ఠారుంధతులు నక్షత్రరూపముగా నిత్యులు. రామచంద్రుని కల్యాణము చేయించిన శ్రీ వశిష్ఠ మహర్షి ఆ యుగమునందు పుట్టినవాడు.

అందుచేత ఈ పద్యమునందలి భావము భారతవర్షమునందలి సనాతన మతములోని యొక మహార్థమును సంకలించుకొన్నది.

చిత్రపుచేఁత పళ్ళెరముఁ జేఁగొని రత్నపు దివ్వెవెల్గు లా
రాత్రిక పట్టె శాంత మధురంబగు వీణియ తోడు రాఁగ ను
ద్గాత్రధినేతయై చను నొకానొక వైణిక సామవేది హ
స్తత్రయ కప్తిగాఁగ మఱదండ్రయుఁ దమ్ముల కండ్ల కద్దుచున్

వివాహము జరిగిన తరువాత పెండ్లిపీటలమీదనుండి నలుగురు దంపతులు లేవకముందు శాంతాదేవి తన తమ్ముళ్ళకు హారతి యిచ్చినది. మంగళహారతి పళ్ళెము పట్టినది. ఇది లోకము నందలి వృత్తము అదియే యిచ్చట పొదుగబడినది.

చిత్రపుచేత పళ్ళెరము, పళ్ళెరమునందు చిత్రచిత్రములైన నగిషీ పనులు కలవని యర్థము. చిత్రమైన చేతగల పళ్ళెరమని యర్థముచేతయనగా పనితనము అట్టి పళ్ళెరము ఆమెచేతగొన్నది. వేరేవత్తి వెలిగించలేదు రత్నములే పళ్ళెరములో పోసినది ఆ రత్నముల కాంతియే దీపజ్వాల. ఆరాత్రిక యనగా మంగళహారతి, ఆమె యొకపాట పాడినది ఆమె పాడుచుండగా నొక వైణిక సామవేది, వీణమీద నామె పాడుచున్నపాటయొక్క స్వరములు పలికించెను ఇది తాత్పర్యము. ఆ వైణిక సామవేది ఉద్గాతలయందు అధినేత గొప్ప వేదపారి యన్నమాట, ఆయన తోడుగా వీణమీద వాయించెననగా, ఆమె నేను పాడుదును, నీవు వాయించుము, అని చెప్పలేదు. శాంతా దేవియొక్క కంఠస్వరముఅంత మధురముగా నున్నది శుద్ధస్వరోపేతముగా నున్నది అందుచేత ఆయనయే తోడు వాయించెను, అని యర్థము. మంగళహారతి పళ్ళెము పట్టినప్పుడు పాటలు

పాడుచూ నెవ్వరును శ్రుతి పోయించుకొనరు. తోడ వాయిద్యములు వాయింపించుకొనరు. మరియును గొప్ప సంగీతవిద్వాంసులు మధురమైన కంఠస్వరము వినినపుడు వారిదారినివారు పాడుచున్నప్పుడు ప్రశంసగా తోడివాద్యము జత కలుపుట లోకమునందున్నది. ఈరెండు హేతువుల శాంతాదేవియొక్క కంఠము మధురమైనదని ఈ పద్యమునందలి ధ్వని.

మంగళహారతి యిచ్చి యామె నలుగురు తమ్ములకు, నలుగురు మరదండ్రకు హారతిని ఒక్కొక్కరికి మూడుమూడు సార్లుగా కన్నుల కద్దినది. అదియే 'హస్తత్రయ క్లప్తిగా(గ' అన్నదాని యర్థము. లోకములో నలుగు రన్నదమ్ముల కొక్క యాడబడుచు, నలుగు రప్పసెల్లెండ్ర కొక్క తమ్ముడు నుండుట కలదు. అప్పుడు వారిప్రేమలు విశిష్టముగా నుండును. ఈ నలుగు రన్నదమ్ములకు శాంతాదేవి యొక్కతెయే అప్పగారు. ఆమెయందు వారికి పట్టరానంత ప్రేమ, గౌరవము. అంతటి ప్రేమయు శాంతాదేవి ప్రతి తమ్మునియందు చూపించును. ఇదియంతయు నీ పద్యమునందలి లోకాను సంధానము, వ్యంగ్యము, శిల్పము.

మహాత్ముఁడు

శ్రీ యస్. జి. ప్రసాదరావు యం. ఏ.

పీయూష ప్రతిమాన భాషణము, నిర్వేలాత్మ తేజమ్ము, దీ
ర్ఘాయత్త మ్ముపవాసశక్తి, యనుకంపా భోగచిత్తం, బహిం
సా యోగాదృతి, సత్యరాగము, జగత్సర్వేశ సేవావిధుల్
నీ యర్థమ్మున విజ్జిరాలినవి గాంధీజీ! యపూర్వమ్ముగన్.

ఎవియో ప్రాక్తన ఘోరకిల్బిషము లింతింతై విజృంభించి, హైం
దవ సంఘమ్మును బిప్పిచేసె, బహుధా ధర్మమ్ము నిస్తేజమై
యవిసెన్, శాంతిపథమ్ములన్ నడిచి యన్యాయంబు పోనాడి, సా
ధువులన్ సాఁకఁగ మాధవుండు కలియందున్ నీవుగాఁ బుట్టెనా?

మనుపిన్గై నడయాడెఁగాని, సమతా మాధుర్యముల్ క్రోలు జీ
వు నటుల్ వెగ్గెనెమాల? వానితల నిప్పుల్ వోసెలోకమ్ము, నీ
యనురాగా మృతహర్తయై, హరిజనుండై, సర్వకింపాక బం
ధన పాశిన్ విదళించె నాతఁడు, ప్రశస్తంబయ్యెఁ దజ్జన్మమున్.

అవనీ మండల మందుఁ బ్రత్యణువులో వ్యాపించి లీలామయుం
డవు సర్వేశున కేటికోల్లిడు నరుం డస్పృశ్యుఁగాఁ బాపభై
రవుఁగాఁ బుర్వుగఁ జూచి సాటిమనుజున్ రాకొట్టె, నీవి యధ
ర్మమ్ము రాపాడనినాఁడు దాస్యనిగళమ్ముల్ ద్రెంతురా హైందవుల్?

దైవజ్ఞాన ధనంబుఁ ద్రవ్వి తలకెత్తన్, శాస్త్రసాహిత్య వి
ద్యావైదుష్యము సర్వతోముఖముగా నార్జించినన్ లాభమే
మీ? వేలేఁడుల యంటులీ భరతభూమిన్ నవ్వపాల్జేసె, నీ
సేవానిష్ఠయ తద్గళంకముల నిశ్శేషంబుగా నూడిచెన్.

గుడులం గట్టెనుగాని లోనఁగొలువై కూర్చుండు స్వామిన్ నిషా
దుఁడు దర్శింపఁడు, గర్భమంటపిని భక్తుల్ సుద్దిసేయంగ వె
ల్వడు నీరమ్మును దూపర్వాణి కడఁగ్రోలంగగ్గె, నా మూల నీ
బుడుతండై హావణిల్లి దైవనిలయంబున్ జేరె ధర్మాకృతీ!

ఒకనాఁడీ కడజాతిమానిసిని నన్యుల్ చీ యటం చూరిలో
నికి రానీయఁగలేదు, మూఁతవడెనా నిర్భాగ్యునిం జూచివా
రి కనుల్, నేఁడతఁ డుత్తమోత్తముఁడు, మంత్రిశ్రేష్ఠుఁ డగ్రియనా
యకుఁడై పూజలు వొందు, నీ మహిమగాదా యిద్ది యోగీశ్వరా!

కరవాలమ్ములు, డాల్లు, కత్తళములున్ గన్పట్ట వాభీల సం
హారణంబుల్ గనరావు, రక్తపతనం బావంతయున్ లేదు నీ
వరితో భీకర యుద్ధమున్ జలుపునాఁ, డట్లయ్యు నిన్నే తుదిన్
వరియించెన్ జయలక్ష్మి, యీ సమరతత్త్వం బేవిధిన్ నేర్చితో!

తపముల్ చేసినవారు, భూపతులు క్రోధమ్మున్ విసర్జించిరా?
రిపుపై మక్కువఁ జూపిరా? భరతధాత్రిన్ మున్ను, దివ్యర్షియై

యపకారంబు సహింప, రాగఖనియై యత్యుగ్ర దౌష్ట్యమ్ము డీ
లుపడం జేయఁగ నీకు నొక్కనికె చెల్లున్ మూఁడు కాలమ్ములన్

మోసంబున్ దలఁదాల్చి మ్రొక్కులిడి, దుర్మోహంబుతోఁ బాప సం
త్రాసమ్మున్ విడనాడి, శత్రుజననాథ గ్రీవముల్ గోసి, ర
క్తాసారంబుల భూములన్ దడిపి రాజ్యమ్ముల్ ప్రతిష్ఠించినా
రే! సమ్రాట్టులు, నీకు వారలకుఁ బొత్తమైనఁ బాటిల్లునే?

శ్రమ లుద్వేలములైన, నెయ్యురు నిరాశన్ గ్రుంగి హింసా విధా
నము నగ్గించిన, దారుణాహితకు తంత్రం బేచి మాఁజొడ్డినన్
దమక మ్మొందక సత్ఫలంబులిడు సన్మార్గంబయన్ దివ్యత
త్త్వముతో వైరుల గెల్చి మానవచరిత్రన్ మార్చితీవో ప్రభూ!

కసవున్ జిమ్మినరీతి దుష్టగుణ సంఘంబూడ్చి, తుద్రిక్త రా
క్షసుఁడై యెమ్ములు పిండిచేసినను సౌజన్యంబుతో, క్షాంతితోఁ
బసినవ్వుల్ వెలియార్చి శత్రువును సంభావించితీ వౌర! నీ
యసిధారావ్రతచర్య యెవ్వరికి సాధ్యంబౌను? వీరాగ్రణీ!

ఒక కొల్లాయఁ గటిప్రదేశమున జానూర్ధ్వంబుగాఁ జుట్టి, వే
ఱొక గుడ్డన్ బుజమందుఁదాల్చి, వెనుకన్ యోధోత్తముల్ రాఁగ, నెం
డకు ఫాలమ్మునఁ జెమ్మటల్ గదుర, దండంబొండు చేపట్టి, దం
డికి యాత్రన్ బొనరించితే! పగఱ గుండెల్ ప్రీల శాంతిప్రభూ!

ఆ నీరూపము సూచి లోకములు మోహావెమ్మొందెనా! వీచికా
పాణి ధ్యానముఁజేసి గౌరవ మొనర్పన్ సాగరస్వామి తా
నే నీవంకకు వచ్చెనా! లవణ వాణిజ్యంబు గావించి ప్ర
జ్ఞానైపుణ్యముతో గడించితివె! స్వేచ్ఛాలాభమున్ గోమటీ!

పాపాత్ముల్ మతమౌఢ్య శేవధులు నల్వంకన్ మొనల్ తీర్చి, యే
ప్రాపున్ గానని కూనలన్ ముదిమివాండ్రన్ నిండుచూలాండ్ర, హిం
సాపీడాగ్నులఁ ద్రోయ నీశ్వరుఁడు పేశున్ బూనె, నా తావులన్
నీ పాదమ్ములు నించె శాంత్యమృతవేణీ ధన్యవిన్యాసముల్

అపమార్గమ్ములువట్టి, దుర్మదులు దౌష్ట్యమ్మున్ బ్రదర్శింప నీ
వుపవాసమ్మును బూని, యా శబర హింసోన్మాదమున్ డించి, తీ
యపవిఘ్నాత్మ బలంబెటుల్ కలిగెఁ? దానాహారమున్ వీడి మా
నిపె నెవ్వాఁడు పరాంతరంగములలో నెక్కొన్న రోగమ్ములన్.

కనులన్ జైత్యము సంధడించి పస రెక్కన్ ముఖ్యపాచివ్య మూ
నిన పాశ్చాత్య పరాన్న భుక్కొకఁడయో! నిన్ "నగ్నసన్యాసిఁ"గాఁ
గని యేవో యొఱగొడ్డెముల్ సకలలోకం బీసడింపంగఁ గూ
సెనుగానీ యుగమార్గదర్శకునిఁగా జేజేల నర్పించెనా?

అనాఘ్రాత

శ్రీ పి. యస్. ప్రకాశదీక్షితులు

❖

చైత్రశుద్ధ నవమి

వసంతం వసంతశ్రీ సుషమాంగియై ప్రవహిస్తున్నది. చూత, కేతకీ, కుంద, మందార, చందన, సిందువార, మల్లికా, మాలతీ, మాధవీ, తాల, హింతాలాలు కోరకించి, అంకురించి, పల్లవించి, సుమించి, ఫలిస్తున్నవి

చూతాంకురాస్వాద కషాయకంఠి కోకిల స్వామి పంచమస్వరం సుమసౌరభాలతో సర్వేంద్రియాహ్లాదం కలిగిస్తున్నది

యౌవనం మొగ్గ తొడుగుతూన్న దేవయాని, మాధవీ నికుంజ ప్రాంతమందున్న వసంత సరోవర తటాన గుమ్మటంలా పెరుగుతున్న బాలసహకార తరుశాఖపై ప్రవాలిన శుకపికసంతతుల సరససల్లాపసంగత సంగీతాన్ని, ఆకర్షిస్తున్నది

ఉదయారుణ రోచులలో సిగ్గు తెరచాటుకు నిష్క్రమించే ఉషశ్శ్రీ శోభలు దేవయానిస్మితవదనంలో ఆశాపూర్ణ రేఖలు చిత్రించినవి దేవయాని కనులు నెరవిచ్చినవి నునుసిగ్గు దొంతరల కిలకిలలు నెరవిచ్చిన కనులలో మిలమిల లాడినవి నెరగంట చూచినది అరకంట చూచినది క్రీగన్ను బరపినది అరచేయి కనుల కాతపత్రము చేసి చూచినది. దేవయాని గుండె సిగ్గుతో నిండి పోయినది

అంతలో ఆమెగుండె కలత వడ్డది

ఆమె శరీరమే గజగజ లాడినది

అనిర్వచనీయ వేదన ఆమె సుమహృదయాన్ని మెలి ద్రిప్పినది

క్షణాలలో ఆమెను స్వస్థత చేరినది

జారిన పైట సరిజేసుకుంది

రేగిన ముంగురులు దిద్దుకోవాలని ఎత్తిన వామహస్తం బాలసహకార తరుశాఖపై వ్రాలింది.

ఆమె అరుణాధరాలు ప్రకంపిస్తున్నవి.

అవ్యక్తవాంఛా సమాకృష్ట మవుతున్నది మనస్సు

దీర్ఘనిశ్వాసం వదలి అప్రతిహత దివ్యాస్త్రంలా వస్తూన్న వ్యక్తిని పరిశీలనగా చూడసాగింది

బాలార్కబింబంలా ఉన్న తేజోవదనం మీద బ్రహ్మవర్చస్సు మూర్తీభవిస్తున్నది. కొనసాగిన ముక్కుచివర వంపు ఉజ్జ్వల భవిష్యత్తును సూచిస్తున్నది ఉంగరాలు తిరిగిన శిరోజాలు భుజాలమీద విశ్రాంతి తీసుకుంటూ మలయానిలానికి నాట్యం చేస్తున్నవి విశాల వక్షస్థలంమీద చీనాంబరం చిందులు తొక్కుతున్నది గోచీపోసి కట్టిన క్షీరాబ్ధి ధోవతి పాదాలపై నవశోభ లీనుతున్నది వామ భుజంమీదనుండి దక్షిణ పార్శ్వానికి వ్రేలాడుతూన్న యజ్ఞోపవీతం...

దేవయాని మనో మానస సరోవరంలోని భావరాజహంసలు రెక్కలువిచ్చి రివ్వున ఎగిరినవి

"క...చు...డు...ఆచార్య బృహస్పతి సూనుడు"

ఆమె గుండెతో మనసు గుసగుసలాడింది, నిన్న సాంధ్యవేళ దేవర్షి నారదులు పలికిన వాక్యాల స్మృతితో బారసాచి అడుగులు వేసుకుంటూ మహాదీక్షతోవచ్చే కచుడు సమీపిస్తూన్నకొద్దీ దేవయాని శీర్షం నమ్రం కాసాగినది

అవనత వదనయైన దేవయానికి బొబ్బ లెక్కి ఎఱ్ఱవారిన కచుని మృదుపాద పద్మములు కంటనీరు త్రిప్పినవి ఆ క్షణములో ఆమెదృష్టి ఓషధులవైపు మరలినది, ఆమె హృదయ మాతని పదసేవకు కుతూహల పడింది కాని దేవయాని ఆభిజాత్యమామెను కదలనీయలేదు.

ఆషాఢ ప్రథమ దివసాంతవేళా వ్యాప్త పుష్కలావర్త కాంభోధరోద్భూత సౌదామినీ మాలాసదృశ దీప్తభ్రమణ మహావేగంతో కదలే కచుని పదములు రక్కున ఆగినవి

ఆగిన కచునివైపు దేవయాని క్రీగన్ను దరహసితవదన కాంతితో కదలింది

కదలిన దేవయాని కేల్దోయి అంజలి ఘటించింది. అంజలి ఘటించిన దేవయాని ఆశించినట్లు ఆశీర్వదించలేదు ఆచార్య సూనుడు

అచార్యసూనుని నిర్లిప్తత దేవయాని గుండెలో చురుక్కున గ్రుచ్చుకొన్నది

"ఆచార్య శుక్రుల ఆశ్రమానికి అంతేవాసిగా వస్తూన్న అమరగురు పుత్రుణ్ణి, బార్హస్పతిని" అన్నాడు, దేవయానివైపు అచంచల దృష్టి ప్రసరిస్తూ

"ఆచార్య శుక్రుల అనుంగుపుత్రి అభివందనం చేస్తున్నది' ఆశీర్వదించండి, దేవయానిని" అని చిరునవ్వు నవ్వింది

"అధ్యయన దీక్షితుడికి ఆశీర్వాదాధికారం లేదు" అని అడుగు కదల్చబోయిన కచుని ఉరఃస్థలంమీద దేవయాని దక్షిణపాణి నిరోధ సూచకంగా నిలబడింది

"అధ్యయన దీక్షలో అవరోధాలు అనేకాలు"

దేవయాని కలకంఠం పలికింది

కచుడు చలించినాడు, కచుని మనస్సు విచలిత మయినది, కచుని హృదయ మాందోళికారోహణ మొనర్చింది

"అవరోధాలు దీక్షాపరీక్షలు"

అని దేవయాని పాణిపద్మాన్ని కరాంగుళులతో తప్పింప జూచినాడు

కచుని యత్నము వ్యర్థమయింది,

దేవయాని ముకుళిత పాణిపద్మంలో కచుని హస్తాగ్రాలు బిగిసిపోయాయి

ఆమె అర్ధనేత్రము లాశాపూర్ణ దృక్కులను ప్రసరిస్తున్నవి, ఆమె విచలితారుణాధరాలు కచుని కెంబెదవుల నాకర్షిస్తున్నవి.

పరాఙ్ముఖు డయినాడు, కచుడు

ఎదురు వచ్చినది దేవయాని

బ్రహ్మచర్య దీక్షాశిక్షితుడయిన కచుడు దేవయానిని ప్రక్కకునెట్టి విసురుగా అడుగు కదిపాడు.

"ఆచార్యపుత్రి ఆగ్రహాన్ని అధ్యయనానికి అభ్యంతరంగా భావించలేని మహాజ్ఞానీ!"

అని ఫకాలున నవ్వింది.

ఆమె నవ్వు కచుని పదములను బంధించింది

"ఆచార్య పుత్రీ!"

అని వెనుదిరిగి నిలబడినాడు కచుడు

"ఔను ఆచార్యుల ఏకైకపుత్రిని ఆలోచించి అడుగు కదుపు"

అని కనుబొమ లెగరేసి కచుని జేరింది దేవయాని.

దేవయాని లోచన విలాసాలు, పదచలన విన్యాసాలు, నవోదిత వక్షోజ వికాసం, ఆమె సర్వస్వం కచుని ఉచ్ఛ్వాస నిశ్వాసలను నడుపుతున్నాయి

"దేవ-యాని!"

ఆనంద, భయోద్రేకాశ్చర్యాలు కచుని కంఠంలో నినదించాయి

"దేవలోకంనుండి పంపేవేళనే చెప్పి ఉంటారు, ఆచార్యశుక్రుని అనుగుపుత్రి దేవయానిని..." సిగ్గుతో, అరకంట చూపుతో, పైటచెంగు మెలిద్రిప్పుతూఆగింది దేవయాని

కచుని మనస్సీమలో స్మృతితరంగాలు పరువు లెత్తినవి, అతని కన్నుల ఎదుటనున్న దేవయాని మనోయవనికమీద లాస్యమాడుతున్నది

"ఔను...కా...ని"

మరి మాటాడలేదు, కచుడు

"అపరిచిత వ్యవహారాలపట్ల గల ఆసక్తి, అవి ఆసన్నమయినప్పుడు ఎంతటి బుద్ధికుశల తనూ పనిచెయ్యనీదు"

అని అతని దక్షిణ కరాన్ని తను వామ హస్తంతో బంధించి అడుగు కదిపింది.

దేవయాని తన వామభాగాన్ని కాక దక్షిణ భాగాన్ని స్వీకరించటం కచునికి ఆనందదాయక మయింది

"అఁ, మనం ఆశ్రమానికే వెడుతున్నాం కాదుఁ ?"

కొంతదూరంనడిచాక అడిగాడు కచుడు

అననుభూతము లయిన అనుభూతులను ఆలోచించుకుంటూ అడుగు కదిపే దేవయానికి కచుని ప్రశ్న వినబడలేదు ఆమె సర్వాంగములు కచుని హస్తస్పర్శతో పులకించి పలకరిస్తున్నవి,

"దేవయానీ! మనం ఆశ్రమానికే వెడుతున్నామా ?"

అని ఆమెచేతిని విడిపించుకుని అడిగాడు

ఉలిక్కిపడ్డది దేవయాని

దేవయానిగుండె గతుక్కుమన్నది.

"ఏమంటున్నారు స్వామీ"

అని బిక్కుబిక్కుమంటూ చూచింది, విచిత్రమయిన కోపాన్ని అభినయిస్తూ

అంతలో ఎదురువస్తూన్న దేవయాని చెలికత్తెలు ఆమె హృదయంలో తూట్లు పొడిచారు

"వచ్చేవాళ్ళ నడగండి"

అంటూనే దేవయాని అదృశ్యం అయింది

౨

"ఆచార్యులకు బార్హస్పతి అభివాదాలు"

అని సాష్టాంగపడ్డాడు కచుడు, ఉత్తరీయాన్ని నడుముచుట్టూ చుట్టి ప్రాతస్సంధ్యాదీక్షనుండి కనులువిచ్చి లేస్తూన్న శుక్రాచార్యులు

"మనోఽభీష్ట సిద్ధిరస్తు"

అని ఆశీర్వదించాడు

"ధన్యోఽహం! ఆచార్యుల ఆశీర్వాదం అమోఘం"

అని పులకిత హృదయుడయాడు కచుడు ఆచార్యశుక్రుడు కనులు నెరవిచ్చి చూచాడు, ఆయన మనోనేత్రం కచుని రూపురేఖలను చిత్రించుకొన్నది కుశాసనంపై సుఖాసీనుడై ఉన్న ఆచార్యుల పార్శ్వభాగాన పద్మాసనాసీను డయినాడు కచుడు

"జ్ఞానభిక్షార్థులకు ఆచార్య శుక్రుల ఆశ్రమ ప్రవేశవేళ "మనోఽభీష్ట సిద్ధిరస్తు" అన్న ఆశీర్వచనంకంటె ఆశ్వాసన నిచ్చేదేమిటి గురుపూజ్యా! ఈ అంతేవాసి మీ పద సేవకు అంకితుడు"

అని తలవంచినాడు

"ఆచార్య కంఠం అసత్యాలతో ఆశీర్వచనం పలకదు. అయినా అంతేవాసికి పరీక్షలే ఆఘూతాలు అభ్యసించే విద్యకూ, ఆగమించే అవరోధాలకు సంబంధం ఉండదు ఇది రాక్షసాచార్యుని ఆశ్రమానికి పంపేవేళ అమరగురువులు విస్మరించరే"

అని అరచేతి వెనుక భాగంతో కోరమీసం పైకెత్తినాడు ఆచార్య శుక్రుడు,

"సమస్కంధుల ఆలోచనలు !"

అని నవ్వక నవ్వినాడు కచుడు.

"అనుకుంటూనే ఉన్నాను ఇటువంటి విషమస్థితికి కూడాఁ అమరాచార్యుని మేధ సాహసిస్తుందని కానియ్యి, పిపాసకి శీతలోదకా లీయటం గృహస్థధర్మం విద్యాతృష్ణతో విచ్చేసినవాడికి విజ్ఞానదానం చేయటం ఆచార్యపీఠానికి విధి ఆశ్రమాలలో అమరాసుర భేదంలేదు అమరగురు పుత్రుడు అసురాచార్యుని అంతేవాసిగా వచ్చి శుష్కహస్తాలతో పోవటం ఆచార్య శుక్రులకే అవమానకరం" అని అట్టహాసము చేశాడు శుక్రాచార్యులు

"ఆచార్యుల అభిమానానికి అనవరత విధేయుణ్ణి" అని పొంగిపోయాడు కచుడు

శుక్రాచార్యుని మహాహాసంలో కచుని సంతృప్తిపూర్వక మయిన నిశ్వాసలు హారించిపోయాయి

౩

ఆచార్యశుక్రుని ఆశ్రమంలోకి అమరేంద్ర గురుసూనుడు ప్రవేశించిన వార్త మెలమెల్లగా రాక్షస వీరుల కర్ణమూలాలలో శూలంలా గ్రుచ్చుకొన్నది బార్హస్పతికి భార్గవులు విద్యాదానం చేయటానికి సమ్మతించిన విషయం మరికొంత ఆలస్యంగా గ్రహించారు రక్షోవీరులు అమరాచార్యసూనుడికి శుక్రుడు తన ఆశ్రమంలోనే స్థానం ఈయటం, బృహస్పతినే అతిథిగా సత్కరిస్తున్నట్టు శుక్రుడు తృప్తిపడటం రాక్షసానీకాన్ని కలవరపరచింది రాక్షసజాతి భూత, వర్తమాన, భవిష్యత్తులు ఆచార్యశుక్రుని అక్షీచలనంలో ఆధారపడి ఉన్నవి వారి అభ్యుదయానికి అనవరతాంతరాయాలు కలగజేసే అమరజాతికి ప్రధాన సచివుడయిన బృహస్పతి ఏదో ప్రమాదాన్ని తలపెట్టకుండా తన కుమారుణ్ణి బలవద్విరోధివద్ద విద్యాభ్యాసానికి పంపడు అనే తీర్మానాన్ని రాక్షస సచివులు ప్రకటించటానికి ఎక్కువకాలం పట్టలేదు రాక్షస సచివుల ప్రకటనలో ఆచార్య శుక్రులపై అనుమానం లవలేశమూ లేదు, కాని కచుని యత్నమే శంకించబడ్డది సచివమండలి అద్యతన కర్తవ్యాన్ని నిర్ణయించకుండానే సమావేశాన్ని ముగించింది జరిగిన విషయాన్ని పరిశీలించటం వినా 'ఇదమిత్థ' మనే నిర్ణయాలేమీ జరపకపోవటం రాక్షస యువకులకు అసంతృప్తిని కలిగించింది. సచివమందిరంనుండి నిష్క్రమించే పెద్దలవైపు కొరకొర చూశారు బాలవీరులు త్వరపడి ఒక నిశ్చయానికి రావడం ఎదిరి కంటె తమకే అనర్థం రావచ్చుననుకున్నారు సచివులు

బృహస్పతి ఏ సంకల్పంతో తన కొడుకుని పంపాడో ఒక్కరికీ అర్థంకాలేదు బ్రహ్మవిద్యోపదేశంకోసం కచుడు శుక్రాచార్యులనాశ్రయించవలసిన పనిలేదు ఇతర శాస్త్రాలను అధ్యయనం చేయటానికి ఆశ్రమాలు లేకపోలేదు, కులపతులు లేకకాదు

మరి ?

ప్రశ్నకు జవాబు దొరకలేదు,

ఒకరివైపొకరు కన్నులువిప్పి చూశారు ఒకరి ముఖంలో ఏ అసంతృప్తి ఉన్నదో అందరి కనులలోనూ అదే ప్రతిఫలిస్తున్నది రాక్షస యువకులు ఆలోచనకంటె ఆచరణకే అగ్రస్థానాన్ని అనుగ్రహించి అడుగు కదిపారు ఆచార్యాశ్రమంవైపు. మధ్యేమార్గంలో అనేకులు అనేక మీమాంసలు సాగించారు ఏఒకరి తర్కమూ అనుమానాన్ని అధఃకరించే ప్రమాణాలను ప్రతిపాదించలేకపోతున్నది ఆప్తవాక్యమయినా అందలేదు.

"ఒకవేళ కచుడు ఆచార్యపుత్రిని వలచి వచ్చాడేమో?"

సందేహాన్ని ప్రకటించాడొక నవయావనుడు

"అసంభవం, బృహస్పతి కొడుకు ప్రేమ వ్యవహారాలకోసం రాక్షసాచార్యుని ఆశ్రమానికి రాడు"

అని కోరమీసం మెలిద్రిప్పాడు, నడివయసువాడు

౪

శర్మిష్ఠ కబురంపినది

దమయంతి స్వయముగావచ్చి పిలిచినది.

సినీవాలి కందుకక్రీడ కాహ్వానించింది

నిశి వెక్కిరించింది

సంధ్య పలకరించినది

దేవయాని మౌనముద్ర వాడలేదు, కుశాస్తరణము వీడలేదు

కచుని చూచిన దాది ఆమె మనసు మనలోసులేదు స్వర్లోకపు వింతలు, విశేషాలు విన్న దేవయానికి కచుడే స్వర్లోకమయాడు స్వర్లోక భోగములవలెనే కచుడుకూడ దేవయాని కన్నుల ఎదుట మాత్రమే నర్తిస్తున్నాడు

నిరంతరం లక్ష్యసాధనాచిత్తుడయిన కచునికి దేవయాని దృష్టిలోలేదు ఆచార్య

శుక్రుని ఆదేశాలను ఆచరించుటయే కచుని దినచర్య, గురుశుశ్రూషయే కచుని దీక్ష ఆతని కన్యచింతలేదు అమరజాతి భవిష్యత్తు తన చేతులలో ఉన్నదని కచుడు మరచిన క్షణములేదు అతని కనుల యెదుట పితృపాదు లొకవంక, అమరేంద్రు డొకవంక ఆశానేత్రములతో నిలబడి పిలుస్తున్నారు

దేవయానికి రాత్రి నిద్రలేదు.

ఆమెకు పగటిపూట విహారము లేదు

అనుక్షణము ఆమెకనులు కచుని కొరకు నిరీక్షిస్తున్నవి ఆమె సుమ హృదయము కచుడు బంభరము కావలెనని కోరుచున్నది

"బార్హస్పతీ"

దేవయాని పిలిచినది

ఆచార్యులు అనుష్ఠానంలో ఉన్నారు, ఆయన ఎదుట పద్మాసనం వేసికొని ఉన్న కచుడు ఉలిక్కిపడి చూశాడు

దేవయాని విలోలవిలోచనాలతో ఆహ్వానించినది ఆలోచించాడు కచుడు రోజులు గడుస్తున్నవి,ఋతువులు నడుస్తున్నవి ఆచార్యులు అధ్యయనదీక్ష నిచ్చుటలేదు అమరపురినుండి వచ్చునాడు·

"శుక్రాచార్యుల అనుంగుపుత్రి దేవయాని ఆమె తోడిసఖ్యమువలన మన కృషి ఫలవంతము కాగలదు"

అని పితృపాదులు పలికిన వాక్యములు కచుని మనోవీధిలో మసలినవి

కచుని హృదయ ముప్పొంగినది

అతని కన్ను లుత్ఫుల్లములయినవి.

ఆతని శరీరమే చంద్రోదయోద్వేల సాగరమయినది,

'దేవయానీ'

సాదరపూర్వ కంఠముతో సమీపించాడు

దేవయాని సంతోషతరంగితస్వాంత అయినది

ఆమె మారుపల్కలేదు, తలవాల్చి, క్రీగంట చూడసాగినది కచుడు చకితుడయినాడు

బ్రహ్మచర్య దీక్ష!

దేవజాతి భవిష్యత్తు!

కచుడు స్వరమును హెచ్చించి,

"గురుపుత్రీ! ఏమి ఆజ్ఞ? వసంత సరోవరంలో వికసించే కల్హారాలతో క్రీడా కందుకం కట్టిపెట్టనా?"

అని అడుగు కదల్చినాడు

దేవయాని నిట్టూర్పు విడిచింది

"నా కన్నుల్లో అంతకుమించిన ఆశలు కనిపించటంలేదూ బృహస్పతి సూనుడికి?"

స్మితశ్రీ సుషమాసంయుత వదనం పైకెత్తి అడిగినది, దేవయాని

"గురుపుత్రీ!"

వినయంగా దోయిలించాడు కచుడు

"అనుక్షణం గురుస్మరణా, గురుశుశ్రూష తేనా? దేవయానీ! అనలేవూ"

అని సిగ్గుతో చూసింది దేవయాని

"బ్రహ్మచారిని, విద్యాదీక్షితుడను,శుక్రాచార్యుల అంతేవాసిని, అంతకన్న..."

అని కచుడు చెప్పుకుపోతున్నాడు నవ్వుతూ దేవయాని ముక్కుమీదకు తర్జనీ నడిపింది

"పితృపాదుల అనుష్ఠానానికింకా వ్యవధి ఉంది ఇంతలో వసంత సరోవరంలో జలక్రీడలాడి వద్దాం"

ముందడుగు వేసింది దేవయాని

"బ్రహ్మచారికి నిషేధాలేవో తెలిని దానవుకాదు ఆచార్యపుత్రీ!"

"ఆచార్యపుత్రి ఆజ్ఞలను అవహేళన చేయటం అంతేవాసికి విధికాబోలు"

చిరుకోపంతో పెదవులు కదలించింది, దేవయాని

"విధి, నిషేధాలను తెలుసుకోవటానికి అభ్యంతరంలేదు కాని సామాన్యాంశాలు తెలినివాణ్ణికాను"

"కనకనే చెప్తున్నాను"

"తెలిసినవే తెలిసికోనా?"

"నీకు తెలిసినవి నువ్వు చెప్పినట్లు నామాన్యాలు మాత్రమే నేను విశేషాపద్ధర్మాలు చెప్తున్నాను"

"ధర్మ నిర్ణయంలో అబలల చంచలహృదయం..."

"చంచల హృదయంతోనే ఆహ్వానిస్తున్నాను"

"గురుపుత్రీ"

అని నిర్లిప్తంగా చూచి కచుడు శుక్రుని జేరాడు

28

శరత్సంధ్యారాగాలు వసంతసరోవరంలోని అరుణపద్మాలకు అలంకారాలు దిద్దుతూన్నవి ఆశ్రమ పరిసరాలనుంచి వెలువడే హోమధూమం సంధ్యాదేవి కైసేసికొనే మేలిముసుగులా సాగుతోంది ప్రకృతి నిశ్శబ్దాన్ని వరించింది పురివిప్పిన నెమలి రీవిగా మాలతినికుంజం మాటునున్న పుట్టల వైపు నడుస్తున్నది గున్నమావి గుబురుల్లో ఇరికి కూర్చున్నవి శ్వేతపారావతాలు.

భార్గవుని పార్శ్వభాగాన ఉండే బార్హస్పతివైపు చూచే దేవయాని కనుపాపల్లా వస్తున్నవి తారకలు ముకుళించిన అడవి మల్లెలు వికసిస్తున్న వాసనలు ఆశ్రమానికి అల్లంత దూరంలో నిలబడ్డ దేవయాని నాసాగ్రాన్ని పరిమళమిళితం చేస్తున్నవి గారాముగా పెంచే కిశోరహరిణము చెంగు చెంగునవచ్చి జారి వ్రేలాడుతూన్న చీనాంశు కోత్తరీయాన్ని మునిపెదవులతో పట్టి లాగి పరువుతీసినది దేవయానికి అస్పృహలేదు ఆశ్రమ సమీసంలో వెనుదిరిగి చూచిన 'కిశోరము' ఒక్క చెంగులో దేవయానిని సమీపించి బిత్తరిచూపులతో పాదాలను ముట్టింది

దేవయాని చకిత అయినది

తన పాదములపై కచుని అంగుళీయములు నర్తిస్తున్న వనుకొని తలవంచి చూచింది

హరిణకిశోరము

దేవయాని సిగ్గుపడింది, నిరాశ నిలువెల్ల దోచింది.

నిట్టూర్పు విడిచి కిశోరిని ఎత్తుకుని గుండెలకు హత్తుకుని వెనుదిరిగి చూస్తూ, ఆగి యాగి నడుస్తూ ఆశ్రమద్వారమును సమీపించింది

ద్వారసమీపాన తలవ్రేల వైచుకొని నిలబడిన కపిలగోవు దేవయాని హృదయమును విచలిత మొనర్చింది. దిక్కులు పరికించి చూచింది కపిలతో వెళ్ళిన కచుడులేడు

దేవయాని కంట నీరు తిరిగింది

ఆమె పదములు గజగజ లాడినవి

కపిల మూపురముపై చేయి వైచినది, కపిల తలయూచి సంతసించలేదు దేవయాని కన్నీరు కపిలమూపుపై ప్రవహించుచున్నది కపిల కనుగొలకులలో బాష్పబిందువులు నిలిచినవి

సాంధ్యకృత్యములు నిర్వర్తించి వచ్చిన శుక్రాచార్యులు కపిలనూ, దేవయానినీ సాదరపూర్వ హస్తములతో సోకినాడు దేవయాని తండ్రికి నమస్కరించలేదు, మనోజ్ఞహాసముతో మధురవాక్కులు పలకలేదు, కపిల గ్రీవము నాడించలేదు, తల పైకెత్తలేదు

చలించినది రాక్షస సచివుని మనసు

ద్రవించినది రాక్షసాచార్యునిహృదయం.

ఆలోచించినాడు భార్గవుడు

భార్గవుని బుద్ధి తైక్ష్ణ్యద్యుతులయెదుట దేవయాని లేహృదయమం దధివసించిన బార్హస్పతి ప్రతిఫలించినాడు అనుంగుపుత్రి అనురాగాన్ని ఎరుగనివాడు కాదు ఆచార్య శుక్రుడు

దేవయాని చిబుకము పైకెత్తి చూచిన శుక్రాచార్యుని కనులు కించిదార్ద్రములయినవి, తల ప్రక్కకు త్రిప్పినాడు కపిల తల యెత్తలేదు

"నాన్నా, బార్హస్పతి సంధ్యావందనం చేసి రాలేదు,కలిసివెళ్ళిన కపిల ఒంటిగా..."

దేవయాని గొంతు విడలేదు

ఆమె కనులలో అశ్రుధార ఆరంభమయి నది.

ఆచార్య శుక్రుని క్రాంతనేత్రము కచుని స్థితిని చూచినది

సురవైరి మండలికి సురేశ్వరాచార్య సూనునిపైగల ద్వేషభావం ఆచార్యులకు అవగతపూర్వం.

నిలబడిన దేవయాని నిలబడినట్లే ఉన్నది

తలవాల్చిన కపిల తల త్రిప్పనేలేదు

అంతలో కదలివెళ్ళి తిరిగివచ్చిన ఆచార్యుని వెనుక నిలబడిన కచుని నిశ్వాసము కపిల కన్నులలో కాంతినీ, దేవయాని హృదయములో శాంతినీ ప్రసరించినది ఆచార్యుడు ఆలోచనా మగ్నమనస్కుడై ఆశ్రమ ప్రాంతస్థ వటతరుచ్ఛాయాచ్ఛాదిత వేదిక వైపు నడచినాడు అనుసరించబోయిన అంతేవాసిహస్తాంగుళులు దేవయాని పాణి కిసలయాలలో బంధింపబడిపోయినవి

వెనుదిరిగినాడు కచుడు

దేవయాని ఆశ్రమంలోకి నడిపిస్తూ జరిగిన కథను కచునికి చమత్కారంగా వినిపించింది,

కచుడు నవ్వినాడు

కచుడు నవ్వినట్లు దేవయానికి తోచినది

దేవయాని నవ్వినది

నవ్విన దేవయాని కచుని కలవరపరచినది

కచుడు బ్రహ్మవిద్య నుపాసించినాడు

బ్రాహ్మము కచుని హృదయమును ధవళిత మొనర్చినది,

అతని బుద్ధిని నిశ్చల మొనర్చినది

ఆరగించుచున్న కచునితో ఏమేమియో భాషించుచు, రాక్షస మాయలు, తన తండ్రి మహాశక్తి నివేదించుచు అతని ముంగురులు దిద్దసాగినది కచుడు భోజనము ముగించుచునే ఆశ్రమమును వీడినాడు

౬

తిరిగి వసంతకాల మరుదెంచినది

కచుని ప్రవేశవసంతబాలిక ద్వితీయ జన్మదినోత్సవమును జరుపుకొన్నది

ఈ జయంతికి శుకపిక సంతతులు కలకంఠము లెత్తినట్లు దేవయానికి తోచలేదు. లతానికుంజములు రంగురంగుల రంగవల్లులలో స్వాగత మిచ్చినట్లు దేవయాని గ్రహించలేదు వసంతసంతస హంసలామె మానస సరోవరమున విహరింపరాలేదు, అందలి పద్మములు వికసించలేదు, పద్మములమీది హిమాంశువులు జారనేలేదు వానివలెనే ఆమె కనుదమ్ములందును కించి దుష్ణజలలవములు సాగియున్నవి వసంతసరోవరతటమున నిలబడిన దేవయాని చూపులు సుదూరమునకు సాగియున్నవి ఆ చూపులను దూసుకొని వచ్చుచున్నవి సంధ్యారుణకాంతులు

దేవయాని ఆర్ద్రనయనములు సంధ్యాకాంతులలో ఇంద్రధనుశ్శోభల నీనుచున్నవి

దేవయాని చూపులవేడికి సంధ్యాకాంత తప్తహృదయయైనది ఆమెతనువల్లితాపఘర్మ జలముగా నక్షత్రముల నలంకరించుకొన్నది

దేవయాని నిట్టూర్చినది

నిట్టూర్చిన దేవయాని కనుబొమల కుదుళ్ళలోని చిరుచెమట బిందువులు ఆమె కనులలో పడి మూయించినవి

మూసిన కనులు మూయకుండ తెరచుకొన్నవి

తెరచుకొన్నంతలో కొంగు కనుల నొత్తినది

ఒత్తునంతలో ఆమె కన్నులార్ద్రములయినవి

ఆర్ద్రములయిన నయనములతో అడుగు కదిపినది

వచ్చెడి దేవయాని తనువల్లి విలయ వేళా సముద్భూతానిల ప్రచండవేగ తీవ్ర సంచలిత సంక్షుభిత సాగర తరంగోత్తుంగ శిఖరతాడిత ప్రతాడిత సైకత తటాంకురిత బాలరసాలమువలె నున్నది, అనుష్ఠానాదులు ముగించుకొని వచ్చిన ఆచార్యశుక్రుడు అనుగు బిడ్డను అదరి చూచినాడు ఆయన మనసు

ఆమె మనసు నాకర్షించినది ఆమె మనసు కచుని మనసు నలరింప జూచుచున్నది

కాదనలేదు కన్నతండ్రి

ఒకానొక జాతినే సమూలనాశన మొన రించుటకు సంకోచించని అసురాచార్యుని హృదయము ఆజన్మవైరి పుత్రుని ప్రేమించు చున్న చిట్టితల్లి యెడ మమకారమును వీడ లేకపోయినది కన్నగుండె!

శుక్రుడు శంకించినాడు,

నారదుడు శంకాసంకుచిత బీజములను చల్లిపోయినాడు

శంకించిన శుక్రాచార్యుని హృదయము సంకుచితము కాలేదు, సంతోష తరంగితమే అయినది దేవాసురాచార్య పుత్రపుత్రీ సంబంధ సాన్నిహిత్యమయినా పరస్పర వైర నాశనానికి దోహదం యిస్తుందనుకు న్నాడు కాకపోయినా అమరాచార్య సూనుడు 'ఆచార్యదేవోభవ' అని అంజలి ఘటించి అసురగురుని ముందు నిలబడటం సామాన్యయోగమా!

పొంగిపోయినది ఆచార్యునిహృదయము

ఆచార్యుని హృదయములో దేవయానిపై అనురాగము అవధుల నతిక్రమించినది,

యౌవన ప్రాదుర్భావ దేవయాని

బ్రహ్మచర్య దీక్షితుడు కచుడు

ఒకే అయస్కాంతమునందలి రెండు ధ్రువములు, విభిన్న ధ్రువములకు ఆకర్షణ నిసర్గమే కాని ఏకాయస్కాంత మందలి భిన్నధ్రువములకు కలయిక యేమి? విడుట యేమి? అన్యోన్యతయు ఉన్నదనలేము

ఇది జరుగుతున్నది

జరుగుతున్నది ఆచార్యునికి అవగతమే,

సజల నయనాలతో ఎదురువచ్చుచున్న దేవయాని అసంతృప్త చేతముతో, భీతహృదయముతో తండ్రి వక్షముపై తల వాల్చినది

ఆచార్యుని గుండె గుసగుసలువోయినది

ఆయన దక్షిణహస్తము దేవయాని శీర్షముపై కదలుచున్నది

ఆయన పెదవులు వణకుచున్నవి

ఆయన శరీరమే చలించుచున్నది

పెదవి కదల్చి పలుకలేక పోయినాడు ఆచార్యుడు

దేవయాని హృదయము చిక్కబట్టుకొను సరికి ఆచార్యుని మోముపై విషాద మేఘములు చెల్లాచెదరై పోయినవి

"ఔను, బార్హస్పతి రాలేదు..."

అని కనులుమూసి, అంతర్దృష్టిని బాహిర మొనర్చినాడు అతల, వితల, రసాతలాది అధస్సప్త లోకాలలో, జనోలోక, తపోలోక సత్యలోకాది ఊర్ధ్వసప్తభువనాలలో కచుని ఛాయలేదు చకితుడై ఆచార్యుడు అంతర్దృష్టిని అంతరంగంలోనికి బంపినాడు

ఆచార్యశుక్రుని అంతరంగము ఆశ్చర్యానందోద్వేల మయినది అంతలో ఆయన కన్నులలో విస్ఫులింగములు వెడలినవి

నాటి అపరాహ్ణ వేళ అసుర సామంత మండలి జరిపిన విందులో ఆచార్యులకు ప్రత్యేక పాత్రతో సమర్పింపబడిన మద్యములో భస్మావశేషము సమ్మిళిత మొనర్చినారు

ఆచార్యుని ఆగ్రహము ఆకాశము నంటినది

అధ్యయన దీక్షతో వచ్చిన అమాయిక బాలకుణ్ణి హతమార్చి భస్మాన్ని మద్యంలో కలిపి యిచ్చినా గుర్తించలేనంతటి ప్రమత్తను కలిగించే సురాపానం శుక్రాచార్యుని శాసనంగా నాటినుండి మేధావులకు నిషేధింపబడినది

నిషేధించిన అనంతరం ఆచార్య శుక్రుడు తన గర్భంలో అణురూపంలో ఉన్న కచుణ్ణి ఆత్మతో ప్రబోధించాడు కచుడు పలికినాడు

ఆచార్యుడు అవసరకృత్య నిర్వర్తితుడై పద్మాసనాసీనుడై కూర్చున్నాడు, ఎదురుగా ఆశాప్రపూర్ణలోచనాలతో దేవయాని నిరీక్షిస్తున్నది, ఆమె లేతగుండె వలపుల బావుల కేత మెత్తింది

'ఉచ్చారణ దక్షుచేత అభిహితమయిన శబ్దంలా, ఆచార్య శుక్రుని గర్భంనుండి అవతరించిన కచుడు,గర్భంలోనే అభ్యసించిన మృతసంజీవనీ దివ్యమంత్రంతో

ఆచార్యుని పునరుజ్జీవితుణ్ణి చేశాడు

ఆచార్యశుక్రుడు నిద్రనుంచి మేల్కొన్న వానివలె లేస్తూ, కచ-దేవయాను లిరువురి వైపూ మందహాస ధవళిత శోభానయనాలు జరపాడు

దేవయాని సిగ్గుతో కనులు మిలమిలలా డిస్తూ ఓరగంట చూచింది

కచుడు దీక్షాపరిపూర్తి నందిన సంతృప్త హృదయంతో గురుపద పద్మాలకు నమస్కరించాడు

ఆచార్యశుక్రుడు ఆశీర్వదించాడు

* * *

తెల్లవారింది!

శుక్రాచార్యులు అత్యవసర కార్యంమీద అధీశుని ఆస్థానానికి నడిచాడు.

సెలవు తీసికొన్న కచుడు ఉషశ్శోభ లలో అమరావతి వైపు నడుస్తున్నాడు

వసంతసరోవరతటాన మల్లికానికుంజ ప్రాంతాన గుమ్మటంలా పెరుగుతున్న బాల సహకార వృక్షంపై చేయూని నిలబడి ఆర్ద్రనయనాలతో ఉన్నది దేవయాని. చకితుడైనాడు కచుడు

"సోదరీ! సెలవు"

అని వెనుదిరిగి చూడలేక బారసాచి అడుగులు వేశాడు దేవయాని అటే చూస్తున్నది.

వసంతవిలాసము

★ శ్రీ శనగన నరసింహస్వామి ఎం. ఏ. ★

ప్రాలేయ యవనికా పటము వారించి
వసుధా సభావేది కుసుమాలు జల్లి
ఋత్వంక యుతవర్షకృతి నాందిజరిపె
బహురూప చైత్రరూపక సూత్రధారి

మలయమందానిల మత్తేభమెక్కి
రతినాయికా ప్రేరణ మార్చుకొనుచు
రసికులు కరతాళరవముల మెచ్చ
రంగప్రవేశం బనంగుడు జేసె

చైత్ర సుందరజయ స్తంభంబనంగ
చూతవృక్షము కిససుమ జుష్టమయ్యె
సౌరభ్యభారమ్ము సహియింపరాక
చిరుగాలులెల్ల నుక్కిరిబిక్కిరయ్యె.

పులకరింపని తీవపూబోడి లేదు
చివురులు తొడుగని క్షితిజమ్ము లేదు
వలపు చిందని ప్రసవమ్మొండు లేదు
అక్షయ తూణీరుడయ్యె మన్మథుడు.

పుంస్కోకిలోత్కాల పూరరావములు
భ్రమరసంభ్రమ సదాభ్రమణ గానములు
సుమనః పరిమళోద్గమ విక్రమములు
మందలోకము రాగమయముగా మార్చె.

వనదేశ విహాగమోహాన కూజనముల
ప్రేయసీ సల్లాపపేయత్వ మూని
పాంథుండు ముందఱ పదమిడ లేక
అధ్వమధ్యమునందె ఆసీనుడయ్యె.

నాగుఁబాము

★ విద్వాన్. శ్రీ బిట్రా భావనారాయణ, ఎం. ఏ., బి. ఓ. యల్. ★

నాగము నాగమంచు తవ నామ విశేషము విన్నగాని, నీ
యాగమనమ్ము గాంచియొ, ప్రజాళికి మాటయె నోటరాదు, నీ
భోగముఁ గాంచి భీతిలుచు, భోగివి, స్థాణుని ప్రాపుమై మహా
యోగము నందినావు, శ్రవణోత్సవమాయెనొ కస్సు బుస్సులన్

వగగొని నీవు నాలుక లవారణఁ జాచుచు, నూగులాడుచున్,
సగము శరీరమాత్మభవు సారశరాసన మట్లు వంచియున్,
తెగఁబడు దీన ప్రాణములఁ దీయుటకైనను, నీదు ప్రాణముల్
మగఁటిమి మీఱ సర్పణము మానుగఁ జేయుటకైన, నాగమా!

ఉదరము నింపికోఁదగిన యోగిరమెందు లభింపకున్నచో
సదమల వాయుభక్షణము జాలఁగఁ జేసియు విందుకైవడిన్,
ముదమున సంచరింతువఁట పూనికమై నిరతమ్ము వ్యాళమా,
హృదయములేని నీ కొఱకు నే గతి మారుతమాత్మ నిచ్చునో!

మఱవంజాలక నీదు రూపమును ప్రామాణ్యమ్ముగా భామినుల్
పరమానందము నందగోరి యిల, నీ భాసిల్లు రూపమ్ముతో
వరభూషావళి రత్నకాంతులిడ, సౌభాగ్యమ్ము శ్రేయమ్ముగా
ధరపై దాల్తురు శీర్షమందుఁ దమ సౌందర్యమ్ము శోభిల్లగన్.

విషధరుఁడైన యీశ్వరుని వీనులచెంత వసించునీవు, నా
విషయము గొంత తెల్పి నిను వేడుదు నా పరమేశు తోడనో
విషధరరాజమా! హృదయవేదనఁ బొక్కుచు నార్తిమై మహా
విషధి మునింగియుంటి, నతిభీతుఁడ, మ్రొక్కెద నీకు నెంతయున్

సమయము జూచి పల్కుమ శశాంకవిభూషణుచెంతఁ జేరి, నా
సముచిత వాంఛలన్ దెలిపి శాంతి యొనర్పగ చిత్తమున్, భుజం
గమ! పరమేశుఁ డాయతివ గౌరినిఁ గాంచి ప్రసన్ననేత్రుఁడై
తమకముమీఱ లాలనము తద్దయుఁ జేసెడి వేడ్కనుండగన్.

ఇంతగఁ జెప్పుచుంటి, మదినెంతయు నాసమెయిన్ భుజంగమా!
వంతను గూలియున్న ననువైళమ బ్రోతువటంచు నెంచియున్
స్వాంతము పారవశ్యమున సాగిలి నీ కిటు భక్తితోడ న
త్యంతము నంజలించి భవదాశ్రయమే యిలఁగోరియుండుటన్.

పన్నగరాజమా! వినుము భవ్యమనస్కృత నాదు ప్రార్థనన్,
మున్నుగ నీశుతోడ పరిపూర్ణ కటాక్షము గోరినట్లు నా
విన్నపముంచి, యీ జనుని వేదనలేవిధి అంతమందునో
తిన్నగ నాలకించి, యిటు దెల్పఁగఁ గోరుదు నేర్పుకై వడిన్.

నీ సామర్థ్యము వర్ణనీయముగదా నిక్కమ్ము దర్వీకరా!
వీసమ్మైనను దోఁకచూపవు సుమీ వీడంగఁ బ్రాణమ్ములున్
వే సాధింతువు పూనినట్టి పగయున్ వేధించి నీ శాత్రవున్,
ఆసింతున్ మదినెంచి నీదుమహిమన్ స్వార్థమ్ముకై యెంతయున్.

★

ఆంధ్రతర్క సంగ్రహము

శ్రీ తుప్పా బైరాగిశాస్త్రి

౨౪

మూ॥ కారణం త్రివిధం సమవాయి అసమవాయి నిమిత్తభేదాత్-

సమవాయి అసమవాయి నిమిత్తముల అన్యోన్యాభావప్రయోజ్యమైనవిభాజకధర్మత్రయములో ఏదియో ఒక ధర్మము కలది కారణము—

మూ॥ యత్సమవేతం కార్యముత్పద్యతే తత్సమవాయికారణం-యథాతన్తవః పటస్య పటస్య స్వగతరూపాదేః -

కార్యము సంభవించవలయునన కార్యము కారణముగూడా ఒకచోట ఉండవలయును. ఏనాడో ఉన్న విత్తులవల్ల యిప్పుడు ధాన్యము పండవలయునన పీలగునా ? వస్త్రమును గురించి నూలుకారణము, కార్యమైన వస్త్రము కారణమైన నూలు ఒకచోట ఉన్నగాని కార్యము కలుగదు కార్యకారణములు ఒకచోట ఉండుటయే సామానాధి కరణ్య మనబడును, సమానమైన అధికరణము కలిగియుండుటయే సామానాధికరణ్యము - కార్యము కారణము అయిన వస్త్రము, నూలు కారణమైన నూలునందే ఉన్నవి. అందులో కార్యమైన వస్త్రము కారణమైన నూలుయందు సమవాయ సంబంధముచే ఉండును. కారణమైన నూలు, నూలునందు తాదాత్మ్య సంబంధముచే యుండును అవయవములయందు అవయవిసమవాయసంబంధముచే యుండును, నూలు అవయవము వస్త్రము అవయవి, నూలు కారణము గాన నూలునందలి కారణత తాదాత్మ్యసంబంధావచ్ఛిన్నమైనది. ఒకచోట ఉన్న రెండు ధర్మములకు అవచ్ఛేద్యావచ్ఛేదక భావము కలదు నూలునందు నూలు తాదాత్మ్యసంబంధముచే యుండును కారణత, తాదాత్మ్య సంబంధము ఒకచోట ఉండుటచేత తాదాత్మ్య సంబంధావచ్ఛిన్నము కారణత అయినది. వస్త్రము (కార్యము)నందకార్యత, సమవాయ సంబంధావచ్ఛిన్న మైనది. సమవాయ సంబంధావచ్ఛిన్నమైన వస్త్రమందలి కార్యతచే నిరూపితమైన నూలుయందలి తాదాత్మ్య సంబంధావచ్ఛిన్నకారణత నూలునందుగలదు. గాన సమవాయ సంబంధావచ్ఛిన్న కార్యతా నిరూపిత తాదాత్మ్య సంబంధావచ్ఛిన్న కారణతాశ్రయత్వమను సమవాయి కారణ సామాన్య• లక్షణము నూలునందు సమన్వయమైనది. ఇటులనే వస్త్రమును గురించి సమవాయి కారణమైన నూలునందు లక్షణ సమన్వయముచేసి వస్త్రమునందలి రూపమును గురించి సమవాయకారణమైన వస్త్రమునందుగూడా సమన్వయము చేయవలయునని మూలములో "పటశ్చస్వగతరూపాదేః" అని చెప్పినారు, పటరూప, పటములకు పట (వస్త్రము) ముద్వారా సామానాధికరణ్యము చెప్పబడుచున్నది వస్త్రరూపము వస్త్రమందు గుణ, గుణి, లకు సమవాయ బంధము గాన గుణమైన రూపము గుణిఅయిన వస్త్రమందు సమవాయ సంబంధముచేత ఉన్నది. వస్త్రమందు వస్త్రము తాదాత్మ్య సంబంధముచేత యున్నది, గాన సమవాయ సంబంధావచ్ఛిన్నమైన పటరూప మందలి కార్యతచే నిరూపితమైన తాదాత్మ్య సంబంధావచ్ఛిన్నమైన పట(వస్త్ర) మందలి కారణతాశ్రయత్వము పటమందు ఉండుటచేత పటరూపమును గురించి సమవాయి కారణమైన పటమందు సమన్వయమైనది.

మూ॥ కార్యేణ కారణేనవా సహైకస్మిన్నర్థే సమవేతంసత్ కారణ మసమవాయికారణం యథా తంతు సంయోగః పటస్య, తంతురూపం పటగతరూపస్యచ

అసమవాయి కారణ లక్షణమును చెప్పుచున్నాడు, అసమవాయి కారణము రెండు రకములుగాన కార్యేణసహ ఏకస్మిన్నర్ధే సమవేతం సత్ కారణ మసమవాయికారణం, అని ఒకటిన్నీ, కారణేన సహ ఏకస్మిన్నర్థే సమవేతంసత్

కారణ మసమవాయి కారణం అనిన్నీ విడదీసి చెప్పుకొనవలయును.

వస్త్రమును గురించి రెండు దారముల సంయోగము మొదట అసమవాయికారణము. కార్యమైన వస్త్రము కారణమైన (నూలు) తంతు సంయోగము నూలునందు సమవాయ సంబంధముచే యున్నవి నూలునందు వస్త్రము అవయవావయవినో స్సమవాయః అను న్యాయముచేతను, నూలు సంయోగము నూలునందు గుణగుణినో స్సమవాయః అను న్యాయము చేతను, సమవాయ సంబంధముచేతను ఉండుట చేత సమవాయ సంబధావచ్ఛిన్నమైన వస్త్రము నందలి కార్యతచే నిరూపితమైన సమవాయ సంబంధావచ్ఛిన్న కారణత నూలు సంయోగ మందు ఉండుటచేత సమవాయ సంబంధావచ్ఛిన్న కార్యతా నిరూపిత సమవాయ సంబంధావచ్ఛిన్న కారణతాశ్రయత్వరూప ప్రధమ అసమవాయి కారణ లక్షణము వస్త్రమును గురించి కారణమైన తంతుద్వయ సంయోగ మందు ఉంటచే సమన్వయమైనది

పటరూపమును గురించి నూలునందలి రూపము ద్వితీయ అసమవాయి కారణము. ఏరంగు నూలుతో ఆరంగు వస్త్రము తయారు అగుచుండును మూలములో కారణేన అనుదానికి స్వకార్య సమవాయి కారణేన అని అర్థము చెప్పవలయును స్వ అనగా కారణమును గ్రహించవలయును స్వ అనుదానికి తంతు (నూలు) రూపము అర్థము స్వకార్యము వస్త్ర రూపము తంతురూపము వలననే వస్త్రరూపము ఏర్పడుచుండును. స్వకార్యమునకు సమవాయి కారణము పటము."పటశ్చ స్వగత రూపాదేః" అని సమవాయి కారణమునకు లక్ష్యముగా లోగా చూపబడినది, దానిలోగూడా ఒకదానియందు అనగా తంతువు (నూలు) నందు సమవాయ సంబంధముచే ఉన్నదిగాన తంతు రూపము పటరూపమును గురించి ద్వితీయ అసమవాయి కారణమైనది, తంతురూపము తంతువుయందు గుణగుణిలకు సమవాయసంబంధముగాన సమవాయ సంబంధము చేత ఉన్నది. అటులనే పటముగూడా తంతువు యందు సమవాయి సంబంధముచేత అవయవ అవయవినోస్సమవాయః అను న్యాయముచే ఉన్నది. యిప్పుడు కార్యకారణములకు తంతువులు (నూలు) ద్వారా సామానాధికరణ్యము అనగా ఒకదానియందు ఉండుట చూపబడినది. కార్యము ఏ సంబంధముచేత ఉండునో అది కార్యతావచ్ఛేదక సంబంధము. ఆ సంబంధావచ్ఛిన్నము కార్యత అగును. కారణము ఏ సంబంధముచేత యుండునో అది కారణతావచ్ఛేదక సంబంధము, ఆ సంబంధా వచ్ఛిన్నము కారణత అగును కార్యమైన పటరూపము తంతువులయందు స్వాశ్రయ సమవాయిత్వ సంబంధముచేత ఉన్నది. స్వ అనగా పటరూపము (ఏది ఉండునని చెప్పుచున్నామో అది స్వపదార్థము) దానికి ఆశ్రయము పటము. దానికి సమవాయి అనగా సమవాయ కారణము తంతువు స్వపదార్థమైన పటరూపము స్వాశ్రయ సమవాయిత్వ సంబంధముచేత తంతువుల యందు ఉండుటచే ఆ పటరూపము కార్యము గాన స్వాశ్రయ సమవాయిత్వ సంబంధము కార్యతావచ్ఛేదక సంబంధము, స్వాశ్రయ సమవాయిత్వ సంబంధావచ్ఛిన్నము కార్యతఅగును. కారణమైన తంతురూపము తంతువులయందు సమవాయ సంబంధముచేత ఉండుటచే సమవాయ సంబంధా వచ్ఛిన్నము కార్యత, కార్యతావచ్ఛేదకము సమవాయ సంబంధము. ద్వితీయా సమవాయికారణ సామాన్య లక్షణము స్వాశ్రయ సమవాయిత్వ సంబంధావచ్ఛిన్న కార్యతా నిరూపితసమవాయ సంబంధావచ్ఛిన్న కారణతాశ్రయత్వం కార్యమైన పటరూపము స్వాశ్రయ సమవాయిత్వ సంబంధముచేత తంతువుయందు ఉండుటచేత స్వాశ్రయ సమవాయిత్వ సంబంధావచ్ఛిన్న పటరూపత్వా వచ్ఛిన్న కార్యతా నిరూపితమైనసమవాయి సంబంధావచ్ఛిన్న తంతు రూపత్వావచ్ఛిన్న కారణత్వం తంతురూప మందు ఉండుటచేత లక్షణ సమన్వయమైనది. చిత్రపట రూపమును గురించి కారణమైన నానారంగులుగల నూలునందు పై విధముగా

ద్వితీయ అసమవాయి కారణ లక్షణము చెప్పిన కారణ లక్షణములో కార్యవ్యాపకత్వము కారణ మందు రావలయును గనుక కార్యవ్యాప కత్వమనగా కార్యముయొక్క అధికరణమందు ఉన్న అభావమునకు ప్రతియోగి కాకపోవుట. కార్యముయొక్క అధికరణము అనగా కార్యతా వచ్ఛేదక సంబంధముచేత కార్యముయొక్క అధికరణమే తీసుకొనవలసి యుండుటచే ప్రస్తు తములో కార్యతావచ్ఛేదక సంబంధమైన స్వా శ్రయ సమవాయిత్వ సంబంధముచేత కార్య మైన చిత్రపట రూపమునకు అధికరణము నీల తంతువు పీతతంతువు ప్రత్యేకముగా అగు చుండును. స్వ అనగా చిత్రపటరూపము, దానికి ఆశ్రయము చిత్రపటము, దానికి సమవాయి కార ణము అన్నిరకములతంతువులు అగుచుండును. కార్యమునకు అధికరణ పూర్వము చెప్పినట్లుగా నల్లదారము (తంతువు) దానియందు తెలుపు రూపము లేదుగనుక తెలుపు రూపముయొక్క అభావము ఉన్నది దానికి ప్రతియోగి తెలుపు రూపమైనది అటులనే కార్యాధికరణము తెలుపు నూలుఅయిన అచ్చట ఎఱుపురంగు లేదుగాన ఎఱుపురంగు గూడా అభావనకు ప్రతియోగియే అయినది. యిటులనే అన్నిరూపములు కార్యాధి కరణమందు ఉన్న అభావమునకు ప్రతియోగులే గాన అప్రతియోగి ఏ రూపముగాదు గాన కార్య వ్యాపకత్వ రూపలక్షణము కారణమందులేకపో వుట కారణ లక్షణమునకు అవ్యాప్తి రావచ్చును. ఆ అవ్యాప్తి వారణకొరకు లక్షణమును యీ క్రిందివిధముగా మార్పు చేయవల యును. సమవాయ సంబంధావచ్ఛిన్న కార్యతా నిరూపిత స్వసమవాయ సమ వేతత్వ సంబంధావచ్ఛిన్న కారణతా శ్రయ త్వమని ఇప్పుడు కార్యకారణములకు పటాన్త ర్భావేణ సామానాధి కరణ్యము చెప్పవల యును. కార్యమైన పటరూపము పటమందు సమవాయ సంబంధముచేత ఉన్నది కారణ మైన తంతురూపము పటమందు స్వసమవాయ సమవేతత్వసంబంధముచేత యున్నది. స్వ అనగా తంతురూపము దానికి సమవాయి అనగా సమవాయ కారణం. తంతువులు తత్సమవేత మనగా సమవాయ సంబంధముచేత ఉండుట అని అర్థము. తంతువులయందు సమవాయ సంబంధముచేత ఉన్నది పటముగాన స్వసమ వాయ సమవేతత్వము పటమందు ఉండుటచే స్వసమవాయ సమవేతత్వ సంబంధముచేతస్వప దార్థమైన తంతురూపము పటమందు ఉన్నది. గాన కారణతా వచ్ఛేదక సంబంధము స్వసమ వాయి సమవేతత్వ సంబంధము. సమవాయ సంబంధావచ్ఛిన్న పటరూపత్వా వచ్ఛిన్న కార్యతా నిరూపిత స్వసమవాయి సమవేతత్వ సంబంధావచ్ఛిన్న తంతురూపత్వా వచ్ఛిన్న కారణతాశ్రయత్వం ద్వితీయ సమవాయికారణ త్వమని నిష్కర్ష చేసుకొనవలయుచు.

మూ॥ తదుభయ భిన్నంకారణం నిమిత్త కారణం యథాతురీవే మాదికం పటస్య.

సమవాయి కారణముకంటె వేరయినది అసమవాయి కారణముకంటె వేరయినది కార ణమైనది నిమిత్త కారణమని అర్థము. సమ వాయి కారణభిన్నమై అసమవాయి కారణ భిన్నమై కారణ మగుట నిమిత్త కారణము నకు లక్షణము, సమవాయి కారణ భిన్నమై అను విశేషణము లేకపోయినచో సమవాయి కారణమందుననూ అసమవాయి కారణభిన్నమై అను విశేషణము లేకపోయినచో అసమవాయి కారణమందుననూ కారణ మగుట అను విశే ష్యము లేకపోయినచో పారిమాండల్యమందు ననూ అతివ్యాప్తి వచ్చునుగాన ఆయా దోష ములు నివారించుటకు మూడు విశేషణములు అవసరము. పారిమాండల్యమనగా పరమా ణువునందు ఉన్న పరిమాణము. పరమాణు పరిమాణము అణుపరిమాణము, దీనివల్ల ద్వ్యణుకాదులకు పరిమాణము కలుగునని చెప్పిన త్ర్యణుకాదులు ప్రత్యక్షము కాకపోవ లసి వచ్చును, పరిమాణము తనకంటెఉత్కృష్ట మైన పరిమాణమును కలుగజేయుట స్వభావము గాన అణుపరిమాణముకంటె సజాతీయమైన గొప్పపరిమాణము అణుతర పరిమాణము. దరిద్రులలో గొప్పవాడు అతిదరిద్రుడు అని

నట్లుగా అణుపరిమాణమే కనపడనప్పుడు అణుతరపరిమాణములసలే ప్రత్యక్షముగాదు. అందుచేత పరమాణు పరిమాణము దేనినిగురించి కారణముగాదు.

మూ॥ తదేతత్ త్రివిధకారణ మధ్యే యద సాధారణ కారణం తదేవ కరణం

వ్యాపారవత్తు అయి అనుపదము గూడా చేర్చుకొనవలయును. లేనిచో కపాలసంగయోగరూప వ్యాపారమందు అసాధారణ కారణత్వ మున్నందున అతివ్యాప్తి వచ్చును. కరణమునకు, కారణమునకు వ్యాపార వత్వము ఉండుట, లేకపోవుటయే భేదము, అసాధారణ కారణత్వము రెంటియందునునుసమానమే.

ఇంతవరకు అనుభవమును విభాగముచేసి దానికి కరణమును చెప్పి.కరణమనగా ఏమియో చెప్పుచూ ప్రశస్తముగా వచ్చిన విషయములను దెలిపి మొదట అనుభవ విభాగములో మొదటిదయిన ప్రత్యక్షమునకు కరణమైన ప్రత్యక్షమును నిరూపణ చేయుచున్నారు,

మూ॥ ప్రత్యక్షజ్ఞాన కరణం ప్రత్యక్షం

కన్ను, ముక్కు, చెవి, నాలుక, త్వక్కు, మనస్సు అను ఆరువిధములయిన ఇంద్రియములు, ప్రత్యక్ష జ్ఞానకరణము లయిన ప్రత్యక్షములు, వాట్ల లక్షణమును చెప్పుచున్నారు.

వ్యాపారజనకమై ప్రత్యక్షజ్ఞాన అసాధారణ కారణ మయినది ప్రత్యక్షము వ్యాపారము అనగా దానివలన పుట్టుటయు దానివలన పుట్టిన దానికి కారణమగుటయు ఇంద్రియ విషయముల సంయోగము వ్యాపారము చక్షు (కన్ను) రింద్రియము మొదట ఘటము (వస్తువు) తో సంబంధించిన తరువాత ఇది ఘటము అను ప్రత్యక్షము కలుగును ఇది ఘటము అను ప్రత్యక్షము కన్నువలననే కలుగుచున్నది. కన్నుకు ఘటమునకు గల (ఇంద్రియ అర్థ) సంయోగముగూడా కలుగుచున్నది. ఇంద్రియార్థ సంగము, కన్నువలన పుట్టి కన్నువలన పుట్టిన ఇది ఘటము అను ప్రత్యక్షమునకు జనకము (కారణము) అగుచున్నదిగాన వ్యాపారమగుట అనునది ఇంద్రియార్థ సంయోగమందు గలదు. దానికి కారణము చక్షరింద్రియము (కన్ను). ఇది ఘటము అను ప్రత్యక్ష జ్ఞానమందలి కార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయమగుటయు చక్షురింద్రియమందు గలదు. గాన ప్రత్యక్ష జ్ఞానమందలి కార్యతచే నిరూపితమైన కారణత కలిగి, ఇంద్రియార్థ సన్నికర్షరూప వ్యాపార జనకమగుట చక్షురింద్రియమందు గలదుగాన ప్రత్యక్ష జ్ఞానకరణమైన కంటియందు సమన్వయమయినది. వ్యాపార జనకత్వమను ధర్మము లేనిచో ప్రత్యక్ష జ్ఞానజనకత్వము ఇంద్రియార్థ సన్నికర్ష రూపవ్యాపారమందుగూడా కలదుగాన వ్యాపారమందు అతివ్యాప్తి. వ్యాపారమందు వ్యాపారజనకత్వము లేదుగానఅతివ్యాప్తి వారించును.వ్యాపార జనకత్వమే లక్షణముగా చెప్పిన కాలము, ఈశ్వరుడు. అదృష్టము కార్యసామాన్యమును గురించి కారణముగాన కాలాదులయందు అతివ్యాప్తి. ఆ అతివ్యాప్తి వారణ కొరకు ప్రత్యక్షజ్ఞాన కారణత్వముఉంచవలెను.

మూ॥ఇంద్రియార్థసన్నికర్షజన్యం జ్ఞానంప్రత్యక్షం

ఇచ్చట రెండు ప్రత్యక్ష పదములు కలవు. ఒకటి కరణమైన ప్రత్యక్షము. ఒకటి అనుభమైన ప్రత్యక్షము. ఇదివరలో కరణమైన ప్రత్యక్షమునకు లక్షణముచెప్పి, అనుభవమైన ప్రత్యక్షమునకు లక్షణము చెప్పుచున్నారు. ఆత్మ మనస్సుతో సంబంధించి మనస్సు ఇంద్రియముతో సంబంధించి ఆ ఇంద్రియము వస్తువుతో సంబంధించిన తరువాత ఇది వస్తువు అను ప్రత్యక్షము కలుగుట అనుభవ సిద్ధముగాన ఇంద్రియము వస్తువుతో సంబంధించుటయే ఇంద్రియార్థ సన్నికర్ష, దానివలన ప్రత్యక్షము కలుగుచుండుటచే ఇంద్రియార్థ సన్నికర్ష వల్ల పుట్టినదై జ్ఞానమగుట ప్రత్యక్షమునకు లక్షణమని తేలుచున్నది, ఇంద్రియార్థ సన్నికర్షవలన పుట్టుటయే ప్రత్యక్షమునకు లక్షణమని చెప్పిన సన్నికర్ష ధ్వంసగూడా సన్నికర్షవలననే పుట్టును. ధ్వంసను గురించి ప్రతియోగులు కారణమును న్యాయముచే, అచ్చట అతి

వ్యాప్తి వచ్చును. దానిని వారించుట జ్ఞానమ గుటయను విశేష్యము అవసరము కేవల జ్ఞానమగుటయే లక్షణముగా చెప్పిన అనుమిత్యాదులయందు అతివ్యాప్తి వచ్చును అందుకొరకు ఉభయ దళములు అవసరము.

మూ॥ తద్ద్వివిధం నిర్వికల్పకం సవికల్పకంచేతి తత్ర నిష్ప్రకారకం జ్ఞానం నిర్వికల్పకం కించిదిదం ఇతివస్తు మాత్రావగాహి జ్ఞానం సప్రకారకం జ్ఞానం సవికల్పకం, యథాడిత్థోయం, బ్రాహ్మణోయం, శ్యామోయం. పాచకోయమితి

ఆ ప్రత్యక్షము నిర్వికల్పకమని సవికల్పకమని రెండువిధములు ప్రకారతచే నిరూపకము కానిదై జ్ఞానమగుట నిర్వికల్పకమునకు లక్షణము. ఇంద్రియార్థ సన్నికర్ష వలన కేవల వస్తువిషయికమైన ప్రకారత, విశేష్యత, సంసర్గతలేని జ్ఞానము కలుగును. దానియందు ప్రకారతచే నిరూపకము కాకపోవుట జ్ఞానమగుట ఉన్నందున సమన్వయమైనది కేవల జ్ఞానమగుటయే లక్షణముగా చెప్పిన సవికల్పక జ్ఞానమందుననూ ప్రకారతచే నిరూపకము కాకపోవుట అనిచెప్పిన ఘటాదుల యందునను అతివ్యాప్తి వచ్చును అందుకొరకు ఉభయ దళములు లక్షణములో అవసరము నిర్వికల్పక జ్ఞానములో విశేషణము భాసించిన యెడల విశిష్టబుద్ధి అయి విశేషణ జ్ఞానము ముందుగా కావలసి వచ్చును. ఆకారణమైన జ్ఞానమందుననూ విశేషణము భాసించిన మరల జ్ఞానము కావలసి వచ్చును యిటుల అనవస్థ వచ్చును. గాన మొదటకలుగు జ్ఞానము నిర్వికల్పకము అని చెప్పవలయును దానిలో విశేషణము భాసించనందున జ్ఞానాంతరాపేక్ష లేదు అందువలన అనవస్థా రూపదోషము రాదు. ప్రకారతచే నిరూపకమై జ్ఞానమగుట సవికల్పక జ్ఞానమునకు లక్షణము. జ్ఞానమగుటయే లక్షణముగా చెప్పిన నిర్వికల్పక జ్ఞానమందు ప్రకారతచే నిరూపక మగుటయే లక్షణముగా చెప్పిన ఇచ్ఛయందు అతివ్యాప్తి వచ్చును. తన్నివారణ కొరకు రెండు దళములు ఆవశ్యకములు (డిత్థోయం) వీడు డిత్థుడు అను జ్ఞానము డిత్థత్వము ప్రకారముగా గలది వీడు అను పదార్థము విశేష్యముగా గలది. అటులనే (బ్రాహ్మణోయం) వీడు బ్రాహ్మణుడు, అనుచోట బ్రాహ్మణత్వ రూప జాతి ప్రకారము (శ్యామోయం) వీడు నల్లనివాడు అనుచోట నల్లగుణము ప్రకారము, (పాచకోయం) వీడు వంటవాడు అనుచోట వంటరూపక్రియ ప్రకారము. ఈ ప్రకారము శబ్దములు నామజాతిగుణక్రియావాచకములని తెలియపరచుటకు నాలుగు ఉదాహరణలు యివ్వబడినవి.

మూ॥ ప్రత్యక్షజ్ఞాన హేతుః ఇంద్రియార్థ సన్నికర్షః షడ్విధః, సంయోగః, సంయుక్త సమవాయః సంయుక్త సమవేత సమవాయః సమవాయః సమవేత సమవాయః విశేషణ విశేష్యభావశ్చేతి.

ప్రత్యక్ష జ్ఞానహేతువైన ఇంద్రియార్థసన్నికర్ష సంయోగము, సంయుక్త సమవేత సమవాయము, సమవాయము, సమవేత సమవాయము. విశేషణ విశేష్య భావము (విశేషణత) అని ఆరువిధములు. ఇచ్చట ప్రతిదానికి పూర్వమందు ఇంద్రియ పదము జేర్చవలయును ఇంద్రియ సంయోగము, ఇంద్రియ సంయుక్త సమవాయము, ఇంద్రియ సంయుక్త సమవేత సమవాయము ఇంద్రియ సమవాయము ఇంద్రియ సమవేత సమవాయము, విశేషణతకు పై అయిదు విధములు కలిపి ఇంద్రియ సంయుక్త విశేషణత, ఇంద్రియ సంయుక్త సమవేత విశేషణత, ఇంద్రియ సంయుక్త సమవేత సమవేత విశేషణత, ఇంద్రియ సమవేత విశేషణత, ఇంద్రియ సమవేత సమవేత విశేషణత, అనిచెప్పుకొనవలయును,

మూ॥ చక్షుషా ఘటప్రత్యక్ష జననే సంయోగస్సన్నికర్షః.

తా కంటితోచూచి ఇది కుండఅని ప్రత్యక్షము కలుగుటకు, కంటికి కుండకు సంయోగము సంబంధముగాన కంటి సంయోగము సన్నికర్ష.

మూ॥ ఘటరూప ప్రత్యక్షే సంయుక్త సమవాయ స్సన్నికర్షః చక్షుస్సంయుక్తేఘటె రూపస్య సమవాయాత్.

తా. కుండయొక్క రూప ప్రత్యక్షములో ఇంద్రియ సంయుక్త సమవాయము సన్నికర్ష. కన్నుకు కుండకు సంయోగము సన్నికర్ష అప్పుడు చక్షుస్సంయుక్తము కుండ అగును ఆ కుండయందు రూపము (రంగు) సమవాయ సంబంధముచేత ఉండునుగాన సంయుక్త సమవాయము సన్నికర్షగా చెప్పబడినది.

మూ॥ రూపత్వ సామాన్య ప్రత్యక్షే సంయుక్త సమవేత సమవాయ స్సన్నికర్షః, చక్షుస్సంయుక్తె ఘటెరూపం సమవేతం తత్రరూపత్వస్య సమవాయాత్

తా. రూపత్వము రూపమందలి జాతి యే గుణము యే ఇంద్రియముచేత గ్రహించబడునో దానియందలి జాతిగూడా ఆ ఇంద్రియముచేతనే గ్రహింపబడును, గాన రూపమందలి రూపత్వ జాతిగూడా కంటిచేతనే తెలియబడును గాన అ ప్రత్యక్షములో ఇంద్రియ సంయుక్త సమవేత సమవాయము సన్నికర్ష, ఇంద్రియ సంయుక్తము కుండ దానియందు సమవేతము (సమవాయ సంబంధముచే ఉన్నది) రూపము, దానికి రూపత్వమునకు సమవాయము సంబంధముగాన ఇంద్రియ సంయుక్త సమవేత సమవాయముచే రూపత్వ సామాన్యము (జాతి) గ్రహించబడును

మూ॥ శ్రోత్రేణ శబ్దసాక్షాత్కారే సమవాయ స్సన్నికర్షః కర్ణవివర వృత్తి ఆకాశస్య శ్రోత్రత్వాత్ శబ్దస్య ఆకాశ గుణత్వాత్ గుణగుణినోస్సమవాయాత్.

చెవివలన ధ్వని ప్రత్యక్షము కలిగినప్పుడు సమవాయము సన్నికర్ష, చెవిరంధ్రమందలి ఆకాశము శ్రోత్రేంద్రియము శబ్దము ఆకాశ గుణము ఆకాశము గుణి, గుణగుణిలకు సమవాయము సంబంధముగాన ఇంద్రియ సమవాయము సన్నికర్షగా చెప్పబడినది

మూ॥ శబ్దత్వ సాక్షాత్కారే సమవేత సమవాయ స్సన్నికర్షః శ్రోత్రసమవేతే శబ్దే శబ్దత్వస్య సమవాయాత్

శబ్దత్వ జాతి ప్రత్యక్షము గూడా శ్రోత్రేంద్రియము (చెవి) చేతనే కలుగును. శ్రోత్రసమవేత మనగా శ్రోత్రమందు సమవాయి సంబంధముచే ఉండుట అటుల ఉన్నది శబ్దము దానికి శబ్దత్వమునకు సమవాయము సంబంధము జాతివ్యక్తులకు సమవాయము సంబంధము అను న్యాయముచే శబ్దత్వజాతి ప్రత్యక్షములో ఇంద్రియసమవేత సమవాయము సన్నికర్ష.

మూ॥ అభావ ప్రత్యక్షే విశేషణ విశేష్య భావ స్సన్నికర్షః భూతలం ఘటాభావవత్ ఇత్యత్ర చక్షుస్సంయుక్తె భూతలే ఘటాభావస్య విశేషణాత్

భూమియందు కుండలేదు అనునది కుండ యొక్క అభావ ప్రత్యక్షము యీ ప్రత్యక్షములో చక్షుస్సంయుక్తవిశేషణత సన్నికర్ష చక్షు (కన్ను) స్సంయుక్తము భూమి దానియందు ఘటాభావము విశేషణము.

మూ॥ ఏవం సన్నికర్ష షట్కజన్యం జ్ఞానం ప్రత్యక్షం, తత్కరణ మింద్రియం, తస్మాదింద్రియం ప్రత్యక్ష ప్రమాణ మితిసిద్ధం

ఈవిధముగా ఆరువిధములైన సన్నికర్షల వల్ల కలుగు జ్ఞానము ప్రత్యక్షము. ఆ ప్రత్యక్షమునకు ఇంద్రియము కరణము. అందుచే ఇంద్రియము ప్రత్యక్ష ప్రమాణమని సిద్ధము

ఆంధ్ర తర్కసంగ్రహమందలి ప్రత్యక్ష పరిచ్ఛేదము

సమాప్తము

మృత్యుముఖంలో తుదిరోజు

విక్టర్ హ్యూగో

అనువాదం : శ్రీ రెంటాల గోపాలకృష్ణ

23

న్యాయస్థానం ఆవరణంలోనుంచి నడిచి వెడుతున్నాను నేను యథేచ్ఛగా వెడుతున్నాను కాని అంతలోనే కొన్ని రహస్య ద్వారాలు తెరుచుకొన్నాయి మెట్ల వరుసలతోనున్నూ, పొడుగ్గా చీకటి కోనల్లా ఉన్న నడవలతోనూ కొన్ని భూగృహాలు కనుపించాయి నా శరీరంలో రక్తం గడ్డకట్టుకపోయినట్లనిపించింది శిక్ష పడినవాళ్ళు, శిక్ష పడనున్నవాళ్ళు మాత్రమే రహస్య ద్వారాలగుండా ఆ భూగృహాలలోకి కొనిపోబడతారు

కోర్టుఉద్యోగి ఇప్పటికీ నావెంటఉన్నాడు మతగురువు మాత్రం మళ్ళీ రెండు గంటలసేపట్లో వస్తానని చెప్పి తన పనిమీద వెళ్ళిపోయాడు

గవర్నరుగారి ప్రత్యేక ఆఫీసు గదిలోకి నన్ను తీసుకెళ్ళారు కోర్టు ఉద్యోగి అక్కడ గవర్నరుగారికి నన్ను అప్పగింత పెట్టాడు కాని గవర్నరుగారు కోర్టు ఉద్యోగిని ఒక క్షణం ఆగమని చెప్పి, తాను మరొక ఖైదీని అతని స్వాధీనం చెయ్యవలసి ఉన్నదని తెలియచేశాడు అతని తిరుగు ప్రయాణంలో ఆ ఖైదీని తక్షణం 'బిసెట్రీ' జైలుకు చేర్చవలసి ఉన్నదట! అవును ఇవాళ మరొక అభాగ్యుడికి శిక్ష పడింది సందేహంలేదు అతను నాస్థానం ఆక్రమించుకుంటాడు ఇంతవరకూ నేనున్న జైలుగదిలోనే అతన్ని ఉంచుతారు ఆహా! ఎంత అదృష్టం పట్టింది ఆ గదికి! ఒక్కరోజు ఖాళీగా ఉండదుకదా!

"అలాగేనండీ." అని కోర్టు ఉద్యోగి, గవర్నరుతో సవినయంగా సమాధానం చెప్పాడు "నేను కొంచెంసేపు వేచిఉంటానులెండి అప్పుడే మనం వ్రాయవలసిన రిపోర్టు కూడా తయారుచేసి పంపిద్దాం" అన్నాడు

తరువాత గవర్నరుగారిఆఫీసుకు ప్రక్కనే ఉన్న ఒక చిన్నగదిలో నన్ను ఉంచి బయట తాళంపెట్టారు అలా అక్కడ ఎంతసేపున్నానో, ఏమేమి ఆలోచిస్తున్నానో, నాకే తెలియదు, హఠాత్తుగా పకపక నవ్వులు నా చెవిన పడ్డాయి నేను మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాను

భయకంపితుడనై చుట్టూ కలయచూచాను ఇప్పుడు నేను గదిలో ఒంటిగాలేను ఒక యాభై సంవత్సరాల వృద్ధుడు నా గదిలో ఉన్నాడు అంత పొడుగూకాదు అంత పొట్టీ కాదు ముఖం ముడతలుపడి ఉన్నది తల నెరిసింది నడుం విల్లంబద్దలా వంగిపోయింది గుడ్డలు చిరిగి పీలికలై ఉన్నాయి మెల్లకండ్లు అతన్ని చూస్తుంటే డోకు వస్తున్నది, గది తలుపు ఎప్పుడు తీశారో,అతను ఎప్పుడు లోనికి ప్రవేశించాడో నాకు తెలీదు కాని, మృత్యుదేవత ఆ రూపంలో వచ్చిందేమో అనిపించింది నాకు!

మేమిరువురం - అతను, నేను, ఒకరివంక ఒకరం తేరిపార చూచుకొన్నాం తరువాత అతను బిగ్గరగా, మృత్యుదేవత నవ్వినట్లు పగలబడి నవ్వాడు నేను నిర్ఘాంతపోయాను, భయంతో నిలువునా నీరైపోయాను

"ఎవరయ్యా నీవు?" అని అడిగాను చివరకు

"భలే ప్రశ్న వేశావు! స్వర్గానికి వెడుతున్న మానవుణ్ణి నేను!" అని చెప్పాడతను

"అంటే?"-

మళ్ళీ అతను ఇల్లెగిరిపొయ్యేటట్లు నవ్వాడు "అంతేనా? చెపుతాను విను నిన్ను ఆరు గంటలలో ఉరి తీయబోతున్నారు నన్ను ఆరువారాలలో ఉరి తీయబోతున్నారు అహ్హాహా! అహ్హాహం! ఇప్పుడైనా అర్థమైందా?" అన్నాడతను నవ్వుతూనే

నాశరీరం చన్నీళ్ళు ముద్దయింది ఎక్కడికక్కడ బిగుసుకపోతున్నట్లనిపించింది నా తరువాత ఇప్పుడు బిసెట్రీ, జైలుకు వెళ్ళవలసిన మనిషి అతనే,-ఉరిశిక్ష పడిన మనిషి!

అతను తిరిగి - "నేనెవరో తెలుసుకోవాలని వుందిటయ్యా? అయితే చెపుతాను విను" - అంటూ ఈ విధంగా తన కథ చెప్పసాగాడు,—

"మా నాయన ఒక పుండాకోరు చిన్నప్పుడే ఆయనకు శిక్ష పడింది కాని అదృష్టవశాత్తూ కాపలావాడి సహాయంతో జైలు నుంచి తప్పించుకొన్నాడు ఆనాడే అతను చచ్చిఉంటే నేను పుట్టేవాణ్ణేకాదుగా! సరే. ఏమైతేనేం, ఆరేండ్ల వయస్సులోనే నాకు అమ్మ - నాన్న కరువైపోయారు నేను వేసవికాలంలో ఎర్రని ఎండలో రోడ్డుప్రక్కన కూచుని బండి చక్రాలు చేసేవాణ్ణి బండ్లమీద పోయే జనం నా ముఖాన పెన్నీయో, అరపెన్నీయో విసిరేసేవాళ్లు ఇక శీతాకాలాల్లో వంటిమీద బట్టలేకుండా ఊరంతా తిప్పకాయలా తిరుగుతుండేవాణ్ణి చలికి నా కాళ్ళు-చేతులు కొంకర్లు పోయేవి నావంటిమీద గాయంపడని స్థలమంటూలేదు కావాలంటే చూడు, నా చిరిగిన లాగులో నుంచి కనుపిస్తున్నాయి తొమ్మిదేండ్ల వయస్సు వచ్చేసరికి నా పొట్ట నేను పోసుకోవడం మొదలుపెట్టాను అప్పుడప్పుడు జేబులు కొట్టేవాణ్ణి ఒకమాటు ఒకరికోటు దొంగిలించాను పదేండ్లువచ్చేసరికి నేనుపక్కాదొంగనైపోయ్యాను నాటినుంచి దొంగతనం నా వృత్తి, దుర్మార్గం నా చరిత్ర కొత్త కొత్త వాళ్ళతో చేతులు కలిపాను కన్నాలు వెయ్యడంలో ఆరితేరిన ఘటాన్ని అయ్యాను ఒకమాటు ఒక అంగట్లో దూశాను వస్తువులు దొంగిలించాను కాని క్షణంలో తప్పింది పట్టుబడ్డాను అప్పటివరకూ తప్పించుక తిరిగాను కాని ఇక సాధ్యంకాకపోయింది పోలీసువాళ్లు నన్ను వదల్లేదు జైల్లో పెట్టారు శిక్ష పడింది తదాది పదిహేనేళ్లు కారాగారంలో కఠినశిక్ష అనుభవించాను కటికినేలమీద పడక పచ్చినీళ్ళు, ఉప్పుడుగంజి ఆహారం చేతులకు మోయలేని ఇనుపసంకెళ్లు, ఒక గుదిబండ ఎర్రనిఎండలో నిలువుజీతం ఎండదెబ్బలు తాకి ప్రాణాలు సుడివడ్డాయి అయినా చావలేదు నాకు బుర్ర గొరిగించారు బంగారం లాంటి జుట్టునాది! ఆ విధంగా పదిహేనేండ్లు చివరకు శిక్ష అయిపోయింది!

"ఒకనాటి ఉదయం జైలు అధికార్లు నాకు ఒక పచ్చకాగితం ఇచ్చి జైలునుంచి విడుదల చేశారు అరవైఆరు ఫ్రాంకులు డబ్బుకూడా ఇచ్చారు పదిహేనేండ్లు,ఏడాదికి పన్నెండు నెలలు, నెలకు ముప్ఫయిరోజులు రోజుకు పదహారు గంటలు, ఈలెక్క చొప్పున పదిహేనేండ్లు నేను కష్టపడినందుకు ప్రతిఫలం అది! కాని చిత్రమేమిటంటే, వాళ్లు నా కిచ్చిన పచ్చకాగితం, జీవితాంతం నన్ను వెంటాడి వేధించింది విడుదలయ్యానన్నమాటే కానీ, జైలులో ఉన్నదానికంటె అన్యాయమైపోయింది నాపని! నేను ఎక్కడికెడితే అక్కడల్లా ఆ పచ్చకాగితం చూపించాలి నన్నొక చిన్న ఊళ్లో ఉండమని వాళ్లు నిర్బంధించారు వారవారం ఆ ఊరి అధికారివద్దకు వెళ్ళి నా 'ప్యాస్ పోర్టు' చూపించాలి ఖైదీ, అని నాకు ఖతే యోగ్యతా పత్రం ఇచ్చారు!

"నన్ను అల్లంత దూరాన చూస్తేచాలు, జనం హడలిపోయేవారు, పిల్లలైతే నేను కంట పడడమే తరువాయి అదేపరుగు! నేను వీధిన వెడుతుంటే ప్రతి ఒక్కరూ తలుపులు

బిగించుక కూచునేవారు పని చేస్తానన్నా ఎవ్వరూ నన్ను పనిలో పెట్టుకోలేదు, నా దగ్గరున్న అరవై ఆరు ఫ్రాంకులూ కరగ తిన్నాను తరువాత? తరువాత ఎలా జీవించడం? పొట్టనిండాలికదా? మనిషినేమో దుక్కలా ఉన్నానాయె, - పనిలో పెట్టుకోండయ్యా ఎద్దులా చాకిరీ చేస్తానన్నాను - ఎంత ఇచ్చినా చాలునన్నాను ఆఖరుకు పిడికెడు మెతుకులు పడేసినా ఉంటానన్నాను దాని తస్సాతియ్యా,ఎవరూఒప్పుకోందే - ఊరికకూడా నాచేత పని చేయించుకోనన్నారు! ఇంత అన్యాయం ఎక్కడైనా ఉందటయ్యా! ఏంచేసేది నేను? బ్రతకడ మెలాగ? ఒక రోజున ఆకలితో కడుపు భగ్గున మండిపోయింది ఒక రొట్టెల దుకాణం చెంతకువెళ్ళాను కిటికీలోనుంచి ఒక రొట్టెముక్క అందుకున్నాను అంగడి వాడు నన్ను పట్టుకున్నాడు ఇంకా నేను రొట్టె తిననేలేదు అవుతేనేం? - ఈ నేరానికి మళ్ళీ నన్ను జైలులో పెట్టారు నేను పచ్చి దొంగననీ, కేడీ ననీ, నా బుజంమీద అక్షరాలతో కాల్చి ముద్రలు వేశారు కావాలంటే చొక్కా విప్పి చూపిస్తాను న్యాయమంటే ఇదేనయ్యా! ఎంత భయంకరంగా ఉంటుందో చూడు! - ఇంకేముంది? మళ్ళీ నాకు కారాగారవాస శిక్ష విధించారు,

"నన్ను 'టవులన్'కు పంపారు ఈ తడవ నాకు యావజ్జీవశిక్ష, ఎలాగోఒకలా తప్పించుకొని బయట పడాలని నా తాపత్రయం. కాని ఎలాసాధ్యం? చుట్టూ కోటలా ఉన్న జైలుగోడలు, చేతులకు మోయలేని ఇనుప సంకెళ్లు, ఇవన్నీ భేదించుకొని ఎలా బయట పడడం ? - ఏమైతేనేం ? విశ్వప్రయత్నం చేసి బయటపడ్డాను జైలునుంచి తప్పించుకుని వచ్చాను నేనొక్కణ్ణేకాదు, చాలా మందిమి - పోలీసులు మమ్ములను కాల్చారు. కాని వాళ్ళ ప్రయత్నం విఫలమైంది మాకు దెబ్బ తగల్లేదు తెలివిగా తప్పించుకొన్నాం, ఈ మాటు నాకు పచ్చకాగితమూ లేదు, పారితోషికంగా వచ్చే డబ్బూలేదు. నాలాగే జైళ్ళనుంచి పారిపోయి వచ్చిన దొంగలను హంతకులను అనేకమందిని కలుసుకున్నాను వాళ్ళంతా ఉద్దండపిండుగులు! వాళ్ళంతా ఒక ముఠా ఆ ముఠా నాయకుడు, నన్ను వాళ్ళలో చేరమన్నాడు దోపిళ్ళు, దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు సాగించి డబ్బు గడించవచ్చునన్నాడు నేను సరే నన్నాను ఇంకేం ? దోపిళ్ళు, హత్యలు చేసి పొట్ట పోసుకోడం మొదలుపెట్టాను మేము చేసిన దారిదోపిళ్ళకు, హత్యలకు అంతులేదు త్రోవన మనిషి కనపడడమే పాపం! పైన పడ్డామన్నమాటే వాడి దగ్గరున్నదంతా లాక్కోవడం, 'పో వెధవా' అనడం ఎవడైనా ఎదురు తిరిగాడా, వాడితల ఎగిరిందన్నమాటే! వాణ్ణీ, వాడిబండీ, గుర్రాలను నాశనంచేసి అక్కడే ఏచెట్టుక్రిందనో - గుట్టక్రిందనో పూడ్చి పెట్టేవాళ్ళం ఆపని చేసినట్లు ఎక్కడా - పోలుకువకూడా కనుపించకుండా - పైన ఇంతగడ్డీ - గాదంపడేసి కప్పివేసేవాళ్ళం

"ఈ విధమైన వృత్తితో నాకు విసుగెత్తిపోయింది అహర్నిశలూ అడవులలో, కొండలలో సంచారం క్షణం శాంతిలేదు ఉన్నచోట ఉండలేదు, తిన్నచోట్ల తినలేదు అవుతేనేం? నాకు స్వేచ్ఛ ఉన్నది నాకు నేనే రాజును ఏంచేసినా అడిగేవాడు లేడు కాని ప్రతిదీ ఎప్పుడో ఒకప్పుడు అంతం కావలసిందే ఇలా సాగిన నా జీవితం అంతమైంది తక్కినవాళ్ళదికూడా ఒకనాటి అర్ధరాత్రి పోలీసులు వచ్చి పైన పడ్డారు నా సహచరులు తప్పించుకున్నారు నేను పట్టుబడ్డాను అవును నేను వృద్ధుణ్ణి భౌతికంగా చూస్తే బలిష్ఠుడిలా కనుపిస్తున్నాను కాని మానసికంగా నాకు ఏనాడో వృద్ధాప్యం దాపురించింది! పోలీసులు నన్ను పట్టుకొని ఇక్కడికి తీసుకొచ్చారు ఇప్పుడు ఉరికంబం ఎక్కబోతున్నాను అయినా ఫరవాలేదు ఇప్పుడు చావూ - బ్రతుకూ రెండూ

నాకు ఒకటే, తేడాలేదు! తక్షణం నన్ను వాళ్ళు ఉరి తియ్యాలి, అదే నేను కోరేది ఈపాడుబ్రతుకుతో అలసిపోయానయ్యా! ఉరి కంబంమీద విశ్రాంతి తీసుకుంటాను. మృత్యు ముఖంలోనే నాకు శాంతి ఉన్నది! మా నాయననుకూడా ఉరితీశారు, ఇది నాకు వంశపారంపర్యంగావచ్చినఆస్తీ,హక్కూనూ అనుభవించవద్దూ? చింతలేదు. స్నేహితుడా! ఇదీ నాకథ!",—

అతని కథంతా నిద్రమత్తులో ఉన్నట్లుండి విన్నాను అతను మళ్ళీ బిగ్గరగా నవ్వుతూ నా బుజాలు పట్టుకొని ఊపివేశాడు ఏమిటో ఆ పిచ్చి సంతోషం! "అబ్బాయ్! అధైర్య పడకు చూడబోతేనీవు భయపడిన మనిషిలా అగుపిస్తున్నావు! ఎప్పుడైనాసరే, మృత్యువును దరియబోవునప్పుడుభయపడకు వింటున్నావా? ఆ క్షణం భయపడవలసింది కాదు చింతించవలసిందీ కాదు అందరికీ వస్తుంది ఆ క్షణం! అబ్బాయ్! నిన్నూ నన్నూ భగవంతుడు కరుణించుగాక! ఇవాళనే నీతో పాటు నన్ను ఉరి తీసినా, నామటుకు నేను చింతించను సంతోషంగా స్వీకరిస్తాను వధ్య శిలకు నీకు త్రోవ చూపిస్తాను కూడా మత గురువు మన ఇద్దరిపేరా మంత్రాలు చదివి ఆశీర్వదిస్తాడు! ఏమంటావ్?" ఇలా అంటూ అతను మరో అడుగు ముందుకు వేసి నన్ను సమీపించాడు

అప్పుడు నేను "మాన్‌షియర్! మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞుణ్ణి!" అంటూ అతన్ని అవతలికి నెట్టివేశాను

అతను మళ్ళీ పట్టరాని ఆనందంతో పగలబడి నవ్వుతూ "అహ్హాహా! భలేవాడివయ్యా! నేను మాన్‌షియర్‌ను, నీవు మహారాజ కుమారుడవు!" అన్నాడు

నేను అతనిమాటకు అడ్డువచ్చి "స్వామీ! మీకొక నమస్కారం నా మనస్సు చికాకుగా ఉంది. నన్ను కాసేపు ఒంటరిగా ఉండనివ్వండి" అని కసురుకున్నట్లు మాట్లాడాను. అకస్మాత్తుగా నేనలా కోపం తెచ్చుకోవడం చూచి పాపం అతను ఆలోచనలో పడ్డాడు పండిపోయి వెంట్రుకలన్నీ ఊడిపోతున్న తల అటు - ఇటు ఆడించాడు ఎదుర్గొమ్ముమీద గీరుకుంటూ "అవును, నా కర్థమైంది, చావబోయేముందు అట్లాగేఉంటుందయ్యా!..." అన్నాడు

తరువాత కొద్ది నిమిషాలపాటు మా ఇరువురిమధ్య నిశ్శబ్దం అలుముకుంది "మొత్తానికి నీవు మహారాజువే,నీవువేసుకొన్న కోటు భలే బాగుంది కానీ ఏంలాభం? అదిఆపోలీసువాడేకాజేస్తాడు పోనీ నాకన్నా ఇవ్వరాదటయ్యా? అమ్ముకుంటే ఎంతోకొంత వస్తుందీ!" అన్నాడతను

నా కోటుతీసి అతనికిచ్చాను పసిపిల్లవాడికి మిఠాయిపెడితే సంతోషించినట్లు సంతోషించాడతను చప్పట్లు కొట్టాడు కాని కోటు లేకపోవడంవల్ల చలికి నేను గడగడ వణుకుతున్నాను

"అయ్యో, పాపం! నీకు చాలా చలి వేస్తున్నట్లున్నది మాన్‌షియర్? వర్షంకూడా కురుస్తుందేమో పాపం అన్యాయంగా చలికి చచ్చిపోతావు ప్రాణం పోయేదాకా కాస్త వంటిమీద గుడ్డయినా ఉండవద్దటయ్యా?" అంటూ అతను, ముతకగా, చినిగిపోయి ఉన్న అతని ఉన్నిచొక్కా తీసి నావంటిమీద కప్పాడు నేను ఊరుకున్నాను గోడకు చేరగిలబడ్డాను ఈ అపరిచితవ్యక్తి నామనోఫలకంపై విచిత్రమైన ముద్రవేశాడు నేను ఇచ్చినకోటు చేతపుచ్చుకొని క్షణక్షణం దానిని ఏదో వింతవస్తువును పరిశీలించినట్లు పరిశీలించసాగాడు వాడిన అతని వదనంలో ఆనందం వెల్లివిరుస్తున్నది! "అరె! కొత్త జేబులు! ఎక్కడా చెక్కు చెదరకుండా ఉన్నది కోటు ఎవడు కుట్టాడోకాని భలే బాగా కుట్టాడు అమ్మితే కనీసం పదియేను ఫ్రాంకులైనా వస్తాయి నక్కను తొక్కి వచ్చాను! ఈ బ్రతికే ఆరువారాలూ నాకు డబ్బుకు ఇబ్బంది ఉండదు!" అన్నాడు

అంతలో గదివాకిలి తెరుచుకున్నది వాళ్లు మా ఇరువురికోసం వచ్చారు నన్ను, ఉరి తీసేవాళ్ళుండే చోటికి తీసుకపోవడానికీ, అతన్ని బిసెట్రీజైలుకు పంపడానికీ వచ్చారు పోలీసువాళ్లు వెంటనే అతగాడికి గుదికొయ్య తగిలించారు అతను మరొక మాటు పిచ్చి నవ్వు నవ్వి వాళ్ళతో "ఏమయ్యోయ్! ఒక గమ్మత్తు జరిగింది చూచారోలేదో! ఇదిగో, ఆ అయ్యగారూ నేనూ దుస్తులు మార్చు కొన్నాం ఆయన కోటు నేను వేసుకొని నా చొక్కా ఆయనకిచ్చాను ఈ సందట్లో మీరు ఆయినే నేననుకునేరు పొరపాటున! అనుకుని ఆయన బదులు నన్నే ఉరితీసేరు, సందట్లో 'సడిబిడి' అని చస్తాంరా భగవంతుడా! నేనింకా ఆరువారాలు బ్రతకాలి, తెలిసిందటయ్యోయ్! పొరపాటు పడేరు కొంపతీసి!" అన్నాడు

24

ఆ వృద్ధుడు నా కోటు తీసుకొని నా ముఖాన ఈ చింకిచొక్కా పడేసిపోయాడు అబ్బ! ఇది ఎంత అసహ్యంగా ఉంది ! ఈ చొక్కా వేసుకుంటే ఇపు నా అవతారం చెప్పక్కర్లేదు ఏంచెయ్యను మరి? నేను ఇవ్వాలనుకుని ఇవ్వలేదు ఆ కోటు అతను పెద్ద వస్త్రాదులా ఉన్నాడు ఇవ్వకపోతే ఎక్కడ మీదవడి గొంతు పిసుకుతాడో అని యిచ్చేశాను, చెప్పొద్దూ! ఛీ,ఛీ! ఇదేం ధర్మం చెయ్యడం? ధర్మం చెయ్యండంలో కూడా విచక్షణ ఉండాలి వాడొక పచ్చిదొంగ, హంతకుడు వాణ్ణి ఏంచేసినా పాపంలేదు

ఎందుకో నాకు తగనికోపం వస్తోంది ప్రతి విషయంమీద అసహ్యం పుడుతోంది మృత్యువున్నదే - అది నన్ను క్రూరుణ్ణిగా చేసింది

25

అక్కడనుంచి తీసుకపోయి మళ్ళీ నన్నొక చిన్న గదిలోపెట్టిబంధించిపోయారు నేను ఒక టేబిల్, ఒకకుర్చీ, వ్రాసుకునేందుకు కలం, సిరాబుడ్డి,కాగితాలు ఇవ్వమని వారిని కోరాను లిట్టుకుంటూనో తిమ్ముకుంటూనో అవి తెచ్చి ఇచ్చారు తరువాత ఒక పక్కచుట్ట ఏదైనా తెచ్చి పడెయ్యమని అడిగాను కాపలావాడు నిర్ఘాంతపోతూ నావంక చూచాడు "ఏం పక్కచుట్ట కావాలటయ్యా? ఆ నేలమీద పడి ఏడవరాదూ?" అన్నట్లు పెట్టాడు ముఖం

ఏమైతేనేం, వాళ్లొక మడతమంచం తెచ్చి పడేశారు దానివెంట ఒక పోలీసువాడు కూడా వచ్చాడు వచ్చి స్వయంగా ఆమడత మంచంవిప్పతీసి, గదిలోవాల్చిమరీపోయాడు ఈ ఉన్నకాసేపూ ఆ మంచంమీదైనా నేనింత సుఖంగా పడి ఉంటాననుకున్నాడో, ఏంపాడో!

26

పది గంటలైంది

అయ్యో, భగవంతుడా! మా అమ్మాయి! నా చిన్నారి, చిట్టితల్లి! ఇంకా ఒక్క ఆరు గంటలు మాత్రమే, - ఆరు గంటల్లో నేను చచ్చిపోతాను! అమ్మాయీ! మేరీ! మీ నాన్న, - మీ నాన్నను ఉరితీయబోతున్నారమ్మా, పిల్లవరికీ నేను అపకారం చెయ్యలేదు పిళ్ళకూ నాకూ విరోధంలేదు అయినా వాళ్లు నన్ను చంపబోతున్నారమ్మా మరో ఆరుగంటలకల్లా మీనాన్నతల తెగిపడుతుంది ఈ విషయం నీకు తెలుసునా తల్లీ? అయ్యో, పిచ్చిపిల్లా! నీకెలా తెలుస్తుందే! నిన్ను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన తండ్రికి, నీ గులాబీ చెక్కిళ్లు ముద్దాడిన తండ్రికి, పట్టు కుచ్చులాంటి నీ జుట్టును నిమిరిన తండ్రికి' అస్తమానం నిన్ను ఒడిలో కూర్చోపెట్టుకొని, జోలపాడుతూ, జోకొడుతూ, కథలు కబుర్లు చెప్పుతూ, లాలించి, బుజ్జగించి, నీ కిలకిల నవ్వులలో హాయిగా తియ్యగా తేలిపోయిన నీ తండ్రికి - ఇంకా కొద్ది గంటలలో ప్రాణం పోనున్నదని నీకెవరు చెపుతారు చిట్టితల్లీ?

ఇహ నిన్ను ఎవరు చూస్తారు? నీముద్దు-ముచ్చటలు ఎవరు తీరుస్తారు? ఇంక నీ కెవరమ్మా దిక్కు? నీవయస్సులో ఉన్న పిల్లలందరికీ నాన్నలున్నారు, ఒక్క నీకు తప్ప ఎంత దురదృష్టవంతురాలివి తల్లీ నీవు! తండ్రిలేని పిల్లవై ఎలా బ్రతుకుతావమ్మా ఈ లోకంలో? నీకు ఉగాదిపండుగనాడు కొత్తబట్ట లెవరు కొనిపెడతారు? పిప్పరమెంట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు, మిఠాయిలు ఎవరు తెచ్చిపెడతారమ్మా? పిల్లలందరూ వాళ్ళ నాన్నలు తెచ్చిపెడితే ఇంచక్కగా ముస్తాబు చేసుకొని గుమ్మటాల్లా తిరుగుతారు? మరి నీవు? నీవు దిక్కులేని పక్షివై పోతావే అమ్మా!

అయ్యో పిచ్చితల్లీ! మేరీ! అభమూ-శుభమూ ఎరుగని దానివే, తలుచుకుంటే నా గుండె చెఱువై పోతున్నదే అమ్మా! ఈ న్యాయమూర్తులు, జూరీలు, నీస్థితి కళ్ళారా చూచివుంటే, వాళ్ళకు తెలిసేది మూడేండ్లపిల్లకు తండ్రి లేకపోవడం ఎంత అన్యాయమో అర్థమయ్యేది

మేరీ పెరిగి పెద్దదైతే ఇక దాని గతి ఏంకావాలి? దానికి చదువు సంధ్యలు ఎవరు చెప్పిస్తారు? పెళ్ళి - పేరంటాళ్లు ఎవరు చేస్తారు? ఆ అమ్మాయి ఈ దుర్మార్గపు లోకంలో ఎట్లా బ్రతుకుతుంది? జ్ఞానంవచ్చిన తరువాత ఆ పిల్లకు అన్నీ తెలుస్తాను ఈ పిల్ల తండ్రి నేరస్థుడనీ, ఉరి తీయబడ్డాడనీ, ఫారిస్ నగరమంతా చెప్పుకుంటుంది 'ఇదిగో ఈ పిల్లతండ్రే!' అని జనమంతా వేలుపెట్టి చూపిస్తారు అప్పుడు మేరీ ఏమనుకుంటుంది? ఆ పిల్లకు తలవంపులొస్తాయి ఎక్కడున్నా ఏంచేసినా ఇదొక పెద్ద ప్రతిబంధకంగా తయారవుతుంది అందరూ ఆ అమ్మాయిని అదోలా -చూస్తారు వెలివేసినట్లు చూస్తారు, ఇక మేరీ నాపేరు ఉచ్చరించడానికే భయపడుతుంది ఇదంతా నామూలంగా కదూ? మరి నేనేం చేసేది? నా చిట్టితల్లిపై పంచప్రాణాలూ పెట్టుకున్నానే! అయ్యో భగవంతుడా! ఎందుకు పుట్టించావు నన్ను? ఎవరి పాపానికి పురికొల్పారు నిన్ను?

నావంటి దౌర్భాగ్యుడు ఎక్కడా ఉండడు కాని నేనుచేసిన నేరమేమిటి? సంఘానికి నేనేం ద్రోహం చేశాను? నిజంగా ఇవాళ నా ప్రాణం పోతుందా? ఇవాళ చచ్చిపోయేది నేనేనా? బయట వీధులలో జనసందడి వినిపిస్తున్నది పెద్ద కోలాహలంగా ఉన్నది పోలీసులు అంతా హడావుడిగా సర్దుకుంటున్నారు మతగురువు నల్లటి గౌను వేసుకొని ఏదో తొందరలో ఉన్నాడు ఇవన్నీ నిజంగా నాకోసమేనా? ఇక్కడ - ఈ గదిలో - ఈ బల్లముందు - లోకంలో అందరిలాగా కదులుతూ-మెదులుతూ చూస్తూ, ఊపిరిపీలుస్తూ ఉన్న నా ఒక్కడికోసమేనా ఈ సన్నాహాలన్నీ!

27

నేను హఠాత్తుగా తల ఎత్తి చూచాను

ఒకనాటి ఉదయం పదకొండు గంటల వేళ నేనొక బండిలో 'డీగ్రేవ్'లోగుండా వెడుతున్నాను ఉన్నట్లుండి బండి ఆగింది

అక్కడ జనం గుమికూడారు నేను కిటికీలోనుంచి తల బయటికిపెట్టి చూచాను ఆ ప్రదేశంలో ఒక పెద్ద జనసమూహం పోగయిఉన్నది వీధులనిండాను, ఆడవాళ్లు మగవాళ్లు, ఓ! ఎక్కడ చూచినా గుంపులు గుంపులు జనం! పిల్లలైతే కంచెలమీద, కరలమీద ఎక్కి నిలుచున్నారు వారి తలలపైన ఎర్రటి కర్రతో ఒక విధమైన ప్లాట్‌ఫారం అమర్చి ఉన్నది ముగ్గురు మనుష్యులు దానిని లేవనెత్తి నిలవబెడుతున్నారు

ఉరిశిక్ష పడిన ఒక వ్యక్తిని ఆనాడు ఉరితీయనున్నారు తల నరకడానికి వారొక గండ్రగొడ్డలికూడా సంసిద్ధం చేస్తున్నారు

నేను దానివంక చూడకుండా తల ప్రక్కకు తిప్పుకున్నాను నా బండి ప్రక్కన నిలుచున్న ఒక స్త్రీ ఒక పసిపిల్లవాడితో ఇలా అంటున్నది

"అదిగో, చూడరా! ఉరితీసే స్థలంలో మరచక్రం సరిగ్గా తిరగడంలేదు అందుకే వాళ్ళు దానికి, 'గ్రీజ్' రాస్తున్నారు"

అవును ఇవాళకూడా అలాంటి జనసమూహమే అక్కడ పోగై ఉంటుంది. ఇప్పుడే సరిగ్గా పదకొండు గంటలు కొట్టింది వాళ్ళు గండ్రగొడ్డలి సిద్ధం చేసి మరచక్రానికి గ్రీజ్, రాస్తుంటారు సందేహం లేదు అయ్యో, భగవంతుడా! ఇవాళ నాతల తీయడం తప్పదు!

28

అయ్యో! ఎవరో ఒకరు నా ఉరిశిక్ష నిలుపు చెయ్యకూడదూ? నా తరపున ఒక ప్లీడరొచ్చి మాట్లాడకూడదూ? ఎవరైనా ప్లీడరుకోసం వెళ్ళండయ్యా, మీకు పుణ్యం ఉంటుంది చచ్చి మీ కడుపున పుడతానయ్యా బాబ్బాబూ! కాస్త ఈ సహాయం చేసిపెడుదురూ! యావజ్జీవ కరినశిక్ష విధించినా అనుభవిస్తాను, ఎన్ని ఏండ్లయినా సరే, ఉరిశిక్ష మాత్రం తప్పించండి తండ్రీ! నా ప్రాణాలు నిలపండి నాయనా!

అబ్బ! బ్రతుకంటే ఎంతతీపి!

29

మతగురువు తిరిగి వచ్చాడు.

ఆయన ముఖంలో ప్రసన్నత గోచరిస్తోంది ధర్మాత్మునివలె కనుపిస్తున్నాడు ఇవాళ ఉదయం ఆయన తనవద్దనున్న డబ్బు యావత్తూ ఖైదీలకు ధర్మం చేస్తుండగా నేను కళ్ళారా చూచాను అప్పుడాయన ముఖంలో ఎంతకారుణ్యం ఉట్టిపడిందనుకున్నారు? కాని ఆయనగారు ఇంతవరకూ నా హృదయాన్ని ఆకర్షించేమాట ఒక్కటికూడా నాతో చెప్పలేదు. ఎందుచేతనబ్బా?

ఇవాళ ఉదయం నా మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తున్నది. ఆయన నాతో అన్న మాటలు నేను సరిగా వినిపించుకోలేదు ఏమైనాఆయనవాక్కులునామనోఫలకంమీద ఎలాంటి ముద్రా వెయ్యలేదు. దున్నపోతు మీద వానకురిసినట్లు, నేను వాటికేమాత్రం చలించలేదు

అయినప్పటికీ ఇప్పుడు మళ్ళీ ఆయన కనుపించేసరికి ఎంచేతనో నా హృదయంలో చల్లనిగాలి వీచినట్లయింది. ఇక్కడ, ఈ కనుపించేజనం అందరిలోనూ నాకు సహాయం చేసే వ్యక్తి ఎవరైనా ఉన్నారాఅంటే అది ఆయన ఒక్కడే,-అనుకున్నాను నాలో నేను. ఆయన చాలాసేపు నా హృదయ వేదనను చల్లార్చే మాటలు మాట్లాడాడు.

ఆయన కుర్చీమీద కూచున్నాడు. నేను నా పక్కమీద కూచున్నాను ఆయన మాట్లాడ సాగాడు

"నాయనా!"

ఆ చల్లని మెల్లని పిలుపుకు నా ఆత్మ మేలుకొన్నది

"నాయనా! నీకు భగవంతునిమీద విశ్వాసం ఉన్నదా?" అని అడిగాడు.

"ఉన్నది స్వామీ" అని జవాబు చెప్పాను నేను.

"పవిత్రమైన రోమన్ కాథలిక్ చర్చిపైన నీకు నమ్మకం ఉన్నదా?"

"లేకేమీ" అన్నాను మళ్ళీ నేను.

"నాయనా! చూడబోతే నీకు కొన్ని సంశయాలున్నట్లున్నది!"

ఈవిధంగా ప్రశ్నిస్తూ ఆయన చాలాసేపు మాట్లాడాడు! ఎన్నెన్నో విషయాలు చెప్పాడు, చివరకు చెప్పడం ముగించి లేచాడు నావంక తదేకంగా చూచాడు అలా ఆయన నాకేసి చూడడం అదే తొలిసారి.

"అవుతే-సరే, వస్తాను" అన్నాడు

నేనుకూడా లేచి నిలుచున్నాను "బాబుగారూ! నన్ను ఒంటిగా ఉండనివ్వండి. మీకు పుణ్యముంటుంది" అన్నాను

"అవుతే మళ్ళీ నన్ను ఎప్పుడు రమ్మంటావు?" అని అడిగాడాయన

"ఎప్పుడు రమ్మనేదీ తెలియచేస్తానులెండి" అన్నాను నేను.

తరువాత ఆయన ఇంకేమీ మాట్లాడకుండా శిరస్సు పంకించాడు "నాస్తికుడు!" అన్నాడు, తనలోతాను అనుకున్నట్లు

కాదు నేను నాస్తికుణ్ణి కాదు కానే కాదు భగవంతుడిమీద నాకు నమ్మకం ఉన్నది. అందుకు ఆ భగవంతుడే సాక్షి. కాని వృద్ధుడైన ఆ మతగురువు నన్నలా ఎందుకన్నాడు? ఆయన అంతసేపు మాట్లాడినా ఎందుచేతనో, ఒక్కమాటకూడా నన్ను ఆకర్షించలేదు నా హృదయాన్ని ద్రవింపచెయ్యలేదు నా ఆవేదన చల్లార్చలేదు అందరికీ, ఎప్పుడూ కంఠోపాఠంగా చెప్పే 'ఊకదంపుడు' ఉపన్యాసమే నాకూ చెప్పాడు నిజానికి నాకలా అనిపించింది, చెప్పొద్దూ? ఓ ఇరవైసార్లు కంఠస్థం చేసిన పాఠం గడగడ అప్పగించినట్లు అప్పగించాడు.అంతేమరి. ఆయన 'ఆఫ్టర్ ఆల్' జైలుకు సంబంధించిన ఒక మతగురువు నేరస్థులకు కాస్త ఏవో ఉప్పుచప్పని మాటలుచెప్పి శాంతి పరచడం ఆయనపని పనికాదు వృత్తి దానివల్ల ఆయనకు పొట్టగడుస్తుంది ఎన్నిచావులు చూశాడో ఆయన. ఒక్కొక్కరి పేరు తన నోటు బుక్కులో వ్రాసుకుంటాడు. వారి నివేదనలన్నీ వింటాడు నన్నుగురించి కూడా తన పుస్తకంలో ఒకపేజీ వ్రాసుకొని ఉంటాడు. "అక్కడొక మనిషిని ఉరి తీయబోతున్నారు అతన్ని ఓదార్చడం నీవిధి కనుక అతని మెడకు ఉరితాడు తగిలించకముందే నీవు అక్కడికి వెళ్ళి అతన్ని ఓదార్చాలి అతని వెంట బండిలో కూచుని డ్రిగేవ్ దాకా తోడుండాలి ఉరికంబం ఎక్కబోతుండగా అతన్ని ముద్దాడాలి - అతని తల తెగిపడేంత వరకూ నీవు అక్కడే ఉండాలిసుమా!" అని ఆయనను జైలు అధికారులు ఆజ్ఞాపిస్తారు. ఆయన తన కర్మకాండ నెరవేరుస్తాడు ఆ విధంగానే ఇప్పుడు నావద్దకూ వచ్చాడు. అంతే! అంతకన్నా ఆయనకూ నాకూ ఏమిటి సంబంధం? ఆయనెవరు? నేనెవరు? నాలాంటి వాళ్లు ఎందరైనారో ఆయనకు! ఉరి తీయబడిన వేలాది అభాగ్యులలో నేనూ ఒకణ్ణి ఆయన మనోఫలకంపై నేనూ ఒకనీడను!

నేను ఆయన్ను తిరస్కరించి మాట్లాడడం నాతప్పు కావచ్చు అక్కడికి ఆయన మంచివాడైనట్లు నేను చెడ్డవాణ్ణి అయినట్లు. అయినా ఇది నా దోషంకాదు మృత్యుముఖంలో ఉన్న ప్రతిమానవుడి మనస్థితీ ఇలాగే ఉంటుంది!

వాళ్లు నాకు భోజనం పట్టుకొచ్చారు. పాపం, అది నాకు ఎంతో అవసరమనుకున్నారు మామూలు భోజనం కాదు, కోడి పలావు!

అబ్బా! ఏంచెప్పేది? తినాలని యత్నించాను. కాని ముద్ద నోట్లోకి పోలేదు. నోటి దగ్గర పెట్టుకుంటే డోకువచ్చింది. భగవంతుడా! అన్నద్వేషం పుట్టింది. ఆహారం విషతుల్యమైంది!

❖

విశ్వనాథమధ్యాక్కఱలు

శేషగిరి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

మానసమును సృష్టిచేయు నజు తెల్వి మాట చెప్పవలెఁ
గాని, నీదేమున్నది? యజకృతమనః కల్పనమంది
పూని త్రిపురవైరియొక్క పనిమీఁద బుద్ధుండవైతి,
శ్రీ నీరధిశయాన! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఈ సృష్టియంతయుఁ జూడ నొక యెత్తు, నీ మనోవికృతి
భాసంబును వివేకమంచు వెలయించు పనియొక యెత్తు,
దాసాత్మకమ్ములన్యములు, బుద్ధావతారమ్ము మనసు
చేసిన కల్పన! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నీవు లేవని చెప్ప నెన్ని వాదనల్ నేర్వంగ వలయు,
నీవె నేర్పితివన్ని, వెదకికొనైన నీతియే లేక
ఆ వేదము ప్రమాణమంటి, మరలఁ గాదంటి బుద్ధుఁడయి;
సేవానభిముఖుఁడ! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

యుగములుగఁ దపస్సుచేయు వారలకే దిక్కు లేదు,
పగళులు పదికన్ను మూసి నీవు కన్పడవంచు లేచి
తెగఁబడి నీవు లేవన్నఁ దనవెంట దిగినారు జనము,
సిగలు కత్తెరవెట్టి, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

తెలివిమాలిన వారిసంఖ్య యెంత వృద్ధిపొనర్తు వంత
పలుకక కూర్చుండవచ్చు, సుంతయుఁ బనిలేకయుండ,
సులభ సౌఖ్యము చూచికొంటి నాస్తిక శూరుఁడై, జనుల
సిలుగుల కేమిలే? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

సామాన్య మనుజ ధర్మములు మాలిన జనసంఘమునకు
సామాన్య మనుజ ధర్మములు చెప్పిన జనుఁడె దైవమ్ము,
సామాన్య ధర్మముల్ వారలాచరించరు, కాని గొప్ప
శ్రీమహితో నుండె - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఎత్తక యెత్తక నేటికీ జన్మ యెత్తితి మాయెఁ
గత్తిరింపులుగ ధర్మమ్ము పేర సుఖంబులు చనిన,
నెత్తక మున్నెట్లో, అట్లెకారాదో? యెత్తి యేమిటికిఁ
జిత్తాట యందురో? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఎన్నిమతాలైనఁగాని మింటిలో నేమౌనటన్న
దెన్నఁగా నిప్పుడే, అక్కడెక్కడో యేమియు లేద,
మన్నులో నెంత మొగ్గయినఁ దానంత మతముల గొప్ప,
చిన్నారి బుద్ధుఁడా! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

పరమును నిహమును గలిపి చేసిన భావన వేఱు,
పరమును వదలి యిహమ్ముఁ గూర్చిన భావన వేఱు,
పరుఁడవు నీవయి, వట్టి యిహమును భావన సేఁత
చెఱుపయ్యె - నోస్వామి! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మఱియు నాల్గున్నర లక్షలైన సంవత్సరమ్ములకు
ధరఁ గల్కివై పుట్టుదఁటవె? యప్పటిధాత్రి యెట్లుండు?
నరయ నిప్పటి స్థితిఁబట్టి లేదూహకందుట, మఱియుఁ
జిరుగులు చిరుగులా? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

అప్పుడెవ్వరో బ్రాహ్మణునకు జన్మింతువని వ్రాసినారు;
అప్పటికైనను బ్రాహ్మణులటంచు నవని నుందురకొ?
యిప్పటి స్థితిఁబట్టి నమ్మకము లేద, యీదశమంబు
చెప్పి ఫలము లేదు! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

అప్పటికెందుకు పుట్టుటో తెలియదు, వేదము లివి
అప్పటి కెప్పుడో పూర్వమే లుప్తమైయుండు, వట్టి
గొప్పకునేఁ గల్కినంచుఁ దెల్లని గుఱ్ఱమ్ము నెక్కి
చెప్పికోరావలె! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

సాక్షివైనైన నీకు యుగధర్మముల్ సాగించునంత
దీక్షయున్నట్లుగాఁ, బాప పుణ్యముల్ దిద్దెడునంత
దీక్ష తోఁచదు, యుగానుసరణమ్ముగాఁ దిరుగ నిచ్చెదవు;
శిక్షించవే మమ్ము-వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నన్నడిగిన యెడ ధాత్రియంతయు నాటికి ఛిన్న
భిన్నమైపోవును, వచ్చి యదుకులు పెట్టెదో యేమొ?
క్రన్నన నీచేతి కత్తియది యయస్కాంతమై ధాత్రి
చిన్నిన్నముక్కలై - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

యుగములు సాగించుచుండుఁ, బెరిగించుచుండు, పాపమ్ము
తెగసాగనిచ్చి, యొక్కయవతారమై దిగెదవు నీవు;
తెగరాని యీసృష్టి యెందు? కెందుకీ త్రిప్పలు? వట్టి
సిగపట్ల గోత్రమ్ము! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

దున్నుకొనఁగ, నెక్కితిరుగను, నెదేని తోలికొనఁగను,
నెన్నగ యంత్రాలమీఁదనే, గుఱ్ఱమే యుండదపుడు!
అన్నాడు గుఱ్ఱమ్ము నెక్కి వచ్చెదవనఁగ, మాతెల్వి
చిన్న పుచ్చుటకేమి? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మరియును నొకమాట! శతవిధాల శ్రమంబంత నీవు
పొరయక యుండెడునట్టి మార్గానఁ బోవుచున్నాము,
పరమాణు మారణా యుధములన్, నీవువచ్చి పాపములఁ
జెరగ నక్కఱలేదు! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

లేదేని నొక్కయూహ పొనరింపవలెన్, గృతయుగము
నాదిలో నిన్నిదేశాలు లే, వంతమందుఁ గలి తుది
నీ దేశములునుండ, నొక్క భారతమే యుండు; నపుడు
ఛేదింతు వఘములను - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

అంత యల్పపుసంఖ్య గలుగు సృష్టి యాద్యంతంబులందు
వంతమ్ము మీఱఁగా, బెద్దచేప రూపంబును, గల్కి
వింతరౌతును నౌటకేమి? నడిపట్టు విదిలించవెపుడు,
చింతిత ఫలదుఁడై వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

యుద్ధాలు భూకంపములు సముద్రమ్ము లుబుకుట యొకట
వృద్ధి, మఱొక్కచో క్షయము, చూడని దెల్లను కాల
పద్ధతి, కాలమ్ము గ్రహగతిం జను, భావింప నీ ప్ర
సిద్ధి కాలమయమ్ము, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

క్రన్నన నిచట బ్రదుకుటకే యహంకారమ్ము చంపు
కొన్నఁగానీ తేలదాయె, నిన్నుఁ గన్గొనగను జెప్పు
మన్నావటే యింక? నే నటన్న మోహంబు సర్వంపు
చిన్నె పోవలెఁగాక, వేంకటేశ్వరా శేషాద్రినిలయ!

మ్రొక్కు బళ్ళకును బ్రసన్నత న్నీవు పొందినయట్లు,
చిక్కని భావనా వితతికిన్ మరి చిక్కవో యేమొ?
అక్కటా అప్పుల మున్గి యున్న నీ యాశ్రమమేమి
చిక్కులు తీర్చునో? వేంకటేశ్వరా! శేషాద్రినిలయ!

వాఁడెటువంటి వాఁడైనను సరే - జవంబున వచ్చి
యేడుకొండలు నీవి చేదుకొమ్మంచు నెక్కి, కొట్టించి
బోడి, నిన్ మ్రొక్కిన - వా నదృష్టమ్ము పుచ్చిపోయినదె!
జీడి నిన్ వదలడు, వేంకటేశ్వరా! శేషాద్రినిలయ!

మరి 'కలౌ వేంకటనాయకో' యన్న మాట కర్థమ్ము
పరమేశ! తెలిసెను పుణ్యాపాపముల్ పట్టించుకోవు,
గిరికి వచ్చుట, నిల్వుదోపు, తలబోడి, కేల్మోది కట్టు -
చిఱుమేళ్ళు కలిగింతు, వేంకటేశ్వరా! శేషాద్రినిలయ!

మది దైవ మంచును నిన్ను నమ్మిన మాదిరి యిదియొ?
యెద నిన్ను నిల్పుటలేద? నమ్మని యెవరినో పట్టి
పదరుచునుంటిన? యిద్ది నాదైన భక్తియో, వట్టి
చిదురుబోతు తనంబొ? వేంకటేశ్వరా! శేషాద్రినిలయ!

పొద సుదర్శన మది చేత వాసుకి చుట్టుకొన్నట్లు,
విదిత శంఖము వినాయకుని నెమ్మోము విరిసిన యట్లు,
పదనూర్ధ్వ పుండ్రమ్ములవి త్రిశూలంబుపగిది, రెండుగను
చెదరక రావయ్య! వేంకటేశ్వరా! శేషాద్రినిలయ!

(శ్రీ) పయోధర సమాశ్లేష రేఖా పరిమళామృత ధు
నీ పోషితాశ్రిత క్షేత్రభూత మనీషార్ద్రివలయ!
ప్రాపిత స్వీయభూధర శిఖాక సద్భక్తభావ కల
శీ పూరమలయజా! వేంకటేశ్వరా! శేషాద్రినిలయ!

ప్రత్యక్ష పరోక్షానుభవజన్య జ్ఞానములు

బెర్ట్రండ్ రసెల్

అనువాదం : జి. ఎస్. ఎన్.

వెనుకటి యధ్యాయమున మనము, జ్ఞానము రెండు విధములనియును, అందొకటి వస్తుజ్ఞాన మనియును, రెండవది సత్యజ్ఞాన మనియును తెలిసికొంటిమి. ఈ యధ్యాయమున మనకు వస్తుజ్ఞానమే ప్రధానమగు విషయము. ఈ వస్తు జ్ఞానమును గూడ రెండు తెగలుగ వివేచనము సేయవచ్చును అందొకటి ప్రత్యక్షానుభవజన్య జ్ఞానము ముఖ్యముగా నీ తెగకు జెందినపుడు వస్తుజ్ఞానము ఏ సత్యజ్ఞానము కంటెను సులభ గ్రాహ్యమైనది మనుష్యుల కెన్నడైన వస్తువును గూర్చి ఎట్టి సత్యమైన విషయమును తెలియ కుండ వానినిగూర్చి ప్రత్యక్షానుభవము గలుగు ననుట సాహసమేమైనను తార్కికముగా నీవస్తు జ్ఞానము (Knowledge of things) సత్య జ్ఞానము(Knowledge of truths)నకుపూర్తిగా నతిరిక్తమైనది కాని పరోక్షానుభవజన్య జ్ఞాన మున దాని కాధారమై యొప్పు సత్యమని తేలిన విషయములను గూర్చిన కొంత పరిజ్ఞానము ఇమిడియుండును. కాని తొలుత, ప్రత్యక్షానుభవ మననేమో, పరోక్షానుభవమననేమో మనము స్పష్టము చేయవలెను

నడుమనెట్టి యానుమానిక వ్యాపారముగాని లేక సత్యమని తేలిన విషయములను గూర్చిన యెట్టి పరిజ్ఞానముగాని లేక ఒక వస్తువునుగూర్చి సాక్షాత్తుగ జ్ఞానము గల్గినపుడా వస్తువునుగూర్చి మనకు ప్రత్యక్షానుభవము గల్గినదని చెప్ప వచ్చును. ఉదాహరణమునకు నాసమక్షమున, బల్ల బల్లగా కన్పించుటకు హేతుభూతములైన రంగు, రూపు, గట్టితనము, నున్నన మొదలగు నింద్రియార్థములను గూర్చి నాకు ప్రత్యక్షాను భవము గల్గుచున్నది నేను బల్లను చూచు చున్నంతవరకును, స్పృశించుచున్నంతవరకును వెనువెంటనే ఇవి యన్నియును నాకనుభూతము లగుచున్నవి. నేను చూచుచున్న బల్లకు సంబం ధించిన రంగు ఏ ప్రత్యేకమైన ఛాయలోనున్నదో విచారింపబూనుకొనినచో, దానినిగూర్చి యనేక విషయములు చెప్పవలసి యుండును. బల్ల కొంచెము గోదుమరంగులో నున్నదనియో, కొంత నల్లగా నున్నదనియో, మరి యింకొక రంగు గల్గియున్నదనియో చెప్పవచ్చును కాని యట్లు చెప్పినందువలన రంగును గూర్చి కొన్ని యదార్థవిషయములు తెలిసినను, అసలు రంగును గూర్చి వెనుక తెలిసినదానికన్న నెక్కువగా మనకేమియును తెలియదు కాని వస్తువు అసలు రంగును గూర్చి ఒక్క విషయమును మాత్రము చెప్పగలము వస్తువును చూచునపుడు దానికొక రంగు ఉన్నట్లు మనకు పూర్తిగా గోచరమగును ఇంతకంటె సిద్ధాంత విషయమున మనమేమి యును చెప్పలేము కావున బల్ల ఉన్నదని మనకు తెలియుటకు హేతుభూతములైన యింద్రియార్థ ములను గురించి మాత్రమే నాకు ప్రత్యక్షాను భవము గల్గుచున్నది వానిని గూర్చియే ఉన్న దున్నట్లుగా మనకు సమనంతరమే విదితమగు చున్నది.

అట్లుగాక ఒక భౌతిక వస్తువుగా బల్లను గూర్చిన జ్ఞానము సాక్షాత్తుగా నేర్పడినదిగాదు అందుచే బల్ల ఉన్నదని మనకు తెలియుటకు హేతుభూతములైన యింద్రియార్థముల ద్వారా దానిని గూర్చిన జ్ఞానముకలుగుచున్నది అసలు బల్ల యనునది యొకటి యున్నదా యను విష యమై ఎట్టి అసంబద్ధతయు లేకయే శంకించుట కొకప్పు డవకాశ ముండవచ్చునుగాని ఈయింద్రి యార్థముల విషయమై యెట్టి సందేహమును వెలువరించుట కవకాశములేదు కావున అసలు బల్లనుగూర్చి నాకుగల్గిన జ్ఞానము పరోక్షానుభవ జన్యమనియే చెప్పవలయును 'ఫలానా' ఇంద్రి యార్థములు మన కనుభూత మగుటకు హేతు భూతమైనదే బల్ల ఇది బల్ల యునికిని యింద్రి యార్థములద్వారా మనకు వ్యక్తము చేయును బల్లను గురించి ఏకొంతమైన మనకు దెలియవల యునన్న. మన కనుభూతములగు వస్తువులతో దానిని సంయోజన పరచు కొన్ని యదార్థ విష యములను (truths) మన మెరిగియుండవలెను. ఒకానొక భౌతిక వస్తువు కారణముగా కొన్ని యింద్రియార్థములు అనుభూతము లగుచున్న వస్తు పరిజ్ఞానము మనకుండవలెను బల్లనుగూర్చి సాక్షాత్తుగ (directly) మనమెరుగగల్గు మనస్థితి యెప్పుడును ఉండదు. బల్లనుగూర్చి మనకుగల్గిన

జ్ఞానమంతయు యథార్థము చెప్పవలెనన్న, సత్యములని తేలిన కొన్ని విషయముల పరిజ్ఞానము కచ్చితముగా చెప్పవలెనన్న, బల్లయని వ్యవహరింపబడెడి యసలు వస్తువు మనకు తెలిసెడిది కాదు ఒకానొక వర్ణనము మన మనస్సున నుండును ఆ వర్ణనమునకు సరిపోవు వస్తువు సరిగా నొక్కటియేయని మనకు తెలియును. అసలు వస్తువు సాక్షాత్తుగ మన తెరుకపడునది గాదనుట యనునది వేఱు విషయము. అట్టి స్థితిలో వస్తువునుగూర్చి మనకు గల్గిన జ్ఞానము పరోక్షానుభవ జన్యమని యందుము.

మన జ్ఞానమున కంతకును, వస్తుజ్ఞానమునకును, సత్యజ్ఞానమునకును గూడ ప్రత్యక్షానుభవమే మూలాధారము కావున మనకు ప్రత్యక్షానుభూతములగునవేవో పర్యాలోచించు టవసరము.

మనమింతకు పూర్వము గ్రహించినట్లు మనకు సాక్షాత్తుగ ననుభూతము లగునవి మన యింద్రియార్థములు ప్రత్యక్షానుభవ జన్యజ్ఞానమననేమో వివరింప బూనుకొనునపుడు మొట్టమొదట స్పష్టముగా మనకు స్ఫురించు ఉదాహరణ మీయింద్రియార్థములు కేవల మివియే యట్టి జ్ఞానమునకు దాహరణ మైనచో, ఇప్పటికంటె మన జ్ఞానము చాల పరిమితమై యుండెడిది ప్రస్తుతము మన యింద్రియములకు గోచరించినవే జ్ఞాతవిషయములై యుండవలెను అట్టి స్థితిలో గతకాలమునుగూర్చి మనకేమియును తెలియుటకు వీలు లేదు. అసలు గతకాల మనునది యొకటి గలదని గూడ మనకుతెలియుటకు వీలులేదు అంతేకాదు మన యింద్రియార్థములకు సంబంధించిన ఎట్టి సత్యములును మన కెఱుకపడి యుండెడివికావు ఏలన సత్యములకు సంబంధించిన సర్వజ్ఞానమునకును, ఇంద్రియార్థములకు పూర్తిగా విభిన్న లక్షణములు గలిగిన తదితర విషయముల పరిజ్ఞాన మత్యవసరము ఒక్కొక్కప్పుడు కొందరు వీనిని 'అనిర్దిష్ట భావముల' (abstract ideas)ని వ్యవహరించుట కద్దు కాని మనము సామాన్యములని (Universals) వానిని వ్యవహరింతము మన జ్ఞానమునకు సంబంధించి ఒకమాదిరిగనైనను విషయతః విభాగము (Analysis) జరుగవలెనన్న కేవల మింద్రియార్థములను గూర్చియే కాక తదితర విషయములను గూర్చిన పరిజ్ఞానము కలుగవలెను

ఇంద్రియార్థముల తరువాత పర్యాలోచింపవలసిన ప్రథమ విస్తరణము స్మృతివలన కలిగిన అనుభవము. మనము చూచినదానిని, వినినదానిని లేక మరియొక విధముగా మన యింద్రియములకు గోచరమైనదానిని మనము జ్ఞాపకముంచుకొందుము అట్టి సందర్భములలో మనకు జ్ఞాపక మున్నదానిని గూర్చిన జ్ఞానము మనకు వెన్వెంటనే కలుగును స్మృతి సిద్ధమగు నీ యానంతరికమగు జ్ఞానమే గతమునకు సంబంధించిన మన సర్వజ్ఞానమునకును మూలకందము అదిలేనిదే గతకాలమును గూర్చి అనుమానము ద్వారా ఎట్టి జ్ఞానమును సిద్ధింపదు ఏలన గతమునుగూర్చి అనుమేయమగు నేదియైనను మన కెఱుకపడుటకు వీలులేదు

తరువాత నాలోచింపవలసిన విస్తరణము, అనువ్యవసాయము (introspection) నుగూర్చి మనకుగల్గు ననుభవము, మనకు కేవలము వస్తువులనుగూర్చిన జ్ఞానమేగాక, అట్టి జ్ఞానము మనకు గల్గుచున్నదన్న జ్ఞానముగూడ గలదు నేను సూర్యుని చూచుచున్నపుడు సూర్యుని చూచుచున్నానన్న జ్ఞానము గూడ నాకు గలదు కావున నాకుగల్గిన యనుభవము సూర్యుని చూచుటయను విషయమును గూర్చి నా కాహారము విషయమై కోరిక గల్గినపుడట్టి కోరిక యొకటి గలదను జ్ఞానముగూడ గలదు కావున నిచ్చటగూడ నాకాహారము కావలయునన్న కోరికను గూర్చిన యనుభవము గల్గుచున్నది అట్లే మన మనోగతములగు సుఖదుఃఖములను గూర్చియు, తదితరములగు వృత్తులను గూర్చియు జ్ఞానము మనకు గల్గుచున్నది ఆత్మజ్ఞానమని (Self-consciousness) వ్యవహరింపబడెడి యిట్టి యనుభవమే మనోగత విషయములనుగూర్చి మనకుగల్గు సర్వజ్ఞానమునకును మూలకందము మన మనస్సులో నేవి మెదులుచున్నవో వానినిగూర్చి మనకు నానంతరికమగు జ్ఞానము గల్గుచున్నదనుట స్పష్టమే కాని ఇతరుల మనస్సులోని నేమి మెదులుచున్నదోయన్న విషయము వారి శరీరములలో లగ్నమైయున్న మనలోని యింద్రియార్థములద్వారా వారి శరీరములను పరిశీలించుటనుబట్టి మనకు దెలియుచున్నది మన మనోగత విషయములను గూర్చిన జ్ఞానమే మనకు లేనిచో, మనమితరులకు మనస్సులున్న విషయమును కనీస మూహించుటకు గూడ నశక్తులమై యుండెడివారము. కావున ఇతరులకు మనస్సు లున్నవను జ్ఞానము గల్గుట సంభవించి యుండెడిదిగాదు. మనుష్యుని తదితర జంతుజాలమునుండి వేఱు చేయునదీ యాత్మజ్ఞానమే.

జంతువులకు ఇంద్రియార్థముల యనుభవము కొంత లేకపోలేదు కాని యీ యాత్మజ్ఞానము మాత్రము వానికి లేదని నిస్సంశయముగా చెప్పవచ్చును, తామున్నామా లేమా అను విషయమై వానికి సందేహము గల్గునని నేనననుగాని తమకు అనుభూతములగు నింద్రియార్థములను గూర్చిన పరిజ్ఞానముగాని. యీ యింద్రియార్థములకును, ఆవేశములకును విషయభూతులగు 'తాము' న్నామను జ్ఞానముగాని వానికెన్నడును గలుగదు అట్టిస్థితిలో వస్తువునుగూర్చి మనకుగల్గు జ్ఞానము పరోక్ష జ్ఞానము

మన మనోగతములైనవానినిగూర్చి మనకు గలుగు ననుభవమును ఆత్మజ్ఞానమని మనమిదివరకే చెప్పియుంటిమి కాని యీ యాత్మజ్ఞానమనగా లోకమున 'ఆత్మ' అని ప్రసిద్ధముగా వ్యవహరింపబడెడు దానిని గూర్చిన జ్ఞానముగాదు. మరి మన మనస్సులలోను, హృదయములలోను మెదులు ప్రత్యేకములైన యాలోచనములును, ఆవేశములు నాధారముగా నేర్పడిన జ్ఞానము. మన మనోగతములును, హృద్గతములునునగు భావావేశములకు నతిరిక్తముగా కేవలము 'మన'సు గూర్చిన జ్ఞానము మనకే కలుగుట కసలు వీలున్నదాయన్న సమస్య యుండనే యున్నది అదియంత తేలికగా పరిష్కరింపబడు సమస్యగాదు. దానినిగూర్చి ఇదమిత్థమని కచ్చితముగా చెప్పనెంచుట సాహసమే మననుగూర్చి మనమొకసారి అనుశీలన చేసికొనునపుడు, ఏదో యొక యాలోచనయో, భావనయో మనస్సులో తారాడునట్లు గన్పట్టునుగాని యీ యాలోచనకును హృద్గత భావమునకును ఆటపట్టగు'నేను' అనగానేమో మనకు విదితమగునది కాదు. అయినను ఇట్టిదానిని గూర్చిన ('నేను' అనుదానిని గూర్చిన) జ్ఞానమును తదితర విషయములనుండి వేఱుచేయుటలో కొంత యిబ్బంది యున్నను, దానినిగూర్చిన మనకు స్థూలముగనైనను జ్ఞానము గల్గునని యనుకొనుటకు కొన్ని యుపపత్తులు లేకపోలేదు. అట్టి యుపపత్తిని గూర్చి విశదీకరింపవలెనన్న, ప్రత్యేకాలోచనములను గూర్చిన జ్ఞానము కల్గుటకు సహకరించు విషయములను గూర్చి పర్యాలోచనము సేయుట అవసరము

నేను సూర్యుని జూచుట యనుదానినిగూర్చిన జ్ఞానము నాకు గల్గునపుడు, పరస్పర సంబంధము గలిగిన రెండు వేర్వేఱు విషయములను గూర్చిన యనుభవము నాకు గల్గుచున్నది ఒకప్రక్క, సూర్యుని యునికిని మనకు దెల్పు ఇంద్రియార్థమును వేఱొకవంక, ఆ యింద్రియార్థము ననుభవ గోచరము చేసికొను వస్తువును గఱవు సూర్యుడున్నట్లు తెల్పు ఇంద్రియార్థమునుగూర్చి నాకుగల్గు అనుభవముపంటి సర్వానుభవమును, అనుభవమును గడించుకొనిన వ్యక్తికిని అనుభూతమగు వస్తువునకును నడుమగల సంబంధమునుబట్టి గల్గుచున్నట్లు కన్పట్టును. నాకు సులభముగా ననుభవము గల్గుట కనువైన పట్టుగొమ్మయేదను విషయము విచారణకు వచ్చినపుడు, అట్టి యనుభవమునకు నాధారమైన వస్తువు 'నేనే' యన్న సంగతి సుస్పష్టము. కావున సూర్యునిజూచు విషయమై నాకనుభవము గల్గునపుడు, ఆ ప్రత్యేకమగు నింద్రియార్థము ననుభవమునకు దెచ్చుకొను 'నేను' అనునదియే మనకు ననుభూతమగు సర్వ విషయమును

అంతియేకాక, 'ఫలానా' యింద్రియార్థమును నేననుభవ సిద్ధము చేసికొనుచున్నానను దానిలోని సత్యము మనకెల్లరకును తెలిసిన విషయమే. ఈ 'నేను' అని మనము వ్యవహరించెడి వస్తువునుగూర్చి యెట్టి పరిజ్ఞానమును మనకు గలగనిచో, పై చెప్పబడిన విషయ మెంతవరకు సత్యమో, అసలు దానికర్థమేమో హడ గ్రహించుట కష్టము ఈ 'నేను' అని చెప్పబడునది కొలదిగనో గొప్పగనో నిత్యమైన వస్తువేయని యనుకొనుటకుగాని నిన్న ఏ 'నేను' ఉన్నదో, ఆ 'నేనే' నేడుగూడ అవిచ్ఛిన్నమైన యునికితో నొప్పుచున్నదనిగాని భావించుటకు తగిన యావశ్యకత యేమియును గన్పట్టుటలేదు కాని సూర్యుని జూచి, దానివలన ననుభూతమైన యింద్రియార్థమునకు నాధారభూతమగు 'నేను' అనునదొకటి యుండి యుండవలెననియు. దాని స్వభావ మేమైనను, దాని యానుపానులను గూర్చి కొంత తెలిసికొనవలసిన యావశ్యకత యున్నట్లు గాన్పించును. కావున ప్రత్యేకములగు మన యనుభవములకు నతిరిక్తముగా 'మనను' గూర్చి మన కనుభవము గడించుకొనవలసిన యావశ్యకత యున్నట్లు గాన్పించును కాని యీ సమస్య క్లిష్టమైనది ఉభయ పక్షముల జటిలములగు నుపపత్తులు పేర్కొనవచ్చును కావున మననుగూర్చి మన కనుభవము గల్గుననుటలో నసంభవ మేమియున్న లేకున్నను, అట్టియనుభవమునుగూర్చి ఖండితముగా చెప్పుటలో వివేకము పూజ్యము.

కావున ఉన్నవానిలో వేనినిగూర్చి యనుభవముగడించుటకు వీలున్నదోయనువిషయమైనన

మింతకు పూర్వము చేసిన పరిశీలనా ఫలితము లను సమీకరించుకొనుటకుగాక. మనకుగల యింద్రియగ్రహణ మూలముగా బాహ్యేంద్రి యములనెడి యుపాదేయసామగ్రిని (data) గూర్చియు అనువ్యవసాయమువలన,అంతరింద్రి యగతములగు నాలోచనములు, ఆవేశములు, వాంఛలుఅనెడి యుపాదేయసామగ్రినిగూర్చియు స్మృతిద్వారా అంతరింద్రియములకుగాని, బహి రింద్రియములకుగాని సంబంధించిన యుపాదేయ సామగ్రిని గూర్చియు, మనకు ననుభవము గల్గు చున్నది అంతియేకాక, వస్తువులను గూర్చిగాని వస్తువులను గూర్చిన మనకోరికను గూర్చిగాని జ్ఞానమునకు విషయభూతులగు 'మనను'గూర్చిన యనుభవముగూడ గలదనియే చెప్పవచ్చును

కొన్ని విద్యమానములగు ప్రత్యేకవస్తువులను గూర్చి మనకు గల్గు ననుభవమునకు నదనముగా తెలుపు నానాత్వము, సోదరత్వము, మొదలగు సాధారణభావములను గూర్చి అనగా సామాన్య ములను గూర్చి (Universals) మన కనుభవము గల్గుచున్నది ప్రతిసంపూర్ణ వాక్యమునందును సామాన్యముగాని, తత్స్థానీయమగు మరియొక శబ్దముగాని ఉండవలెను ఏలన సర్వక్రియ లకును సామాన్యమని చెప్పదగిన యర్థ మొకటి యుండును వీనినిగూర్చి తరువాత విచారింతము ప్రస్తుతము ప్రత్యేకమును, అస్తిత్వమును గల్గిన దేదో అదియే మనకు జ్ఞానవిషయమై యుండ వలెనను నాలోచనము రాకుండ గాపాడుకొన వలయును అట్టి సామాన్యములను గూర్చిన మన యెఱుకయే భావన. మనకెరుకగల సామా న్యమే భావము

మనకు ననుభూతములగు వానిలో - ఇంద్రి యార్థములకును, ఇతరుల మనస్సులకును నతి రిక్తములై యొప్పు భౌతిక వస్తువులు అంతర్భూ తములు కాలేదు. ఇట్టివే మనకు పరోక్షానుభవ జన్యజ్ఞానమున దానిచే మనకు విదితమగును దీనినిగురించియే ప్రస్తుతము మనము పర్యాలో చింపవలయును ఈ పరోక్షానుభవజన్య జ్ఞానము నకు మరొకపేరు వర్ణనాత్మక జ్ఞానము.

ఈ వర్ణననునగా ఒక ప్రత్యేకలక్షణముగల లేక ఆ ప్రత్యేకలక్షణముగల—అనురూపముతో నొప్పు ఒక వాక్యవిన్యాసము 'ఒక ప్రత్యేక లక్షణముగల' అనురూపములో ఉన్న వాక్య విన్యాసమును అనిర్దిష్టవర్ణనమని నేను వ్యవహ రింతును 'ఆ ప్రత్యేకలక్షణముగల' అనురూప ముతో నొప్పు వాగ్విన్యాసమును నిర్దిష్టవర్ణనమని వ్యవహరింతును కావున ఒక మనుష్యుడు అను వాక్యభంగమున అనిర్దిష్టవర్ణనము గలదు ఇను పదపదము దాల్చిన మనుష్యుడు అనువాక్య భాగమున నిర్దిష్టమగు వర్ణనముగలదు అనిర్దిష్ట వర్ణనమునకు సంబంధించిన సమస్య లనేకములు గలవు కాని వానినిగూర్చి ప్రస్తుతము నేనేమియు ముచ్చటింపను. ఏలన అవి మనము చర్చించు చున్న విషయమునకును - ఒక నిర్దిష్ట వర్ణనము నకు సరిపోవు వస్తువొకటి యున్నట్లు మనకు దెలియు సందర్భములలో - అట్టి వస్తువును గూర్చి యైనను మనకు ననుభవము గలుగక పోయినను - వస్తువులను గూర్చి మనకు గలుగు జ్ఞానము స్వభావమునకు సంబంధింపదు ఇది కేవలము నిర్దిష్టవర్ణనములకు సంబంధించిన విష యము నిర్దిష్టవర్ణనములను దానికే వర్ణనములని నిరుపపదముగనే నేను వ్యవహరింతును కొబట్టి ఏకవచనమున - 'ఆయా లక్షణముగల' అను రూపంతో నొప్పు వాక్యవిభాగమనే వర్ణనమని వ్యవహరింతము

ఒక వస్తువునకు 'ఫలానా' లక్షణము గలదను సంగతి మనకు దెలిసినపుడు ఆ వస్తువు ఉనికి పరోక్షానుభవముచే-అనగా వర్ణనాత్మకజ్ఞానముచే సిద్ధించుచున్నది అనగా ఒక వస్తు వున్నదనియు అట్టి లక్షణముగల మరియొక వస్తువు లేదనియు గ్రహించునపుడు వస్తువు వర్ణనాత్మకజ్ఞానముచే సిద్ధించుచున్నది అనగా అట్టి వస్తువును గూర్చిన జ్ఞానము సూటిగా గలుగదు ఇనుపతొడుగు గలిగిన మనుష్యుడు ఒకప్పుడున్నట్లు మనకు దెలియును అంతియే గాక యతనిని గూర్చి యనేక విషయములను దెల్ప ప్రమేయవాక్య ములు మనకు దెలియును కాని అసలట్టివా డెవ్వడో స్పష్టముగా మనకు దెలియదు ఎక్కువ వోట్లు సంపాదించు అభ్యర్థి ఎన్నుకొందురను సంగతి మనకు దెలియును ఈ సందర్భమున ఒకనికి మరియొకనిని గూర్చి యెట్టిజ్ఞానము గల్గునో అదేవిధముగా - ఎక్కువవోట్లు సంపా దింపనున్న వ్యక్తినిగూర్చి యనుభవము గల్గును కాని ఉన్న అభ్యర్థులలో ఏ ప్రత్యేకవ్యక్తికి ఎక్కువవోట్లు వచ్చునో యెవ్వనికిని తెలియదు ఫలానా Aకు అభ్యర్థులలో నందరకన్న ఎక్కువ వోట్లు వచ్చినవను రూపముతో నొప్పు ప్రమేయ వాక్యమేదియును మన కనుభూతముకాదు, 'ఫలానా' లక్షణముగల వ్యక్తి యొకడు గలడని మనకు దెలిసినప్పటికిని, అట్టి లక్షణముగల వ్యక్తితో మనకు పరిచయ ముండుట సంభవమే

యైనను ఫలానా ఏదు ఫలానా ప్రత్యేకలక్షణము గలదను ప్రమేయ వాక్యము మన కనుభూతము గాదు

'ఫలానా' లక్షణము గల్గిన వస్తువొకటి యున్నదన్న మాటకు, అట్టి లక్షణముగల వస్తువా యొక్కటియే యని యర్థము ఏదు 'ఫలానా' లక్షణము గలదను వాక్యమునకు ఏ అనుదానికా ప్రత్యేకలక్షణము గలదనియు, మరి యితర వస్తువుల కట్టి లక్షణము లేదనియును అని యర్థము ఈ నియోజక వర్గమునకు 'ఎ' అను నతడు యూనియనిస్ట్ అభ్యర్థి అన్నమాట కు ఈ నియోజక వర్గమునకు ఎ, యూనియనిస్ట్ అభ్యర్థి యనియు మరి యితరులెవ్వరును గార నియు నర్థము ఈ నియోజక వర్గమునకు యూని యనిస్ట్ అభ్యర్థి యొకడున్నాడు అన్నమాటకు ఈ నియోజకవర్గమున కెవ్వడో యొకడభ్యర్థి యనియు, మరి యింకెవ్వరునుగారని యర్థము కాబట్టి 'ఫలానా'లక్షణముగల వస్తువును గూర్చిన జ్ఞానము మనకు గల్గినపుడు-ఆ ప్రత్యేకలక్షణము గల వస్తు వున్నదని మనకుదెలియును 'ఫలానా' లక్షణముతో గూడినట్లు మన కెరుకపడు నెట్టి వస్తువును గూర్చియైనను మనకు జ్ఞానము గల్గు నపుడు, యథార్థముగ నట్టి లక్షణముగల వస్తు వును గూర్చిన జ్ఞానము మనకు గలుగనపుడు, ఫలానా వస్తు వున్నదని మనకు తెలియుటకు వీలుగలదు

నిజము చెప్పవలెనన్న జాతివాచక శబ్దము లును, ఒక్కొక్కప్పుడు సంజ్ఞావాచక శబ్దము లును సామాన్యముగ వర్ణణ ప్రధానముగ నుం డును అనగా ఒక సంజ్ఞావాచక శబ్దమును ప్రయోగించు వ్యక్తి మనస్సులోని యాలోచన మును-అనేక వాక్యములలోవిపులముగా వర్ణించి వ్యక్తము చేయవచ్చును అంతియకాక, ఆ యాలోచనమును వ్యక్తము చేయుటకు నావశ్య కమగు వర్ణనము అనేకుల దృష్ట్యా అనేక తీరు లుగను, ఒక వ్యక్తికే వేర్వేరు కాలములలో వేర్వేరు రీతులుగను ఉండును, పేరును సవ్య ముగా వినియోగించువరకును నిత్యమైన వస్తువా పేరు అన్వయించువస్తువే ఇది చెక్కుచెదరనంత వరకును ఆ పేరుగలిగిన వాక్యము తప్పైనను, ఒప్పైనను - అంత పట్టింపులేదు

ఈ విషయమున కొన్ని యుదాహరణములను పరిశీలింతము బిస్మార్కు విషయమై యొక మాటను దీసికొందము ఒక వ్యక్తికి తనను గూర్చిన యనుభవము తనకే గల్గుట కవకాశ మున్నదని యనుకొందము. అట్టి స్థితిలో బిస్మార్కే, తన పేరును వ్యవహరించునపుడు- తననుగురించి తానెట్లవగాహనము చేసికొనెనో- ఆ అనుభవ విశేషమునే - తానుపయోగించిన మాటద్వారా ఇతరులకు వ్యక్తము సేయనెం చును. అట్టి స్థితిలో తన్నుగురించిన నిశ్చితాభి ప్రాయము తన కొకటియున్నచో, దాని నాతడు వ్యక్తము చేసినచో - తానే తన నిర్ణయమున భాగమై యుండును ఇక్కడ సంజ్ఞావాచక శబ్దము - ఒక ప్రత్యేకమైన అర్థమునకు విషయ మగు వస్తువునో వ్యక్తినో ఉద్దేశించి ప్రయోగింప బడినది అంతేగాని ఇచ్చట ఆ వస్తువు వర్ణన మంత ప్రధానముగాదు కాని బిస్మార్కును గురించి తెలిసిన యింకొక వ్యక్తి యతనిని గురించియొక యభిప్రాయమును చెప్పినచో పరి స్థితి వేరుగా నుండును. బిస్మార్కునుగురించి ఆ వ్యక్తికి గల్గిన యనుభవము - బిస్మార్కు శరీరముతో సంబంధమైన కొన్ని యింద్రియార్థ ములను పురస్కరించుకొనియేర్పడినది. బిస్మార్కు శరీరము, అతని మనస్సు - ఈ రెండును నా వ్యక్తి యింద్రియార్థములలో జతబడినప్పుడే ఆ వ్యక్తికి అవగాహనమగుటకు నవకాశము గలు గును అనగా నవి పరోక్షానుభవమువలన జ్ఞాత మగుచున్నవి బిస్మార్కును గురించి యాలోచన చేయునపు డాతని స్నేహితుని మనస్సులో నేయే లక్షణములు పొడగట్టునో అన్నవిషయము గ్రుడ్డి వాని చేతిరాయి కావున ఉన్నవస్తువొకటె యైనను, దాని కనేక వర్ణనలన్వయింపవచ్చునని యును, అసలు వస్తువును గూర్చి సాక్షాదనుభ వము గల్గుట యనునది జరుగునది కాదనియు ననునది ప్రధానమైన విషయము

బిస్మార్కును ఎరుగని మన మాయనను గురించి యొకయభిప్రాయమును వ్యక్తముచేయు నపుడు - అతనిని గురించి మన మనస్సులలో స్ఫురించునది యొక అస్పష్టమైన చారిత్రక జ్ఞాన రాశియే, ఉదాహరణకు బిస్మార్కు అను నతడు జర్మన్ సామ్రాజ్యమునకు ప్రథమ వ్యవస్థాప కునిగా భావింతము. ఇచ్చటజర్మన్ అను పదము తప్ప తక్కిన పదములన్నియు నస్పష్టముగనే యున్నవి ఈ 'జర్మన్' అనుపదముగూడ వేర్వేరు పురకు, వేర్వేరర్థముల నిచ్చును కొం దరకామాట వినగానే జర్మనీలోని ప్రయాణ ములు జ్ఞాపకము వచ్చును కొందరకు ప్రపంచ పటములోని జర్మనీ గుర్తుకు వచ్చును.

కాని అన్వయయోగ్యమైనదిగ మనకు జ్ఞాత మగు వర్ణనమే మనకు గావలసినచో మనకు ననుభవసిద్ధమైన యొక ప్రత్యేక లక్షణమును (Particular) విధిగా వ్యవహరింపవలసి యుండును. ఫలానా తేదీలలో అని స్పష్టముగా గాక గతమునగాని వర్తమానమునగాని భవిష్యమునగాని ఈ ప్రదేశమునగాని ఇంకొక ప్రదేశమునగాని, జరిగిన ఏసంఘటనగూర్చి చెప్పవలసినను, ఇతరులు మనకు చెప్పినదానిని గూర్చి చెప్పవలసినను, ఆ సంఘటనకు సంబంధించి మనకు నవగాహన మగుటకు యోగ్యమగు విశేష లక్షణము ననుభవమునకు దెచ్చుకొన్న సంగతిని నిర్దేశించుట యనునది యుండవలయును కావున వర్ణితమైన వస్తువునుగూర్చి మనకు గలుగు జ్ఞానము కేవలము పరోక్షానుభవజన్యము కాకుండ నుండవలెనన్న, ఒకప్రత్యేక వస్తువునకుగాని వ్యక్తికిగాని అన్వయించుటకుయోగ్యమైనట్లు విదితమగువర్ణనమున మనకు ననుభూతమైన యొక విశేష లక్షణమును గూర్చి నిర్దేశింపబడవలయును ఉదాహరణమునకు 'మనుష్యులలో మిపుల దీర్ఘాయువు' అను వర్ణనలో నెక్కువ సామాన్యములే(Universals) కలవు ఇచ్చట సామాన్యము లనగా జాతివాచక శబ్దము లన్న మాట ఇవి ఎవరో ఒకానొక వ్యక్తికి నన్వయింపవలయును కాని యీ వ్యక్తినిగూర్చి యిదమిత్థమను నిర్ణయము నొనరింపలేము ఏలన వ్యక్తినిగూర్చి మనకు ఒక స్పష్టమైన యభిప్రాయమును వ్యక్తము చేయవలయుననిన కేవలము వర్ణనమునుబట్టి మనకు గల్గిన జ్ఞానము చాలదు. మరి వానినిగూర్చిన ప్రత్యేకమైన జ్ఞానము ఉండవలయును అట్లుకాక జర్మన్ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఒకగడిదేరిన రాజతంత్రజ్ఞుడని మనము చెప్పవలయునన్న, ఈ యభిప్రాయములోని సత్యాసత్యములు మనకు ననుభూతమైన దానిని బట్టిగాని, ఆప్తవాక్యమును (విన్నది గావచ్చును, ఇంకొక గ్రంథమున చూచినది గావచ్చును) బట్టిగాని స్పష్టముగా దెలిసికొనవచ్చును బిస్మార్కును గురించి మనమితరులకు తెలియజేయు విషయముల నటుంచి, ఆయననుగూర్చి మనకు గల్గిన యభిప్రాయమునకు ప్రాముఖ్యమును చేకూర్చు-అసలు బిస్మార్కును గురించిన విషయము నటుంచి, అయనను గురించి మనకుగల్గు నాలోచనలలో కొన్ని విశేషము లిమిడి యుండవలెను లేనిచో బిస్మార్కును గురించి 'కొన్ని భావముల సంఘాతముదప్పమరియేమియు మనకు జ్ఞాతమగుటకు వీలులేదు. దేశవాచక శబ్దములన్నింటికోసు మనకు ననుభూతములగు కొన్ని విశేషములనుండి బయలుదేరు వర్ణనము లిమిడియుండును తత్త్వశాస్త్రము భావించినట్లుగా-ఈ జగత్తుగూడ ప్రత్యేకానుభవములను (విశేషములను) పురస్కరించుకొనియే భావనయోగ్య మగుచున్నదని నా యనుమానము కాని ఉన్నదానిని గూర్చియేగాక, ఉండుటకు నవకాశము గల్గిన దానినిగూర్చి గూడ ప్రతిపాదించు తర్కశాస్త్రమునగూడ, ఈ విశేషములనుగూర్చి పేర్కొనుట యనునది కన్పింపదు.

విశేషములను గూర్చి మనకు గలుగు ననుభవమును తొలగించుకొనుటలో విభిన్న దశలు గలవు తొలుత, బిస్మార్కును ఎరిగిన ప్రజల దృష్టిలో బిస్మార్కు గలడు చరిత్రద్వారా అతనిని ఎరిగినవారికి గూడ బిస్మార్కు గలడు అతడినుపకవచమును దాల్చినవాడనియును, అతడు మనుష్యులలో మిపుల దీర్ఘాయువనియును చరిత్ర ప్రసిద్ధములైన విషయములు వీనిలో నొక్కొక్కటియును విశేషములను గూర్చిన అనుభవములనుండి క్రమముగా తొలగింపబడుచున్నవి, మొదట, ఒక వ్యక్తికి ఇంకొక వ్యక్తిలో నెట్టి పరిచయము గలదో అట్టి పరిచయము బిస్మార్కుతో నాతని సమకాలికుల కుండును. రెండవ దశలో బిస్మార్కు ఎట్టివాడో మనకు దెలియవచ్చును మూడవ దశలో అతడు ఇనుప కవచమును దాల్చెనన్న విషయమునుబట్టి ఏమాత్రమును తార్కికముగా సిద్ధించుటకు వీలులేని సంగతులను దెలుపు అనేక వాక్యములను గ్రహింపగలము. నాల్గవదశలో మనుష్యుని నిర్వచనమునుబట్టి తార్కికముగా నెంతవరకును సిద్ధించుటకు వీలున్నదో అంతకుమించి మనకేమియును తెలియదు సామాన్యముల ప్రపంచమున గూడ (Region of universals) నిట్టి క్రమవిధానమే గలదు అనేక విశేషములవలెనే,అనేక సామాన్యములుగూడ మనకు వర్ణనమువలననే సిద్ధించుచున్నవి కాని ఇచట, విశేషములకు వలెనే, వర్ణనముచే- పరోక్షానుభవముచే సిద్ధించు జ్ఞానమునుగూడ చివరిదశలో ప్రత్యక్షానుభవజన్యమగు జ్ఞానముగా మార్చుటకు వీలుగలదు

వర్ణనలుగల వాక్యవిభజనములో నిమిడియున్న ముఖ్యసిద్ధాంత మిది, మనకు నర్థముగాగల ప్రతివాక్యము మనకు ననుభూతములగు విషయములతో పూర్తిగా నిండియుండవలెను.

కేవలము వర్ణనము జ్ఞాతమగు వస్తువునుగురించి మనమేమైన చెప్పునపుడు మనము చెప్పద

లచుకొన్న వాక్యమును వర్ణనాత్మకమైన రూపమునగాక, వర్ణితమైన అసలు వస్తువును గూర్చి సాక్షాత్తుగ తెలియజేయు విధముగా వ్యక్తము చేయవలెను అనగా మనము బిస్మార్క్‌నుగురించియేమైన చెప్పునపుడు, బిస్మార్క్ తనను గురించి యెట్టి స్పష్టమైన యభిప్రాయమును వ్యక్తము చేయవలెనని యెంచునో ఆ యభిప్రాయమునే వ్యక్తము చేయవలయునని మనకుగూడ ననిపించును ఈ విషయమున మనమోడిపోయితిమనియే చెప్పవలయును ఏలన అసలు బిస్మార్క్‌ను గురించి మనకు సాక్షాత్తుగ తెలియ వీలు లేదు బిస్మార్క్ అని మనము వ్యవహరించెడి B అనువ్యక్తి యొకడు గలడనియును, ఆ B అను వ్యక్తి కాకలుదేరిన రాజ్యతంత్రజ్ఞు డనియును మనకు దెలియును బిస్మార్క్‌ను జర్మన్ సామ్రాజ్యమునకు మొదటి ఛాన్స్‌లర్‌గా వర్ణించుచున్నచో మనము చెప్పదలచుకొనిన వాక్యము, జర్మన్ సామ్రాజ్యమునకు మొదటి ఛాన్స్‌లర్ అని చెప్పబడెడి అసలు బిస్మార్క్‌ను గురించి పైపేరున వ్యవహరింపబడెడి వ్యక్తి కాకలుదేరిన రాజ్యతంత్రజ్ఞుడను విషయమును నిర్ధారణచేయు వాక్యమై యుండవలయును మనమెన్ని వేర్వేరు వర్ణనలద్వారా వ్యక్తము చేసినను, మనము చెప్పదలచుకొనిన సంగతియిది అది-అసలు బిస్మార్క్‌ను గురించి యొకవాక్యము గలదనియును, వర్ణన ఎంతమార్చి చెప్పినను, వర్ణితమైనవాక్యము ఒకేతీరున ఉండును, వర్ణనమువలన సిద్ధించునదై సత్యమైనదిగా విదితమగు నీ ప్రమేయవాక్యమే (Proposition) మనకభిలాష గొల్పును, అసలు ప్రమేయవాక్యముగూర్చి మనకు స్వరూపతః అనుభవము కలుగదు అది సత్యమని తెలిసినను, దానిని మనమెరుగము

ఇట్టి పరిస్థితిలో నీ ప్రధాన సూత్రమునకు ప్రతికూలముగ బయలుదేరదీయుటకు వీలైన యుపపత్తు లన్నిటికిని సమాధానముఁ జెప్ప ప్రయత్నింపము ప్రస్తుత మేదోయొక విధముగ నీ విప్రతిపత్తులకు సమాధానము చెప్పుట సాధ్యమేయని చెప్పిన చాలును,మనము దేనినిగురించి నిర్ణయము చేయుచున్నామో దేనినిగూర్చి అభ్యూహ సల్పుచున్నామో తెలిసికొనకుండ ఒకనిర్ణయము నొనర్చుటగాని యొక్క యభ్యూహ చేయుటగాని జరుగునదిగాదు మనము మాట్లాడుమాట లర్థవంతముగా నుండవలెనన్న, అది కేవలము రొదకాకుండ నుండవలెనన్న, మనము మాట్లాడుమాటలకర్థమును సమకూర్పవలెను మనము సమకూర్చు నర్థము మనకు సుపరిచితమై యుండవలెను ఉదాహరణకు మనము జూలియస్ సీజరును గురించిన వాక్యము నొకదానిని ఉచ్చరించునపుడుగాని వ్రాయనపుడుగాని సాక్షాత్తుగ జూలియస్ సీజరే మనమనోనేత్రము నెదుట గోచరించుటలేదని మనకుఁ దెలియును, ఏలన నాయనను గూర్చి స్వరూపతః మనకేమియును దెలియదు జూలియస్ సీజరును గూర్చిన వర్ణనము మాత్రము మనమనస్సులో మెదులును Ides of March లో హత్యచేయబడిన వ్యక్తి-రోమన్ సామ్రాజ్య స్థాపకుడు-జూలియస్ సీజర్ అని వ్యవహరింపబడెడి వ్యక్తి-అను నీ విషయములన్నియు జూలియస్ సీజర్ అనుపేరు నుచ్చరించగానే తలపునఁ వచ్చును ఈ చివరి వర్ణనమునుబట్టి,సీజర్ అనగా మనకు అనుభవగోచరమగు ఒకానొక ఆకృతి - ఒకానొక ధ్వని, కావున మనము చెప్పుదాని కెట్టి యర్థమున్నట్లు గన్పడుచున్నదో ఆ యర్థము నిజముగా దానికిలేదని కొంతపరిశీలన చేసిన తెలియుచున్నది కాని జూలియస్ సీజరుకు బదులు మనకు పరిచితమైన-ఆతనిని గూర్చిన సామాన్య విశేషములలో గూడుకొనిన వ్యక్తిని గురించిన వర్ణనము జ్ఞాతమగును,

వర్ణనాత్మక జ్ఞానముయొక్క ప్రాధాన్యము-మన వర్ణనాత్మక జ్ఞానసంబంధియగు పరిధ నతిక్రమించుటకుఁ దగిన యవకాశము నొసంగుటలోఁ గలదు మనకు అనుభవముద్వారా అవగతములైన పదములతోగూడిన యధార్థ విషయమున్ను మనమెఱుగ గల్గినప్పటికిని, మనకింతవరకును కాని దానినిగూర్చి వర్ణనద్వారా కొంత జ్ఞానము గలుగుట కవకాశముఁ గలదు మనకు సమనంతరముగ గల్గు ననుభవ పరిధి పరిమితమై యుండుటచే నీ విషయమునకుగల విశేష ప్రాముఖ్యము గమనింపఁదగినది ఇది యవగాహము కానిచో మనకుగల్గు జ్ఞానములో నధిక భాగము గహనమై, సంశయాస్పద మైపోయెడిది

ఒకే బాట

శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారి

విదేశపరిపాలనపై గాంధీజీ నడిపిన స్వాతంత్ర్య సమరానికి ధోరే ప్రతిపాదించిన అహింసాత్మక నిరాకరణ సూత్రం ప్రాతిపదిక. అలాగే ఈనాడు సంక్షేమ సాంఘిక వ్యవస్థా నిర్మాణంలో ఎదుర్కొనబడుతున్న అనేక సమస్యలను పరిష్కరించుటకు ప్రధాన ప్రాతిపదిక వ్యక్తి, వ్యక్తిపట్ల నిర్వర్తించవలసిన దయాధర్మం. వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఈ అనుబంధం ఏర్పడినప్పుడే దృఢమైన సాంఘిక వ్యవస్థను నిర్మించడం సాధ్యమవుతుంది. గాంధీజీ పిలుపు విని ఆనాడు ప్రతివ్యక్తీ శాసనోల్లంఘనోద్యమంలో ప్రవేశించాడు. పరపాలన తరలిపోయింది. భారత దేశానికి విముక్తి లభించింది. భారతదేశం దాస్యశృంఖలాల నుంచి ముక్తిపొంది స్వస్వరూపాన్ని సాక్షాత్కరించుకున్నది ఉపనిషత్తులలోను, గీతలలోను ప్రతిపాదించబడిన దయాధర్మాన్ని గాంధీజీ నిర్వచించిన రీతిగా ప్రతివ్యక్తీ అనుసరించి ఆచరించినప్పుడే వ్యక్తిస్వాతంత్ర్యం లభ్యమవుతుంది. నియంతృత్వ భయం తొలగిపోతుంది. మార్క్సు వాదానికి గాంధీజీ సమాధానంకూడా ఇదే.

ఈ దయాధర్మానికి పునాది మతం. 'ఆత్మవత్సర్వ భూతాని', అన్న మహా వాక్యమే ఇందుకు మూలం, ఏ వ్యక్తికి ఆవ్యక్తి తెలుసుకోవలసిన విషయం ఇది,

పశ్చిమదేశాల నాగరికతా ప్రభావం వల్లను, భౌతిక విజ్ఞానం ప్రబలడం వల్లను భారతదేశంలో మతం అన్నది పూర్తిగా అడుగంటిపోయింది. లేనిపోని అనుమానాలు, సంశయాలు, సందేహాలు అడ్డుపడి విశ్వాసాన్ని పూర్తిగా మరుగుపరిచినప్పుడు కేవలం అర్చనా విధానాలూ, పూజాపునస్కారాలూ మతానికి జీవం పోయలేవు. పశ్చిమ దేశాల నాగరికతా ప్రభావానికి లొంగిన పై వర్గాల వారిలో మతవిశ్వాసం పూర్తిగా నశించినప్పటికి మొత్తం భారతావనిలో మతానికి పుట్టగతులు లేకుండాపోయినవని చెప్పలేము. విజ్ఞాన సంపన్నులూ, సంఘనాయకులూ ఆత్మపరిశోధన కావించుకుని శోషిల్లిన అంతరాత్మలను పునరుజ్జీవింప చేసుకున్నట్లయితే తిరిగి మతం నూతన జీవంతో అవతరించే అవకాశం ఉన్నది. పూర్వర్షుల బోధలు తిరిగి చివురిస్తాయి. సంఘనాయకులే ఇందుకు పూనుకోవాలి. దయాధర్మం చుక్కానిగా జీవననౌక యానం సాగిస్తుంది. భారతదేశం తిరిగి యావత్ప్రపంచానికీ ఆశాజ్యోతిగా వెలుగుతుంది.

మార్క్సిజం ఒక్కటే ముక్తిమార్గమని కమ్యూనిస్టుల వాదన. కాని ఈ వాదన కేవలం నిరాధారమైనది. మార్క్సిస్ట్ జీవన వ్యవస్థా నిర్మాణానికి జరిగిన రక్తపాతాన్ని మానవత్వాన్ని గౌరవించే మనం అంగీకరించం. ప్రభుత్వంచేతిలో వ్యక్తి కీలుబొమ్మ కావడాన్ని కూడా మనం అంగీకరించం. వ్యక్తి ఒక్కడే వ్యక్త సత్యం. ప్రభుత్వం ఒక అదృశ్య వ్యవస్థ. వ్యక్తి రూపురేఖలు లేకుండా చెరిగిపోతే సంఘం యావత్తూ చెరిగిపోయినట్లే.

ఈ విషమ వ్యూహాన్ని ఛేదించడానికి మరొక మార్గాంతరం ఉన్నదని అంటారు సోషలిస్టులు.

'మార్క్సిజాన్ని తిరస్కరిస్తే తిరస్కరించారు. మా సమాజ వాదాన్ని అంగీకరించండి. అన్ని సమస్యలూ పరిష్కరించబడతాయి' - అని వీరివాదన. కాని సమాజవాదం అంటేపమిటి? ఒక్క ముక్కలో సులువుగా చెప్పాలంటే ప్రభుత్వంయొక్క అజమాయిషీయే సమాజవాదం. మార్క్సిజాన్ని అనుసరించడం వల్ల వ్యక్తి నామరూపాలు లేకుండా నశించినట్లే సమాజ వాదాన్ని అనుసరించడంవల్లకూడా వ్యక్తి నశించిపోతాడు. సమాజవాదమూ మార్క్సిజమూ వేరు వేరు వాదాలని అనుకొనడం పొరబాటు. కమ్యూనిజాన్ని స్థాపించడానికి హింస అవసరం కావడంవల్లనూ సమాజవాదాన్ని స్థాపించడానికి హింస అనవసరం కావడంవల్లనూ, ఈరెండు వాదాలు ఫలితాంశంలో వేరైనవని భావించకూడదు. ఒకవ్యక్తిని బలాత్కారంగా చంపనూ వచ్చు. లేక ఆవ్యక్తి తనంతతాను కోరి చావనూవచ్చు. కాని ఫలితాంశంలో మటుకు చావు తప్పడంలేదు. హత్య అయినా ఆత్మహత్య అయినా, ఈరెండూ మరణంయొక్క వేరువేరు స్వరూపాలే. వ్యక్తిస్వాతంత్ర్యానికి భంగం కలగకుండా వ్యక్తి శ్రేయస్సును పరిపూర్ణంగా కాపాడవలెనంటే అందుకుమార్గం మతం ఒక్కటే. అనాదినుంచి మతం దయాధర్మాన్ని ఉపదేశిస్తూ ఉన్నది. ఈ ధర్మపదాన్ని అనుసరిస్తేనే వ్యక్తి శ్రేయస్సు సురక్షితంగా ఉంటుంది, ఒకరి కష్టసుఖాలలో మరొకరు పాలు పంచుకొనడంవల్ల అందరికీ సుఖం దక్కుతుంది, ఒక నిర్జీవ రాక్షస యంత్రానికి వ్యక్తి ఆత్మబలిదానం చెయ్యవలసిన అవసరం ఉండదు. శిశువును ప్రసవించడంకోసం కన్నతల్లి చనిపోవలసిన అవసరంలేదు. తల్లి తాను బ్రతికి పిల్లను కంటుంది. పిల్లను పెంచి పెద్ద చేస్తుంది. పిల్లకొరకు తల్లి తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడంలేదు. ఈ విధంగానే సమిష్టిసుఖం కొరకు వ్యక్తి అనుక్షణం జననమరణ పరిణామం పొందుతూ ఉంటాడు. నిత్యం పునర్జన్మ పొందుతూ ఉంటాడు. దయాధర్మం వ్యవస్థకు ప్రాతిపదిక అయినప్పుడు వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండానే సమిష్టి సుఖం కొరకు కృషిచేసే అవకాశం ఉన్నది.దయాధర్మం మానవునికి భగవత్ప్రసాదితమైన వరం, పొరుగువాని కష్టం తనదిగా భావించి ఆ కష్టాన్ని నివారించడంలో తాను ఒక ఆనందానుభూతిని పొందడమే దయాధర్మం. ఈధర్మం ఒక్కటే సంఘ వ్యవస్థకు పెట్టని కోట. సమాజవాదాన్ని హింసద్వారా స్థాపించినాఅహింసద్వారా స్థాపించినా ఫలితాంశం ఒకటే. మానవ వ్యక్తిని కబళించే ఒకభూతాన్ని తయారు చెయ్యడమే ఈ ఫలితం. భారత ప్రభుత్వం ఈనాడు ప్రచారం చేస్తున్న సమాజవాద దృష్టి ఆచరణలోకి వచ్చినప్పటికి జరుగనున్న ఫలితం ఇదే. సర్వవిధాలా, శాయశక్తులా కృషిచేసి భారత ప్రభుత్వం ఈ సమాజవాదవ్యవస్థే కనుకనిర్మించినట్లయితే, వ్యక్తి రూపురేఖలు లేకుండా నశిస్తాడు.

వ్యక్తినీ, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని నిర్మూలించకుండా, సమాజ వాదాన్ని

స్థాపించిన సోషలిస్ట్ రాజ్యం అవనిలో ఎక్కడా లేదు. అలా ఉండగలగడానికి అవకాశం కూడా లేదు.

కాబట్టి ఈనాడు నాగరికత మార్క్సిజంఅనే విపత్తునుంచి తప్పించుకోడానికి ఒకేఒక గత్యంతరం ఉన్నది. ఈ మార్గానికి మార్క్సిజానికి స్వరూప స్వభావాలలో మాత్రమేకాక ప్రాతిపదికలోనే వ్యత్యాసం ఉన్నది గాంధీజీ నిర్దేశించిన ధర్మకర్తృత్వసిద్ధాంతాచరణమేఈమార్గం శ్రీమంతులు పేదలకు ధర్మకర్తలుగా ఉంటూ మనోవాక్కాయ కర్మలద్వారా సాంఘిక శ్రేయస్సు కొరకు కృషి కావించాలని గాంధీజీ నిర్దేశించాడు ఈ నిర్దేశాన్ని అనుసరిస్తే సాంఘిక వ్యవస్థకు శ్రేయస్సు చేకూరుతుంది. గాంధీజీ ఈ క్రిందివిధంగా ఈ సిద్ధాంతాన్ని విపులీకరించాడు. "శ్రీమంతులు తమ అదనపు ధనానికి ధర్మకర్తలుగా మాత్రమే వ్యవహరించాలి. కానీ ఇది ఎలా సాధ్యమని మీరు ప్రశ్నించవచ్చు. అహింసామార్గం ద్వారా ఈ విషయాన్ని సాధించవలెనా లేక శ్రీమంతుల ఆస్తిని బలాత్కారంగా గైకొనవలెనా అని ప్రశ్నించవచ్చు. హింసద్వారా ఈ విషయాన్ని సాధించినట్లయితే సంఘానికి ముప్పు ఉన్నది సంపదను కూడబెట్టడంలో శ్రీమంతుని ప్రత్యేక చాకచక్యాన్ని అర్థం చేసుకునే అవకాశం లేకుండాపోతుంది అందుచేత అహింసా మార్గమే ఉత్తమమైనది. శ్రీమంతుడు తన అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన అదనపు సంపదకు ధర్మకర్తగా మాత్రమే వ్యవహరిస్తూ సంఘసేవ చెయ్యాలి. ప్రస్తుత పరిస్థితులలో ఇంతకన్న ఎక్కువ ఆశించడం బంగారు గుడ్లు పెట్టే బాతును చంపడంవలె అవివేక కార్యం కాగలదు."

గాంధీజీ నిర్దేశం అని మాత్రమేకాక ప్రస్తుత పరిస్థితులలో జీవితానికి అన్వయించడానికి ఎంతో సులువైన మార్గం ఇది. మనజాతి సనాతనధర్మం ఇది.

శ్రీమంతుల ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించడంలో గాంధీజీ ఉద్దేశాన్ని మనం అపార్థం చేసుకోరాదు. శ్రీమంతులకు సర్వస్వాతంత్ర్యాన్ని ఇవ్వాలనికాదు గాంధీజీ అభిప్రాయం ఏస్వరూపంలో జీవన వ్యవస్థను రూపొందించాలని మనం లక్షించినప్పటికి, ఆ జీవన వ్యవస్థను రూపొందించడానికి హింసా సాధనాన్ని ఉపయోగించినట్లయితే ఆ జీవన వ్యవస్థ ఒక కారాగారంగా రూపొందడం తప్పదు. ముఖ్యంగా మనం పరిష్కరించుకోవలసిన ప్రశ్న ఇది 'ఒక నూతన జీవన వ్యవస్థను రూపొందించడం మనలక్ష్యమా? లేక ఒక కారాగారాన్ని కూలద్రోసి ఆ స్థానే మరో కారాగారాన్ని కట్టడం మన లక్ష్యమా?' అని ఈ ప్రశ్నకు మనం సూటిగా సమాధానం చెప్పుకోగలిగినట్లయితే మనలక్ష్యం మనకు స్పష్టంగా అవగతం కాగలదు.

'భగవంతుడు మానవునికి ప్రసాదించిన గుణగణాలన్నింటిలోకి దయాగుణం ఉత్తమమైనది. పొరుగువాని కష్టం మనదిగా భావించిపొరుగువానికి తోడుపడడంకన్న గొప్పనీతి మరొకటి లేదు కేవలం కృత్రిమసహకారంవల్ల మానవ సంఘం ఉత్పన్నంకాదు. ఆదరం అనురాగం మనిషి మనిషిని పెనవేశినంతగా కృత్రిమ సహ

కారం మనిషినీ మనిషినీ పెనవెయ్యదు. అప్పుడు మనిషి ఒక మహాయంత్రంలో మరలాకాక, ఒకవ్యక్తిగా ఒక నిర్దిష్ట లక్ష్యంతో పరిపూర్ణ జీవనాన్ని జీవించడానికి అవకాశం ఉంటుంది.

ఈబాట లక్ష్యానికి చేరువగా ఉన్నట్లు కనుపించకపోవచ్చు. ఎంతో దూరం ఎంతో ఆయాసంతో యాత్ర చెయ్యవలెనే అన్న సందేహంకూడా కలగవచ్చు. కాని సురక్షితంగా సుగమంగా అవధిని చేర్చ గలబాట ఇది ఒకటే. యుగయుగాల నుంచి మన జాతి అనుసరిస్తూ వచ్చిన ధర్మంయొక్క మూలసూత్రాలను పునరుజ్జీవింపచేసి సాంఘిక పరిణామానికి అన్వయించడమే ఈనాటి మన కర్తవ్యం. ఇదే మనం సృష్టించే విప్లవ స్వరూపం.

['స్వరాజ్య' కు కృతజ్ఞతతో]

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[మహాభూత వివేక ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యా శాస్త్రి

౩

ఆకసమ్ము గన్పడుచుండు నందువేని
కాంతియో చీకటియొ లేక కానఁబడునె?
నీదు వాదముం బట్టియునేని యెందు
నాకసమ్ము ప్రత్యక్షమైనదియుఁ గాదు,
చీకటియొ కాంతియో నింగిఁ జేరియుండు
అందుననె కన్పడును నింగి, అందుచేత
నాకసమును నిరవయువ మనఁగఁ బడును.

సత్పదార్థము జ్ఞాన నిశ్చయము గల్గు
మావలనఁ జూడబడెడు సమాధియందు
శూన్యమను బుద్ధిలేమిచే శూన్యమెప్పు
డనుభవంబున మాకెంగుఁ గనఁగరాదు.

అనుభవమున బ్రహ్మమ్ము లేదందువేని
స్వప్రకాశుండు లేడన్నఁ జనునుగాక,
మౌనమందుండి మౌనమున్ మానినపుడు
ఇంతకునుముందు మౌనమందేను నుంటి
నని స్మరించుచో నా మౌనమును నెఱుంగు
సాక్షి యొకఁడుండవలదె, యాసాక్షి యొకఁడె
తత్పరబ్రహ్మమంచు డెందమున నెంచు
తనదు సంకల్ప హీనత తనకుఁ దెలియు

మానసపు విజృంభణమేమి లేనియపుడు
సాక్షియగు నాత్మ యెట్లు నిరాకులంబో
మాయచే జగంబు సృజింపఁబడిన యపుడు
అమలమైన బ్రహ్మంబు నిరాకులంబు
భ్రాంతియే విజృంభణకు కారణము చూవె
కానఁబడు పదార్థమునందుఁగల వికార
ములు కనెడు వానియందునఁగలుగు నొక్కొ,
స్తంభమది భగ్నమైనచో దానిఁజూచు
కన్నునకుఁగూడ భంగము గలుగునొక్కొ ?
త్రాడు గన్గొని పామని తలఁచు మనసు
నందు గలదోస మాత్రాటియందు లేదు.

అగ్నికింగాల్చు శక్తి యున్నట్లుగానె
సత్పదార్థమునకు మాయశక్తి గలదు,
కార్యమునకంటె నెవ్వఁ డెక్కుడనుగాని
కారణపు శక్తి నొండెఱుఁగంగ లేదు

సత్తునకు సత్పదార్థంబు శక్తి గాదు,
అగ్ని తనకుఁదానే శక్తియగుట కలదె?
సత్పదార్థముకంటె నాశక్తి భిన్న
మైనచో నది శూన్యమేయగును గాదె?
(రూపమును లేని వస్తువిందే పగిదిగ
నుండు ననఁగ నాశ్చర్యమైయుండు నిజ
మాయఁగూర్చి విచారణఁ జేయునపుడు
తద్విధంబుగ మనమునఁ దలఁప రాదు).

మాయయే శూన్యమైనచో, మాయచేత
నావహిల్లు జగమ్ము శూన్యమ్ము కాదె?
అందుచేతను మాయ శూన్యంబు కాదు
సత్పదార్థముంగాదు, నిశ్చయము సుమ్ము
అది యనిర్వచనీయమైనదియ యగును.

సృష్టికిని బూర్వమందున నిట్టి మాయ
సత్తుగాలేదు, లేదు నసత్తుగాను
సత్పదార్థ యోగంబుచే సత్తె యగును
సన్నిషేధంబుచేత నసత్తె యగును
ఇవ్విధంబుగ శ్రుతిసతియే వచించె.

అందుచే ననిర్వచనీయమైన మాయ
బ్రహ్మమునకు భిన్నముగఁ జెప్పఁగఁబడదు
చైత్రుఁడను వానికిని వానిశక్తికేని
నెందు భిన్నముగా లిఖియింపఁ బడునె?

(అట్లయిన తానె తనశక్తియందు వేమొ
భేదమున్నను నదియొక భేదముగను

పరిగణింపగ రాదను భావ మగును
(త్రాడునకు సర్పమునకు భేదంబులేదె?)

శక్తి యధికమైన కొలఁది శక్తిమంతు
జీవితము వృద్ధియగునని చెప్పెదేమొ;
అచట నభివృద్ధిఁ జెందెడు నదియు శక్తి
గాదు, కార్యమౌ కృష్యాదికంబు చూవె

అట్లె శక్తికి శక్తిగలట్టి వాని
కేమి భేదములే, దున్న నేకమె యగు,
సృష్టిముందు మాయాకార్యమేమి లేదు
అన్యమెటులుండు?నున్నది యాత్మయొకఁడె.

అవనియం దంతకుండ యౌనట్టి శక్తి
యుండకయె బంకమట్టియం దుండునట్లు,
అఖిల బ్రహ్మమునందు మాయయును లేక
ఆత్మయం దేకదేశమం దదియు నుండు

ఆత్మయొక్క చతుర్థాంశ మఖిల జగము
తక్కు భాగత్రయము సత్పదార్థమె యగు
ఆ చతుర్థాంశమే మాయయంచు, మాయ
కేకదేశత్వమే వచియించె శ్రుతియు

ఏను నీ సమస్త జగాన నేకభాగ
మునను మాత్రమె వ్యాపించితినని, ఈ జ
గంబు నీశ్వరు నొక్క భాగమున నుండె
ననియు నర్జునుతోఁ గృష్ణుఁడనియె మున్ను.

ఆ పరబ్రహ్మ మఖిలము నావరించి
అంతమును లేని పరిమాణ మగుచునుండె,
ఏ వికారంబులును లేక యెసఁగు ననుచు
సూత్రకారుండు శ్రుతి వచించుచును నుండె.

అవయవంబులు లేనట్టి యాత్మయందు
నేకదేశ మందున మాయ యెట్టులుండు?
నందువేనియు నయ్యవయవము లుండు
శిష్యునకు సుఖబోధకై చెప్పె నిట్లు
నఖిలమును భ్రాంతి యనునది మరువకు
ముండినది యాత్మయొకఁడని యుండు
మెపుడు.

గోడయందున్న వర్ణముల్ గోడయందు
పలు విచిత్రాలఁ గన్పించు పగిది గాగ
సత్పదాశ్రితమౌ మాయశక్తి పలు వి
ధాల బ్రహ్మమందునఁ గల్పనాలఁ జేయు.

ఆదియైన యాత్మవికార మాకసంబు
అదియు రూపము కల్మిగలట్టి దగును,
ఆకసము కలదనెడుచో నాకసమును
ననుసరించును నస్తిత్వ మనెడునదియు.

బ్రహ్మ మేక స్వభావానఁ బరగుచుండు
సత్త, యవకాశమును నాకసమున నుండు
ఆత్మయందున నవకాశ మనుచు లేదు
ఆకసమ్మ నందునఁ దద్ద్వయంబునుండు.

శబ్దగుణమన్న యది యాకసమునను౦డు
ఏ గుణము సత్పదార్థమం దేమిలేదు,
శబ్దమును గల్మియును నాకసమున నుండు
ఆకసము ద్విగుణమ్ము, సత్తేక మగును
ఆకసము కల్పనము చేయునట్టి మాయ
సత్పదార్థమునకు నాకసమ్మ నకును
ఎట్టిభేద మెఱుఁగకుండునట్టు చేసి
ధర్మధర్మి భావంబు వ్యత్యయము గాగ
సత్తుధర్మముగా. నాకసమ్మ ధర్మి
గాఁగఁ జేయుచుండును భ్రాంతిఁగలుగఁ జేయు.

ఆత్మనుండియె పుట్టె నయ్యాకసంబు
తార్కికులు లౌకికులు సత్పదార్థ మాక
సంబునుండి పుట్టెనిదె నిజమని యంద్రు
అదియు భ్రాంతాత్ములకుఁ దోచునదియె
యగును.

వట్టిదెట్లు వర్తించునో యట్టి దాని
కా యథార్థస్వరూపమే యవగత మగు,
భ్రాంతికల్గిన నన్యథాత్వంబు కలుగు
ననెడు న్యాయము లోకమునందు లేదె?

కంటికిని గానఁబడునటువంటి దెల్ల
శ్రుతివిచారాన నన్యమౌఁ జూవె; అదియు

కనఁబడని సత్పదార్థ ముండినది యగును
కనఁబడెడు నాకసమ్ము నుండనిది యగును.

ఆకసము సత్పదార్థము ననెడు రెండు
అర్థమున శబ్దమున వేఱులైన కతన
అవి పరస్పర భిన్నంబు లనఁగ వలయు
అగ్నికలదు వాయువు కలదనుట చేతఁ
గలదనెడు పద మన్నిటఁ గలదుగాని
వ్యోమమటుగాదు, అన్నిట నుండబోదు.

సకలమందుంట ధర్మియౌ సత్పదార్థ,
మాకసము నొక్కెడనె యుంటనగును ధర్మ;
మమలబుద్ధి సద్వస్తు వన్యముగఁ జేయు
వ్యోమమే స్వరూపంబున నుండుఁ జెపుమ.

ఆకసమునకు నవకాశ మనెడు రూప
ముంటచేతఁ బ్రత్యేకమై యుండదె యన
సత్తు గానిదియెల్ల నసత్తె కాదె,
ఉష్ణమును లేనిచో శైత్యముండుఁ గాదె
కాదనిన నీకు వాక్య భంగంబు వచ్చు.

ఆకసంబున్నదిగఁ దోచు నందువేని
అదియు మాకును సమ్మతమగును జూవె,
లేని దయ్యును నెది భాసమాన మగునొ
అదియు స్వప్నగజముగ మిథ్యయగుఁగాదె?

★

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల
10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు,
వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా
బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు : నవభారతి

సంస్కృత బాలశిక్ష

శ్రీ గరికపాటి సత్యనారాయణ, ఎం. ఏ.

౭

ఇంతవరకును సుబన్తములు దిఙ్మాత్రముగ నుదాహరింపబడినవి. ప్రస్తుతము వానిని జ్ఞాపకముంచుకొనుటకు నాయా విభక్తులకు సంబంధించిన వచనరూపములలోని సామ్యములను పాఠకులు గమనింపవలయును. ఇంచుమించు శబ్దములన్నింటిలోను ప్రథమాద్వితీయా విభక్తులకు జెందిన ద్వివచనరూపములకును, తృతీయా, చతుర్థీ, పంచమీ విభక్తులకు జెందిన యాయాద్వివచనరూపములకును షష్ఠీ సప్తమీ విభక్తులకు జెందిన ద్వివచనరూపములకును సామ్యముగలదు. ఒక్కొక్కప్పుడు కొన్ని కొన్ని శబ్దములలో పైన చెప్పబడిన విభక్తుల ద్వివచనరూపములు రెండేసి యుండవచ్చును. అయినను ఆ రెండు రూపములలో నేయొకదానితోనైనను పరస్పరముసామ్యముండి తీరును. ఉదాహరణమునకు అస్మచ్ఛబ్దమును దీసికొందము. దీనిలో ప్రథమా ద్వివచనము ఆవామ్. ద్వితీయా ద్వివచన రూపములగు ఆవామ్, నౌ అను వానిలో నొకటి ఆవామ్, అనునది యుండనే యున్నదిగదా. కావున వానికి సామ్యము స్పష్టముగ దెలియుచునే యున్నది. అట్లే తృతీయా ద్వివచనమగు ఆవాభ్యామ్కును, చతుర్థీవిభక్తికి గల రెండు ద్వివచన రూపములగు ఆవాభ్యామ్, నౌ అనువానిలో మొదటి రూపమునకును, పంచమీ ద్వివచనరూపమగు అవాభ్యామ్కును ఎట్టిభేదమును లేదు. అస్మచ్ఛబ్దమునకు గల షష్ఠీద్వివచనరూపములగు ఆవయోః, నౌఅనువానిలో ఆవయోఃకును సప్తమీవిభక్తికి జెందిన ద్వివచనరూపమగు ఆవయోఃకును భేదమేమియును లేదు. ఇట్టిదే యుష్మచ్ఛబ్దమునగూడ. సర్వనామశబ్దములలోని దకారాన్తములగు నీ యుష్మదస్మచ్ఛబ్దములను తప్పించి తక్కిన శబ్దములన్నింటిలో పైజెప్పబడిన విభక్తుల ద్వివచనరూపములలో గన్పించు సామ్యములధికముగా మరి రెండు సామ్యములు గన్పించును. అవి యాయాశబ్దముల చతుర్థీ పంచమీ విభక్తులకు జెందిన బహువచనరూపములలో గాన్పించును. ఉదాహరణమునకు సర్వనామ శబ్దములలోని పుంలిఙ్గశబ్దమగు సర్వశబ్దమును దీసికొందము. దీనిలో పై శబ్దములలో కన్పించు సామ్యముల కధికముగా రెండు కన్పించును. అవి చతుర్థీ పంచమీ విభక్తులకు జెందిన బహువచన రూపములలో. సర్వశబ్దమునకు చతుర్థీ బహువచనము సర్వేభ్యః. పంచమీబహువచనముగూడ సర్వేభ్యః అనియే. కావున పై రెండు విభక్తులకు జెందిన బహువచన రూపములలో సామ్యము స్పష్టమే. సర్వనామ శబ్దములలో తృతీయావిభక్తితో ప్రారంభమై, సప్తమీ విభక్తివరకును నాయావచన రూపములలో పుంలిఙ్గ శబ్దములకును, నపుంసకలిఙ్గశబ్దములకును భేదమేమియును లేకుండుటచే, నచ్చటగూడ నాయా చతుర్థీపంచమీ విభక్తుల బహువచన రూపములొక్కటిగనేయుండును. సర్వనామ శబ్దములలో పుంలిఙ్గనపుంసక

లిఙ్గశబ్దములను, సాధారణశబ్దములలో అకారాన్తములగు పుంలిఙ్గశబ్దములను-యుష్మదస్మచ్ఛబ్దములను తప్పించి మిగిలిన శబ్దములలో నధికముగా మరి రెండు సామ్యములు గాన్పించును. ఇవి యాయా శబ్దముల పంచమీ, షష్ఠీ విభక్తులను జెందిన యేకవచనరూపములలో. ఉదాహరణమునకు ఇకారాన్తమగు హరి యనెడు పుంలిఙ్గ శబ్దములో పంచమ్యేకవచనము హరేః. ఆశబ్దమున షష్ఠ్యేకవచనముగూడ హరేః అనియే. ఈ రెండిటికిని భేదమేమియును లేదుగదా. అల్లే ఇకారాన్తమగు మతియను స్త్రీలిఙ్గశబ్దమున గూడ పంచమీ విభక్తికి జెందిన యేకవచన రూపములగు మత్యాః, మతేః అనువానికిని షష్ఠీవిభక్తికి జెందిన యేకవచన రూపములగు మత్యాః, మతేః అనువానికిని భేదమేమియును లేదు.

అజన్తపుంలిఙ్గ విశేషశబ్దములలో నిర్జర అనెడి అకారాన్తపుంలిఙ్గ శబ్దమును దీసికొందము. ఈ విశేషశబ్దములలో చాల విభక్తులలో నాయావచనములకు సంబంధించిన వేర్వేరు రూపములు సామాన్యముగ రెండేసిగాని ఒక్కొక్కప్పుడు చెదురుగా మూడుగాని ఉండును. ఇచ్చట నిర్జరశబ్దములో పంచమ్యేకవచనరూపములగు నిర్జరాత్, నిర్జరసః అనువానిలో నిర్జరసః అనుదానికిని, షష్ఠ్యేకవచనరూపములగు నిర్జరస్య, నిర్జరసః అనువానిలో నిర్జరసః అనుదానికిని సామ్యము స్పష్టము. ఇవిగాక నపుంసకలింగ శబ్దములన్నింటిలో ప్రథమా ద్వితీయా విభక్తులకు సంబంధించిన మూడు వచనరూపములును ఒక్కటిగనే ఉండును. ఈ క్రింది ఉదాహరణముల నీ సందర్భమున గమనించునది.

- ద్వి- ఏబ
ప్రథమావిభక్తి :- జ్ఞానమ్- జ్ఞానే- జ్ఞానాని
ద్వితీయా ,, జ్ఞానమ్- జ్ఞానే- జ్ఞానాని
(అకారాన్త శబ్దము)
ప్రథమా :- మధు- మధునీ- మధూని
ద్వితీయా :- మధు- మధునీ- మధూని
(ఉకారాన్త శబ్దము)
కుర్వత్- కుర్వతీ- కుర్వన్తి
కుర్వత్- కుర్వతీ- కుర్వన్తి
(తకారాన్త శబ్దము)
ఏతత్- ఏతే- ఏతాని
ఏతత్ ఏతే ఏతాని
ఏనత్ ఏనే ఏనాని
(దకారాన్త శబ్దము)

ఈ ఏతచ్ఛబ్దమున క్రిందగీత గీయబడిన శబ్దరూపముల సామ్యమును పాఠకులు గమనింపనగును.

నపుంసక లిఙ్గశబ్దములలోని ప్రథమా ద్వితీయా విభక్తులకు సంబంధించిన వచన రూపముల సామ్యము వెనుకటి శబ్దములలో కన్పించు సామ్యముల కదనముగా నని పాఠకులు తెలిసికొనునది. అవిగాక చకారాన్తమగు జలముక్ఛబ్దమునను, జకారాన్తమగు భిషక్ఛబ్దమునను, తకారాన్తమగు మరుచ్ఛబ్దమునను, దకారాన్తమగు దివిషచ్ఛబ్దమునను, నకారాన్తమగు గుణిన్శబ్దమునను, శకారాన్తమగు విట్ఛబ్దమునను, హకారాన్తమగు లిట్ఛబ్దమునను, ఇప్పుడు చెప్పబడిన హలన్త పుంలిఙ్గశబ్దముల తుల్యాశబ్దములయందును. హలన్త స్త్రీలింగశబ్దముల యందును, ప్రథమాద్వితీయా విభక్తుల బహువచన రూపములకును, వీనితో పంచమీ షష్ఠీ విభ

క్తుల ఏకవచన రూపములకును సామ్యము గన్పించును. తకారాన్తమగు మరుచ్ఛబ్దమున ప్రథమా బహువచన రూపము మరుతః. దాని ద్వితీయా-బహువచన రూపముగూడ మరుతః. దాని పంచమీ-షష్ఠీ విభక్తులకు సంబంధించిన ఏకవచన రూపములుగూడ క్రమముగా మరుతఃయే యగును. ఇవిగాక యీపాఠమునకు ప్రారంభమున చెప్పబడిన సామ్యములును, చతుర్థీ, పంచమీ బహువచన రూపముల సామ్యమును యీశబ్దములలో నుండనే యున్నవి. హలన్త పుంలిఙ్గశబ్దములలో - నకారాన్తములగు రాజన్, ఆత్మన్ శబ్దములయందును, తత్తుల్య శబ్దముల యందును, సకారాన్తములగు శ్రేయశ్శబ్ద విద్వచ్ఛబ్దముల యందును, తత్తుల్య శబ్దముల యందును ద్వితీయా బహువచనమును బట్టియే తదితర విభక్తులకు సంబంధించిన ఏకవచన రూపములు మారుచున్నవి. వీని ద్వితీయా బహువచన రూపమునకును పంచమీ షష్ఠీ విభక్తులకు సంబంధించిన ఏకవచన రూపములకును సామ్యము గన్పట్టును. మిగిలిన సామ్యములన్నియు వెనుకటి మరుచ్ఛబ్దములో వలెనే వీనిలోగూడ నుండును.

ఇంక శబ్దముల యంతములను నిర్ణయించుటకు సులభ మార్గములు కొన్ని గలవు, అజన్తశబ్దములలో నాయాశబ్దము లేయంతముగా నుచ్చరింపబడెనో వానినిబట్టి యా యా శబ్దముల యంతములను నిర్ణయింప వీలగును. సర్వశబ్దము అకారాన్తము. మతిశబ్దము ఇకారాన్తము. లక్ష్మీశబ్దము, ఈకారాంతము. గోశబ్దము ఓకారాన్తము. కాని చాలవరకు హలన్తశబ్దములలో సామాన్యముగా ప్రథమా విభక్తికి సంబంధించిన ద్వివచన రూపము నందలి చివరి హల్లును బట్టి యా శబ్దము యొక్క అంతమేదో నిర్ణయింపవచ్చును. రాజన్శబ్దమునకు ప్రథమా - ద్వివచన రూపము రాజానౌ అనగా శబ్దరూపమున నకారము చివరి హల్లు. కావున ఇది నకారాన్తము. విద్వచ్ఛబ్దమునకు ప్రథమా ద్వివచన రూపము విద్వాంసౌ ఇచ్చట సకారము చివరి హల్లు-కావున నిది సకారాన్తము లిట్ఛబ్దమునకు ప్రథమాద్వివచన రూపము లిహౌ ఈ శబ్దరూపమున చివరి హల్లుహకారము. కావున నీశబ్దము హకారాన్తము కాని సర్వనామశబ్దములలోని యుష్మదస్మచ్ఛబ్దములకును, ఏతచ్ఛబ్దమునకును,యచ్ఛబ్దతచ్ఛబ్దములకును, కిమ్శబ్దమునకుకు, యన్వయింపదు. వానిని వ్యవహారమును బట్టియే తెలిసికొనవలయును.

ఒకశబ్దమే లింగములలో నున్నదను విషయమై కొన్ని విశేషముల నారయ యత్నింతము. సామాన్యముగా అకారాంతములగుశబ్దములు పుంలిఙ్గ శబ్దములనియు రమా, లక్ష్మీ, గౌరీ మొదలగు ఆకారాన్త, ఈకారాన్త శబ్దములు స్త్రీలింగ శబ్దములనియు, జెప్పవచ్చును. కాని ఈ విధముగా అంతమునుబట్టి ఇది ఈ లింగమున నుండునని సూత్రీకరించుటకు వలనుపడదు. ఏలన తకారాన్తములగు మహచ్ఛబ్దాదులు పుంలిఙ్గ నపుంసకలిఙ్గములలో సమముగాగలవు. తచ్ఛబ్దము మూడు లింగములలో దకారాన్తమే. అట్లే యచ్ఛబ్దమును. ఏతచ్ఛబ్దమునుగూడ ఇదమ్శబ్దమన్ని లింగములలో మకారా

స్తమే. అట్లే కిమ్మ్శబ్దముగూడ. అట్లే ఆకార, ఇకార, ఊకార, ఉకార, ఋకార ఓకారాన్త శబ్దములు ఒకే లింగమున నుండవలెనను నియమము కన్పట్టుటలేదు. విశ్వపాశబ్దము ఆకారాన్త మైనను పుంలిఙ్గము సేనానీశబ్దము ఈకారాన్తమైనను పుంలిఙ్గము. ఉకారాన్తమగు గురుశబ్దము పుంలిఙ్గశబ్దము, ఉకారాన్తమగు ధేనుశబ్దము స్త్రీలిఙ్గశబ్దము.ఉకారాన్తమగు మధుశబ్దము నపుంసకలిఙ్గశబ్దము. కావున ఇంకొక మార్గమేమైన విచారింతము. సామాన్యముగ పుంలిఙ్గమునందలి తకారాన్త శబ్దములును, నకారాన్త శబ్దములును, ఋకారాన్తశబ్దములును, సకారాన్తశబ్దములును స్త్రీలింగమున ఈకారాన్తము లగును. పుంలిఙ్గమున మహచ్ఛబ్దము స్త్రీలింగమున మహతీశబ్దమగును. పుంలిఙ్గమున ఋకారాన్తమగు కర్తృశబ్దము స్త్రీలింగమున కర్త్రీయగును. పుంలిఙ్గమున సకారాన్తమగు విద్వచ్ఛబ్దము స్త్రీలిఙ్గమున విదుషీయగును. గోశబ్దరూపము లన్నియు పుంలిఙ్గమునను స్త్రీలిఙ్గమునను సమముగా గలవు. అట్లే యుష్మదస్మచ్ఛబ్దరూపములు మూడు లింగములలో సమము గాగలవు, ఇవిగాక ఒక శబ్ద మేలింగమున నున్నది, ఆ శబ్దరూప మేవిభక్తి ప్రత్యయములో నంతమగుచున్నదను దానిపై నాధారపడి యుండును. ఒక శబ్దము పుంలిఙ్గమున నున్నది, నపుంసక లిఙ్గమున నున్నది ఆ శబ్దముయొక్క ప్రథమా - ఏక వచన రూపముపైగాని ద్వివచన రూపముపైగాని బహువచనరూపముపైగాని ఆధారపడి యుండును. పుంలిఙ్గ స్త్రీలింగ శబ్దముల భేదము లాయాశబ్దముల ద్వితీయా బహువచన రూపములను బట్టియు, తృతీయా, చతుర్థీ, పంచమీ, షష్ఠీ, సప్తమీ విభక్తుల ఏక వచనరూపములను బట్టియు చెప్పవచ్చును. వెనుకటి పాఠములలో కొన్ని శబ్దరూపముల నీ క్రిందివిధముగ సవరించుకొనవలెను.

హరిశబ్దమునకు తృతీయా బహువచనరూపము హరిభిః
కకుప్శబ్దమునకు ,, కకుబ్భిః
యుష్మచ్ఛబ్దమునకు ప్రథమా ఏక ,, త్వమ్
పాదశబ్దమునకు ద్వితీయాబహు ,, పాదాన్
వృత్రహన్శబ్దమునకు సంబోధన ప్రథమైకవచనరూపము హేవృత్రహన్.

రావణుని తమ్ముఁ డింద్రజిత్తనుటకు బదులు రావణుని కొడుకని సవరించికొనవలెను. ఇదమ్ శబ్దమునకు ప్రథమా విభక్తికి సంబంధించిన వచనరూపముల నీ క్రిందిరీతిగ చదువుకొనవలెను.

అయమ్ - ఇమౌ - ఇమే.

❖

మన దేశంలోని విశిష్ట చిత్రకారులు

శ్రీ వేలూరి రాధాకృష్ణ

౧

భారతదేశం లలిత కళలకు పుట్టినిల్లు. ఈ సత్యం చరిత్రద్వారా ఎప్పుడో వెల్లడిఅయింది. మానవజాతికి 'నాగరికత' అనే విషయం గురించి కించిత్తుజ్ఞానం కలిగిన క్షణంనుంచీ కళ, అతి విన్నాణంపు సొంపులతో రూపొంది దినదినాభివృద్ధి చెందుతూ శోభిల్లింది. ఈలలిత కళలలో అతిముఖ్యమయినదీ, దేశానికి ఖ్యాతి తెచ్చిందీ చిత్రకళ.

మానవ హృదయాన్ని కరిగింప, జేసేరాతిని నాతిగజేసే విశిష్టశక్తి చిత్రకళకు ఉంది. ఈ చిత్రకళను అన్నిదేశాలను మించి ముఖ్యంగా మనదేశంలో మన చిత్రకారులు, నవనూతన పంథాలలో సాధన చేశారు. మొదటినుంచీ పరదేశాలలో చిత్రకళ, ఐహిక చింతను ఎక్కువగా కలగజేసే, ప్రాపంచక విషయాలపై మనస్సును ఎక్కువ లగ్నంచేసేవిధంగా పెంపొందుతూ వచ్చింది. కాని మనదేశంలో చిత్రకళ భౌతిక విషయాల కతిదూరంగా ఆధ్యాత్మిక చింతను రేకెత్తిస్తూ, దేశమతాలకు చేదోడు వాదోడుగా వృద్ధిపొందింది. అందువల్లనే మనచిత్రకళ ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని అలంకరించింది. పాశ్చాత్యుల పొగడ్తల నందింది. అలాటి కళాసాధన చేసిన ఆ విశిష్ట చిత్రకారు లెవ్వరు? వారిపేర్లు వరుసగా తెలియకపోయినా, వారు తమపేరుకు ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వక తమచేతి కుశలత్వాన్ని మాత్రమే తెలియజేస్తూ వచ్చారు. అందులో ఎక్కువమంది మతావలంబకులూ, మతప్రచారకులూ, పరలోక చింతనలో, ఐహిక విషయాలనుంచి విముక్తి నొందించుకున్న యోగి పుంగవులున్నూ.

కాని కాలంమారింది. కాలంతోపాటు మనుజుల తీరుతెన్నులూ మారినవి. ఆంగ్లేయుల పరిపాలనలో, కొంతమంది, విశిష్ట వ్యక్తులు వచ్చి మనకళ విస్మృతమైయున్న సమయంలో, మన భారతీయులను మేల్కొలిపి, కళలోని బానిసత్వాన్ని పారద్రోలమని ప్రబోధించారు. అందులో అతిముఖ్యమైన వ్యక్తి కీ. శే ఇ.బి. హావెల్. ఇతడు ఆంగ్లేయుడైనప్పటికి, అనమాన సద్గుణ సంపన్నుడు. భారతీయ సంస్కృతిని పూజించిన మహనీయుడు. ఈ విశిష్ట వ్యక్తి సందేశాన్నందుకొని, అంతవరకూ పాశ్చాత్యుల శిక్షణలోనున్న శ్రీ అవనీంద్రనాథ టాగూరు, తన, విజాతీయ శైలికి స్వస్తి చెప్పి భారతీయమైన శైలిని పునఃప్రతిష్ఠ చేయటానికి కంకణం కట్టుకున్నాడు. అంతవరకూ పాశ్చాత్య శైలిలో సాధనచేస్తూ తమ ప్రాబల్యాన్ని చూపిన చిత్రకారులందరూ అట్టడుగుకు వెళ్ళిపోయారు. ఇ. బి. హావెల్, అవనీంద్రులసమిష్టికృషివల్లననే, అనేకమైన మార్పులు మనకళలో పొడసూపినవి. ఆ మార్పులే భారతీయ శైలికి క్రొత్తప్రాణాన్ని పోసినవి. శ్రీ అవనీంద్రుల శిక్షణ క్రింద తర్ఫీదు అయిన విద్యార్థులంతా, దర్మిలా మేటి చిత్రకారులై భారతదేశం నలుమూలలా వ్యాపించి భారతీయ కళాసందేశాన్ని అందరికీ అందజేశారు. భారతీయ శైలిని తమతమ వ్యక్తిగత విశిష్ట సృజనారీతులలో పెంపొందించటం నేర్పింది శ్రీ అవనీంద్రులే. మొన్నమొన్నటివరకూ అదేపంథాలో కళను పెంపొందిస్తూ తమ స్వకీయ రీతులను ప్రజలకు ప్రదర్శించి ఖ్యాతిని గడించారు. భారతీయ చిత్రకారులు తమ విశిష్టత్వాన్నే భారతీయ కళా వైశేష్యాన్నీ, క్రొత్తక్రొత్తగా పొడసూపుతున్న విజాతీయ శైలులతో మలినపరచి, తమకేకాక దేశానికికూడా ద్రోహం చేస్తున్నవారవుతున్నారు. ఈ అనుకరణ విధానం ఎంతత్వరగా మానితే అంతమంచిది. భారతీయ శైలికి దెబ్బ తగలకుండా, తమతమ స్వకపోల కల్పితమైన వ్యక్తిగత రీతులను నవనూతనంగా సృష్టిస్తూ కళాసాధన చేయటం ఎంతైనా ప్రోత్సహించ

దగిందే. నేనుకాదన లేను. ఈటువంటి 'అనుక రణే' ఎంతో శోచనీయమైంది.

కీ.శే. అవనీంద్రుల బోధనా సమయంలోనే నవభావాలను స్వకీయ రీతులలో కళాసాధన చేసిన విశిష్ట వ్యక్తులు లేరూ? భారతీయశైలికి వారు ఆవిధంగా అపకారం చేయదల్చారా? గగనేంద్రనాథ టాగూరు శైలి ఎటువంటిది? గురుదేవుడు రవీంద్రుల రచనా కౌశలమెటువంటిది? వీర్వంతా భారతీయ శైలికి ఏ విధమైన అపకారం జరగకుండా తమతమ విశిష్టత్వాన్ని తమ సృజనా రీతులలో ప్రశంసనీయంగా కన బర్చగల్గారు. వారి శైలులలో ప్రాక్పశ్చిమాల మేళవింపు ఎంతో సొంపుగా కానవస్తుంది. వారు నిజంగా కళలో హేమాహేమీలనే చెప్ప వచ్చును. కీ. శే. శ్రీ అవనీంద్రులే తమ చరమ దశలో రచించిన ఒక విశిష్ట రచన ఇప్పటికీ నాకు మార్గదర్శకంగా కనిపిస్తుంది. అది ఎప్ప టికీకూడా మార్గదర్శకం కాగలదని నా గట్టి నమ్మకం, అందులో అంతటిసత్యం దాగిఉంది.

వారు అప్పటికే యువచిత్రకారులలో కలుగబోయే పరిణామాన్ని పసిగట్టారా అన్నట్లుగా కనిపిస్తుంది. గురుదేవుని 'అంతిమయాత్ర' ని రెండుమూడు కుంచె ఝళిపింపులలో ప్రశంస నీయంగా ప్రదర్శింప దల్చారు. ఆ వైతరిణీ నది మనకన్నుల యెదుట సాక్షాత్కరిస్తున్నట్ల నిపిస్తుంది. అందులో విజాతీయమైందేమీ కాన రాదే!

ఇంకా చెప్పాలంటే కీ. శే. గగనేంద్రులు ఆ రోజుల్లో ఎంతోగొప్పగా చెప్పుకున్న 'క్యూబిస్టు' కళను పాశ్చాత్యులు రచించిన క్యూబిస్టు శైలినిగాక భారతీయమైన శైలిలో, తన స్వకపోలశక్తిచే, పూర్తిగా భారతీయంగా సృష్టి జేసిన 'హిమగిరి నిర్ఝరులు' అనేచిత్రం మరపురాని మచ్చుతునక కాదూ! అందులో రంగుల పొందిక, వెలుగునీడల తారతమ్యం, ఎంత కుశలతతో చూపబడినవి! అందులో అనుకరణ విధానం ఏదీ?

అంతవరకూ విదేశాలలో కళ నభ్యసించి భారతదేశానికి తిరిగివచ్చి క్రొత్త పంథాలో సృష్టించిన అమృతా షెర్‌గిల్ చిత్రాలు భారతీయ శైలిని కోల్పోలేదే! ఆమె రూపురేఖలకి ఎక్కువ ప్రాముఖ్యాన్నివ్వకుండా కన్నులకు కొట్టవచ్చే రంగులలో ఆకారాలని పొందుపరచి, ఏవిధమైన రంగుల తారతమ్యంలో, ఒక సరిక్రొత్త విధానాన్ని మన కళ్ళయెదుట సాక్షాత్కరింప జేసింది. పాపమామె ఇంకా ఎన్నో అమూల్య కళాఖండాల నందజేయవలసిన సమయంలో తన 29 వ యేట, 1941 వ సంవత్సరంలో దివంగతురాలైంది. ఆమె తరువాత శ్రీ జమినీరాయ్ విషయం చెప్పవలసి యుంటుంది. తన ప్రదేశంలో, అనాదికాలంనుంచీ అతి నిరాడంబరంగా పెంపొందుతూ వచ్చిన జానపద చిత్రసరళిని ఆదర్శంగా పెట్టుకొని, ఆ విశిష్ట శైలిలో కళాసాధన చేశాడు. వంగదేశీయ 'పాట్' శైలి చాలాగొప్పది. జమినీరాయ్‌కి పూర్వం, దీనిని ఎక్కువగా పరికించినవారే లేకపోయారు. ఈ వంగదేశీయ 'పాట్' శైలినే తనవ్యక్తిగత రీతిలో అనేకమైన సాంకేతిక రూపాలలో కేవలం ఒకటి రంగులలో మనకు వ్యక్తంచేశాడు శ్రీ జమినీరాయ్. ఇందులోని భారతీయ సాంప్రదాయం అనేకమంది పాశ్చాత్య చిత్రకారులనీ కళా విమర్శకులనూ ఆకర్షించింది. అంతవరకూ మరుగునవున్న జమినీరాయ్ ఒక్కమాటుగా విశ్వవిఖ్యాతిని గాంచాడు. అతని చిత్రాలు భారతదేశంలోనే కాక, అన్నదేశాలలోనూ ప్రకటిత మయినవి. శ్రీ జమినీరాయ్ అడుగుజాడలలోనే జానపద చిత్రశైలిని అవలంబించిన విశిష్ట వ్యక్తి శ్రీమతి సునయినీదేవి. కళాజాగృతి ముఖ్యంగా వంగదేశంలోనే ఉత్పన్నమైంది. ఈ ఘనత వంగదేశానికే దక్కుతుంది....

జమినీరాయ్ చిత్రాలనుచూచి, మిగతా ప్రాంతాలవారు తమతమ ప్రాంతాలలో ప్రవర్ధిల్లిన జానపద శైలిని పునరుజ్జీవింప సంకల్పించి తమ పూర్వసాధనా రీతులకు స్వస్తిచెప్పి, ఆయా జానపద శైలులకు చెందిన సాంకేతిక చిహ్నాలనే సహాయంగా కొని సరిక్రొత్త జానపద చిత్రాలను రచించటం ప్రారంభించారు.

అలా సాధనచేసి అతి నిరాడంబరంగా రచించిన చిత్రాలను ప్రదర్శించి ఆచిత్రకారులంతా జమినీరాయ్ విధంగానే మంచి పేరుప్రఖ్యాతులను పొందారు. ప్రపంచమంతటిలో రవీంద్రులూ, అవనీంద్రులవలె జమినీరాయ్ కూడా విశిష్ట స్థానాన్ని అలంకరించారు. అతడు అసలు జానపదశైలికే పితయని చెప్పవచ్చును. భారతీయ కళకు పితగా శ్రీ అవనీంద్రుల కిదివరకే బిరుదివ్వబడింది. వీరిద్దరినీ అనుసరించిన ఏ వ్యక్తిఅయినా ప్రసిద్ధి గాంచటం సహజమే. వారి పేరుప్రతిష్ఠ యెలావున్నా భారతీయ జానపద శైలికి అనమానమైన సేవజేసిన వారయూరు. దాని జీవితపు గడువును మరింత పొడిగించిన వారయూరు.

ఇంకా పేర్కొనదగిన భారతీయ చిత్రకారులలో శ్రీ శైలాజ్ ముఖర్జియా. ఇతని చిత్రశైలికూడా వంగదేశీయ 'పాట్' శైలికి సంబంధించింది. అయినప్పటికిన్నీ అమ్రితా షెర్‌గిల్ సాధనచేసిన రీతిని అనుసరించాడా అని అనిపిస్తుంది. మొదటగా 'పాట్' శైలిలో రచించిన ఇతని చిత్రాలలోనూ, తరువాత తైలవర్ణాలలో రచించిన చిత్రాలలోనూ చాలా తారతమ్యం కనిపిస్తుంది. రూప వివరణ ఏమీఉండదు. రేఖాగతి అతి నిరాడంబరంగా కనిపిస్తుంది. కొట్టవచ్చేటట్లు ఎరుపురంగూ, పసుపురంగూ మాత్రం అతని చిత్రాలలో కనిపిస్తవి. మూడేళ్ళక్రితం ఇతనికి లలితకళా ఎకాడమీవారు 'ఆకులురాలు కాలంలోని ఒక మధ్యాహ్నం' అనేఒక తైలవర్ణ చిత్రానికి రాష్ట్రపతి బంగారు పతకాన్ని ఇచ్చారు. ఈ చిత్రంలోని ఏ విశిష్ట శక్తివల్ల కళా విమర్శకులు ముగ్ధులయారంటే, అందులోని అతినిరాడంబరమైన రచనారీతి వల్లనేనని అనిపిస్తుంది. ఒకస్త్రీ సీక్కు తోడుతున్నట్లూ, ఒక నూతినదనున్న వాతావరణాన్ని ఎరుపు పసుపు రంగులలో ప్రదర్శించగల్గిన శక్తినే వారు మెచ్చుకున్నారాఅని అనిపిస్తుంది, ఇతడు పారిస్‌లో పరిణామం పొందుతున్న కళతో సంబంధం పెట్టుకున్నప్పటికీ ఇతనిలో కుంటి అనుకరణ విధానం కనిపించదు.

శాంతినికేతనంలోని కళాభవనపు శిల్పశాఖకు ఆచార్యుడుగా నున్న రామకింకర్ మరియొక 'భారతీయ' విశిష్ట కళాకారుడు. అతని శిల్పాలలో నేమి, చిత్రాలలో నేమి విజాతీయత ఏమాత్రం కనిపించదు. తను ఉత్తమమని ఎంచిన రీతిని మంచి గాంభీర్యమైన ఆకారాలని శిల్పంలో మలుస్తాడు. అదేరీతిన రెండుమూడు మట్టిరంగులలో చిత్రిస్తాడు. ఈ రెండురీతుల లోనూ, ఒకేభావం వెల్లివిరుస్తుంది. భారతీయ సాంప్రదాయాన్ని నిలబెట్టాలని వాదించేవారిలో శ్రీరామకింకర్ ప్రముఖుడు.

మహారాష్ట్ర దేశానికి చెందిన్న శ్రీ అల్మేల్కర్ ఒక ప్రముఖ చిత్రకారుడుగా పేర్కొనదగును. ఇతడు జానపద శైలినీ, అధునాతన శైలినీ పూర్తిగా మేళవించి ఒక చక్కని నిరాడంబరమైన రూపాన్నిస్తాడు. భారతీయ శైలికి ఒక సరిక్రొత్త రూపాన్నిచ్చి చూపరులను ముగ్ధులను చేస్తాడు. ఆ ఆకర్ణాంతపు నేత్రాలూ, తీర్చిన ముక్కు, విశాలఫాలం, దొండపళ్ళను మరపించే పెదిమలూ, మహారాష్ట్ర రీతిన కనపర్చిన చీరకట్టూ, ఆ చీరపై చూపిన అతి స్వచ్ఛమైన సాంప్రదాయానుగుణంగా చేసిన అలంకరణా, ఆ స్త్రీమూర్తి చిత్రానికి అంతా ఒక సరిక్రొత్త సొంపుని తెస్తుంది.

మాసఫలములు

ఏప్రిల్ 15 — మే 15

శ్రీ 'బుధ'

మేషము.

(అశ్వ, భర, కృత్తి,1పా.)

భాగ్య, రాజ్యాధిపతుల వక్రస్థితి మంచిది కాదు. యత్నకార్య విలంబన. ప్రయాసవలన గాని పనులు సమకూరవు. మీ అభిమతము భ్రాంతికర,వృత్తి ఉద్యమములలో కేంద్రీకృతమై అవ్యక్త మార్గములలో నడిపిస్తుంది. పట్టుదల, అధికారవాంఛ, ఆగ్రహావేశము, తిరస్కార భావం, లోకమర్యాదను పాటించకపోవడం, మొదలగు స్వాభావిక మార్పు వలన కార్యహాని. ప్రభుత్వ ఉద్యోగస్థులకు, పబ్లిక్ సంస్థలలో పనిచేయువారికి, పదవియందాధిక్యత. భాగస్థుల సహకారంతో వ్యాపారలాభం. శుభసంబంధముగాను, దంభముకొఱకు, ఆదాయమునకు మించిన ఖర్చు. జన్మరాశియందున్న రవికి, ఇంద్ర, వరుణ, పాపదృష్టివలన అనారోగ్యం, స్థానచలనం, పితృగండం.

వృషభము.

(కృత్తి 2,3,4 రోహి, మృగ, 1.2 పా.)

ప్రాముఖ్యత జెందిన పెక్కు సమస్యల నెదుర్కొనవలసి వచ్చును. బాధ్యతగల పనులలో ప్రాముఖ్యత వ్యయప్రయాసల కోర్చి మీ సహన శక్తితో ఫలప్రదం జేసుకోగలుగుతారు. మీ న్యాయప్రవర్తన గౌరవస్థానాన్ని అలంకరింపజేస్తుంది. సాంఘిక వ్యవస్థలో పరస్పర స్నేహానుబంధాలు పెంపొందుతాయి. విజ్ఞానము సాహిత్యమునకు సంబంధించిన పనులు ఫలిస్తాయి. సమయానుకూలంగా భాగస్వాములు, స్నేహితులు కలసి రాకపోవడంతో, యత్నకార్య విలంబన, ఆశాభంగము. కృషి, వ్యాపారాదులలో సామాన్యలాభం. జన్మరాశియందు, శుభుడైన శుక్రస్థితివలన గృహస్థ జీవితమందు సుఖము, శుభకార్య నిర్వహణ.

మిథునము.

(మృగ 3, 4, ఆరుద్ర, పున 1, 2, 3,)

జన్మరాశి యందంగారకస్థితి. షష్ఠసప్తమములలో శని, గురు, వక్రము మంచిదికాదు. వ్యామోహము, భౌతిక ఫలాపేక్ష, పెడమార్గముల నడిపిస్తుంది. అనవసర వ్యవహారాలలో జోక్యం కల్పించుకొని శ్రమపడతారు. ఉద్యోగ,వ్యాపారాది కృషులకు భంగకరము లగు పరిస్థితి. మనశ్చాంచల్యము, నిర్ణయశక్తి లోపిస్తుంది. నిర్మాణాత్మకంగా ఏఒకపనియు కాదు. ప్రయాసవలనగాని పనులు సమకూరవు. ఏకాదశి రవిస్థితి వలన, స్నేహితులు, ప్రయాణములు. అధికారులవలన కార్యసిద్ధి, ధనలాభము. వ్యయమందు శుక్రస్థితి వలన ఋణధనప్రాప్తి, శుభసంబంధమైన ఖర్చు.

కర్కటకము.

(పున 4, పుష్యమి, ఆశ్రేష)

పాపస్థితి వదలి శుభస్థితికి చేరిన గ్రహములే, తిరిగి ఈనెలలో వక్రించినవి. అందుచే అభివృద్ధికి ఆటంకము. యత్నకార్య విలంబన. శని, అంగారకులు, శతృ, వ్యయస్థానగతి. మిగులచెడ్డది శుభాన్ని సహితం అశుభంగా, మార్చగలశక్తి వుంది. రహస్య శతృత్వమువలన కార్యహాని. సాంఘిక, రాజకీయ సమస్య లొకవైపు, ఆర్థిక గృహస్థ విషయములు మరొకవైపు వ్యాకుల పరుస్తాయి. చిత్త శాంతత, సుఖము ఉండదు. నిస్పృహ పనికిరాదు. ఇదేకాలములో దశ, మేకాదశ స్థితిని బొందిన రవి, శుక్రులవలన, తలవని తలంపుగా యత్నకార్యములు నెరవేరి చిక్కులన్నీ తొలగుతాయి. ఉన్నత పురుషుల సహకారం. పదవియం దాధిక్యత, వ్యవహారిక విజయం. ప్రయాణములవలన ధనలాభము. వ్యాపారలాభము - శుభకార్య

నిర్వహణ - ఇవ్విధంగా మిశ్రమఫలితాలు జరుగుతాయి

సింహము

(మఖ, పూర్వ, ఉత్తర 1 పా)

రాజ్యలాభములలో శుక్రాంగారక స్థితి మంచిది వృత్తి వ్యాపారాది కృషులలో కలసి రాగల సూచన పంచమస్థానములో శని వక్రమువలన. మీ ఆలోచనలు మీరే మార్పు జేసుకొనుట నిరుత్సాహం పడుట. పట్టుదల లేకపోవుటచే యత్న కార్య విలంబన మే 10 నుండి శుక్రునకు లాభస్థితిచే మీ ఆలోచనలు నిర్మాణాత్మకంగా ఫలప్రదమవుతాయి చిత్ర కళా పారిశ్రామికులకు, వ్యాపారస్తులకు మిక్కిలి అనుకూలం. ఆర్థికాభివృద్ధి, నూతన వస్తువాహనస్థితి. బంధుమిత్రుల సహకారం వివాహాది శుభకర్మ సాంఘిక, గృహస్థ జీవితమందు సుఖము, గౌరవము.

కన్య

(ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1 2 పా)

జన్మాదె నాలుగు కేంద్రములలోనూ, పాపగ్రహస్థితి. పైగా అష్టమరవి ఇది మిగుల అశుభసూచన ఉన్నవి చాలక అదనంగా మరి కొన్ని చిక్కులు కలుగుతాయి స్వభావాది శీలమునకు పరీక్ష తాత్కాలిక భౌతిక ప్రయోజనములకొరకు కాలానుగుణ్యంగా మీ ఆధ్యాత్మిక ఔన్నత్య ఆశయాలు లొంగ కపోవుటచే కష్టములకు గురిగాక తప్పదు. గృహస్థ, సాంఘిక జీవితమందు అశాంతి. వర్తక వ్యాపారాదికృషులు లాభించవు. మీ కళానైపుణ్యము ప్రయోజనాత్మకం కాజాలదు ఆర్థికచిక్కులు పదచ్యుతి గౌరవహాని మే 10 నుండి, క్రమక్రమంగా చిక్కులు తొలగి ఇష్టకార్యసిద్ధి,ధనలాభము వ్యవహారిక విజయం చేకూరగలవు.

తుల

(చిత్త 3, 4 స్వాతి, విశాఖ 1, 2, 3)

ఇతరుల మాటల నమ్మి కార్యాచరణకు దిగితే కడగండ్లు తప్పవు. దంభముకొరకు ధనవ్యయము తగదు ఈర్ష్య, అసూయ వలన కార్యహాని ధనస్థానములో గురువక్రము. సకాలములో ద్రవ్యము చేతికి రాదు ఉత్తర ప్రత్యుత్తరములవలనపనులుకావు స్వయంగా ప్రయాణము చేయవలసి వచ్చును ఉద్యోగ వ్యాపారములలో స్వల్పలాభము పోటీదా రులవలన వ్యాపారస్తులకు కొన్ని చిక్కులు. అష్టమశుక్రస్థితివలన భోగవిలాసా పేక్షకుల కును, నూతనవస్తువాహనములకై ధన వ్యయము, సాహిత్యము, కళలలో పరిశ్రమ చేయువారికిమిత్రుల సహకారంతో కార్యసిద్ధి. సప్తమ రవిస్థితివలన. బంధుమిత్ర విరోధము కళత్ర అనారోగ్యము

వృశ్చికము

(విశాఖ 4 అనూ, జ్యేష్ట)

అన్ని విషయాలలో అతిగా ప్రవర్తించడం. అవసర పడటం. వాగ్వివాదనులు. శాస్త్ర పరిశోధన, పరమార్థచింతన, సత్కార్మాసక్తి. ఉద్యోగ వ్యాపారాది కృషులలో నూతన మార్గముల నవలంబించుట, శక్తికిమించిన కార్యాచరణ, రవి శుక్ర శుభస్థితివలన, పదవి యందాధిక్యత వ్యవహారజయం క్రయ విక్రయలాభం కాని ద్వితీయాష్టమములలో శని కుజ పాపగ్రహస్థితివలన ఆర్థిక గృహస్థ జీవితమందు కొన్ని చిక్కులు రాగలవు. స్పెక్యులేషనువలన నష్టము ప్రయాణము లలో ఆకస్మిక ప్రమాదములు కుక్కకాటు వలన ప్రమాదము

ధనస్సు

(మూల, పూషా. ఉషా 1 పా)

గ్రహస్థితి ప్రతికూలం యత్నకార్య విలంబన. ఉద్యోగ, వ్యాపారాది కృషులకు ఆటంకములు నిరుపయోగమైన కార్యాచరణ ద్రవ్యాభావమువలన కొన్ని ఇబ్బందులు, స్వంతపనులు కాకపోయినను సాంఘిక రాజకీయములలో యత్న కార్యములు ఫలించి సర్వజనాను మోదమైన గౌరవమును చేకూర్చును. దీర్ఘప్రయాణములు. జన్మరాశి

యందు శని కుజ సమసప్తకం మిగులచెడ్డది మీకుగాని, కళత్రమునకుగాని అనారోగ్యం, గాయములు తగులును. ఆపరేషను చేయించుకొనవలసివచ్చును

మకరము

(ఉషా 2.3.4 శ్రవణము. ధనిష్ట 1.2 పా)

మీ ఔదార్యము గొప్పదనము, విజ్ఞానము, పట్టుదల ప్రత్యక్షానుభవంలో చూపవలసిన పరిస్థితి ఏర్పడుతుంది స్వార్థపరత్వం తలక్రిందు జేస్తుంది పరులకొరకు చేయు ప్రయత్నములు ఫలిస్తాయి. సాంఘిక, రాజకీయములలో జయం. శని వ్యయమందు వక్రత్వమువలన స్వంత వ్యవహారములలో విలంబన పబ్లిక్ రంగములో పనిచేయు ఉద్యోగులకు - వాటాదార్లలకు లాభము. సంతతివలన శుభం. కృషికి తగిన ఆదాయము కనుపించినా సమయమునకు చేతికిరాదు. అనారోగ్య కారణములచే గృహస్థ జీవితమందశాంతి.

కుంభము

(ధని 3, 4 శత - పూభా 1.2.3 పా)

గ్రహస్థితి అనుకూలం. యత్నకార్యసిద్ధి విజ్ఞానాత్మకంగా మీరుచేయు కృషి ఫలించి గౌరవమును చేకూర్చును - పదవీలాభము- ఆర్థికాభివృద్ధి విద్యార్థులకు పరీక్షలలో విజయం. వ్యాపారలాభం. సాంఘిక రాజకీయములలో గౌరవస్థానాన్ని ఆక్రమించగల అవకాశము శుభకార్య నిర్వహణ. దూరపు ప్రయాణాలు ఆగిపోతవి వర్తమానములు సకాలములో చేరకపోవుటవలన యత్న కార్య విలంబన స్నేహితుల నమ్ముటవలన ఆశాభంగము.

మీనము

(పూభా 4. ఉ. భా. రేవతి,)

జన్మాది, నాలుగు కేంద్రములలో పాప గ్రహస్థితి. కర్మస్థానములో శని వక్రము. మిగుల చెడ్డది. మీ న్యాయప్రవర్తనను, లోకం అపార్థం జేసుకొంటుంది శంకిస్తుంది కాని మీ నిగ్రహశక్తి వ్యాప్తిజెంది విజయాన్ని చేకూర్చగలదు. యత్నించిన సాహస కృత్యములలో ప్రాముఖ్యత బాధ్యతలు ఎక్కువ అవుతాయి మానసిక ఆందోళన యీ నెలలో మీ ప్రయత్నములు. నిర్మాణాత్మకం కాజాలకపోయిననూ తృతీయ శుక్రస్థితివలన, అందుకు కావలసిన ప్రాథమిక చర్యలు పూర్తిఅవుతాయి. శత్రు వ్యవహార విజయం. ఋణధన ప్రాప్తి. వృత్తి. వ్యాపారాది కృషులలో స్వైర్యలేటు చేయుట తగదు. మధ్యవర్తుల పరిష్కారమార్గములలో లౌకిక వ్యవహారములలో ధనలాభం శని కుజ సమసప్తక స్థితివలన సాంఘిక రాజకీయ వ్యవహారములలో పట్టుదలలు పెరిగి బహిరంగ శత్రుత్వం, ఏర్పడుతుంది. గ్రహస్థితినిబట్టి యీ మాసములో నూతన ప్రయత్నములు తలపెట్టకుండుటయే మంచిది.